

సూర్య

నేటి దినపత్రిక



www.suryaa.com

సంపుటి 11 | సంచిక 134

శనివారం | 10 మార్చి 2018 | హైదరాబాద్ | పేజీలు 12+16 | వెల: రూ. 5.00

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం

శ్రీ హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయనం, శిశిర రుతువు, ఫాల్గుణ మాసం, బహుళ పక్ష తిథి : అష్టమి ఉ.6.55, మూల పూర్తి, వర్జ్యం మ.1.13 నుంచి 2.59 వరకు,
రాహుకాలం: ఉ.9.00 నుంచి 10.30 వరకు; దుర్ముహూర్తం: ఉ.6.00 నుంచి 7.36 వరకు, సూర్యోదయం : ఉ.6.31 గం; సూర్యాస్తమయం: సా. 6.22 గం.

మేలో డొనాల్డ్ ట్రంప్, కిమ్ జాంగ్ భేటి

- కిమ్ జాంగ్ ఉన్‌తో సమావేశానికి డొనాల్డ్ ట్రంప్ అంగీకారం
- మే నెలలోగా ఇరు నేతల భేటీ
- నేతలిద్దరూ ఆసక్తిగా ఉన్నారు
- యుద్ధ మేఘాలను తొలగించేందుకు ట్రంప్ నిర్ణయం ఉపకరిస్తుంది
- సౌత్ కొరియా జాతీయ భద్రతా సలహాదారు వెల్లడి



వాషింగ్టన్ : ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్‌ను కలిసి చర్చలు జరిపేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంగీకరించారు. ఉత్తర కొరియా అణు పరీక్షలు, ఆపై అమెరికా ఆంక్షలు పెట్టడం, నేతల మధ్య మాటల తూటాలు... ఇలా ఎన్నో నెలల పాటు రెండు దేశాల మధ్య నెలకొన్న యుద్ధ మేఘాలు తొలగేందుకు ఇది ఎంతో సహకరిస్తు oదని వైట్ హౌస్ వ్యాఖ్యానించింది. ప్రస్తుతం అమెరికాలో పర్యటిస్తున్న సౌత్ కొరియా

మిగతా 6లో

కారుణ్య మరణానికి సుప్రీం అంగీకారం

- స్వచ్ఛంద మరణాన్ని కోరుకునే వారికి ఆ హక్కు కల్పిస్తూ సుప్రీం కోర్టు సంచలన తీర్పు
- స్వచ్ఛంద మరణానికి సుప్రీం అనుమతి
- కేంద్ర విధి విధానాలకు ఓకే
- గౌరవంగా మరణించే హక్కు ఉంటుంది
- బతికేందుకు మార్గం లేదని తేలితేనే
- ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం కీలక తీర్పు

న్యూఢిల్లీ : విధిలేని పరిస్థితుల్లో మరణించాలని భావించే వారికి వారు కోరిన అవకాశాన్ని దగ్గర చేయాలని సుప్రీం కోర్టు కీలక రూలింగ్ ఇచ్చింది. స్వచ్ఛంద మరణం (యూథనాషియా)పై దాఖలైన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం అందుకు అనుమతించింది. ఇప్పటికే స్వచ్ఛంద మరణంపై నియమ నిబంధనలను తయారు చేసిన కేంద్రం దానిని కోర్టుకు అందించగా, విచారించిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం

మిగతా 6లో



అప్పుల్లో టిఆర్ఎస్, టిడిపి

- టీఆర్ఎస్ అప్పు రూ.15.97 కోట్లు
- టీడీపీకి 8.86 కోట్ల
- దేశంలోనే సంపన్న పార్టీగా సమాజ్ వాదీ పార్టీ
- రెండో స్థానంలో డిఎంకే, మూడో స్థానంలో అన్నడీఎంకే పార్టీ
- 2015-16 నాటి గణాంకాల మదింపు
- సమాజవాదీ ఆస్తులు రూ. 639.96 కోట్లు
- డీఎంకే ఆస్తుల విలువ రూ. 257 కోట్లు
- అన్నాడీఎంకే వద్ద రూ. 224 కోట్ల విలువైన ఆస్తులు
- 2011-12లో సమాజ్‌వాదీ ఆస్తుల విలువ రూ. 212.86 కోట్లు మాత్రమే
- ఏకంగా 198 శాతం పెరిగిన ఆస్తుల విలువ
- స్థిరాస్తులు, రుణాలు, అడ్వాన్స్‌లు, డిపాజిట్‌లు, టీడీఎస్ తదితరాలన్నీ పరిగణనలోకి తీసుకుని ఆస్తుల విలువ లెక్కింపు
- అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్ వెల్లడి









న్యూఢిల్లీ, సూర్య ప్రధాన ప్రతినిధిః తెలుగు రాష్ట్రాలను పాలిస్తున్న టీఆర్ ఎస్, టీడీపీలు అప్పుల్లో కూరుకుపోయాయి. దేశంలోని ప్రాంతీయ పార్టీలకు ఉన్న ఆస్తులను ఢిల్లీకి చెందిన అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) వెల్లడించింది.

ఇందులో తెలుగు రాష్ట్రాలను పాలిస్తున్న టీఆర్ ఎస్, తెలుగుదేశం పార్టీల అప్పుల్లో ఉన్నట్లు వెల్లడించింది. టీఆర్ఎస్‌కు రూ.15.97కోట్ల అప్పులు ఉండగా, తెలుగుదేశం పార్టీ మాత్రం రూ.8.86 కోట్ల మేరకు అప్పుల్లో ఉన్నట్లు సంస్థ తెలిపింది. అయితే దేశంలోని ప్రాంతీ య పార్టీలలో అత్యంత సంపన్న పార్టీగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన సమాజ్‌వాదీ పార్టీ ఉంది. ఉత్తర్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్‌కు చెందిన సమాజ్‌వాదీ పార్టీ ధనిక పార్టీగా నమోదైంది. 2015-16 ఆర్థిక సంవత్సరంలో ఆ పార్టీ ప్రకటించిన వివరాల ప్రకారం సమాజ్‌వాదీ పార్టీ మొత్తం ఆస్తుల విలువ రూ. 634.96కోట్లు. ఇక రూ. 257.18కోట్ల ఆస్తులతో తమిళనాడుకు చెందిన డీఎంకే, రూ.224.84 కోట్లతో అన్నాడీఎంకే పార్టీలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ మేరకు దిల్లీకి చెందిన అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్(ఏడీఆర్) తన నివేదికలో పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం.. 2011-12 ఆర్థిక సంవత్సరంలో ఎస్పీ ప్రకటించిన ఆస్తుల విలువ రూ.212.86కోట్లు మాత్రమే. 2015-16 ఆర్థిక సంవత్సరం నాటికి ఆ పార్టీ ఆస్తులు 298శాతం పెరిగి రూ. 634.96 కోట్లుగా ఉన్నాయి. ఇక 2011-12 ఆర్థిక సంవత్సరంలో అన్నాడీఎంకే ఆస్తులు రూ.88.21కోట్లు మాత్రమేనని నివేదిక తెలిపింది. పార్టీల స్థిరాస్తులు, లోన్లు, అడ్వాన్సులు, డిపాజిట్లు, టీడీఎస్, పెట్టుబడులు, ఇతర ఆస్తులు కలిపి ఈ నివేదిక రూపొందించారు. 2011, 2012 సంవత్సరాల్లో రెండు కొత్త పార్టీలు వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీలు కూడా ఈ జాబితాలో చేరాయి. 2012-13 ఆర్థిక సంవత్సరంలో ఈ పార్టీల సగటు ఆస్తులు రూ.1.165కోట్లు కాగా.. 2015-16 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.3.765 కోట్లకు పెరిగినట్లు నివేదిక చెబుతోంది. ఇక అప్పుల పరంగా తెలంగాణరాష్ట్ర సమితి(టీఆర్ఎస్), తెలుగు దేశం పార్టీ(టీడీపీ) తొలి రెండు స్థానాల్లో ఉన్నాయని పేర్కొంది.

2015-16 ఆర్థిక సంవత్సరంలో ప్రాంతీయ పార్టీలు ప్రకటించిన అప్పుల వివరాల ప్రకారం.. టీఆర్ఎస్‌కు రూ.15.97కోట్లు, టీడీపీకి రూ.8.86కోట్ల మేర అప్పులు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. మరో పార్టీ శివసేన మాత్రం తన అప్పులను చాలా వరకు తగ్గించుకున్నట్లు పేర్కొంది.







ప్రాణం పోయేంత వరకు

కేసీఆర్‌తోనే

- నా పుట్టుక టీఆర్ఎస్‌లోనే, చావు కూడా టీఆర్ఎస్‌లోనే
- సీఎం కేసీఆర్ బాటే నా బాట
- వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్‌దే గెలుపు
- కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా కూడా రాదు
- ఉనికి కోసమే కాంగ్రెస్ నేతల బస్సు యాత్ర
- సోషల్ మీడియాలో పుకార్లు నమ్మొద్దు
- పుకార్లు వ్యాప్తి చేసేవారిపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరా
- సోషల్ మీడియా ప్రచారంపైనా చర్యలు
- రాష్ట్ర భారీ నీటిపారుదల మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : తాను క్రమశిక్షణ కలిగిన కార్యకర్తనని, ముఖ్యమంత్రి కేసీఆర్ బాటే తన బాటని రాష్ట్ర భారీనీటిపారుదలశాఖ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు. తాను పార్టీ మారుతున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవమని ఆయన చెప్పారు. నా పుట్టుక టీఆర్ఎస్ లోనే..చావు కూడా టీఆర్ఎస్ లోనేనని హరీశ్ రావు అన్నారు.ఇప్పటికీ ఈ విషయాన్ని తాను పలుసార్లు చెప్పానని పేర్కొన్నారు. ఇకనైనా ఈతరహా వార్తలు రాయొద్దని హరీశ్ రావు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి తప్పుడు ప్రచారం చేసేవారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరినట్లు హరీశ్ రావు తెలిపారు. శుక్రవారం తెలంగాణభవన్‌లో హరీష్‌రావు, మంత్రి తలసానితో కలిసి మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు చెప్పిన మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేరన్నారు. వారు అధికారంలోకి రారన్న విషయం వారికి కూడా తెలుసునని చెప్పారు.టీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, సీఎం కేసీఆర్ చిత్త శుద్ధి ప్రజలకు తెలుసునని హరీష్ పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలు మోకాళ్లమీద యాత్రలు చేసినా..వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్‌దే గెలుపని మంత్రి హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఉనికి కోసమే కాంగ్రెస్ నేతలు బస్సు యాత్ర చేస్తున్నారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు ఏనాడో విశ్వసనీయతను కోల్పోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంచి నీళ్ల కోసం ప్రజలు ధర్నాలు చేసేవారని, తాము అధికారంలోకి వచ్చిన తరువాత ఇంటింటికి మంచినీళ్లు ఇస్తున్నమని హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నాలుగు కిలోల బియ్యం ఇస్తే, మేం సీలింగ్ లేకుండా మనిషికి ఆరు కిలోలు ఇస్తున్నామన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని ప్రతీ అంశాన్ని అమలు చేశామని పేర్కొన్నారు. కాంగ్రెస్

మిగతా 6లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

మోడీ కన్నా వాజ్‌పేయి మేలు

మళ్లీ వస్తా ఎన్నికల్లో పోటీ చేస్తా : సోనియా గాంధీ




- గతాన్ని తలచుకుని కన్నీరు పెట్టుకున్న సోనియా గాంధీ
- తన భర్తను తలచుకున్న సోనియా
- ఇందిర హత్య అనంతరం రాజీవ్ రాజకీయ ప్రవేశం అనివార్యమైంది
- ఆయన కూడా కుటుంబానికి దూరమవుతారని ఆందోళన చెందాను
- అందుకే అప్పట్లో రాజకీయాల్లోకి వద్దన్నాను
- రాహుల్ యువతరానికి ప్రతినిధి: సోనియా గాంధీ


ముంబయి : అవసరం అయితే తాను 2019 ఎన్నికల్లో పోటీ చేస్తానని కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ చెప్పారు. ప్రస్తుతం దేశంలో స్వేచ్ఛాయుత వాతావరణం లేదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ప్రశ్నించే గొంతులను నొక్కేస్తున్నారని వాపోయారు. దేశానికి ప్రధానిగా తన కంటే కూడా ప్రధాని మన్మోహన్ సింగ్‌కే ఎక్కువ అర్హత ఉందని ఆమె పునరుద్ఘాటించారు. గాంధీ కుటుంబం లేకపోయినా కాంగ్రెస్ పార్టీ బతుకుతుందని, తమతో కలసి వచ్చే పార్టీలను కలుపుకొని ముందుకు వెళతామని ఆమె స్పష్టం చేశారు. తన కుమారుడు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ యువతరాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. ఇక రాజకీయాల్లో తన కుమార్తె ప్రియాంక గాంధీ రావడం

మిగతా 6లో

బడ్జెట్ కౌంట్ డౌన్ షురూ



- 1.49 లక్షల కోట్ల అంచనా
- 90 వేల కోట్లకు చేరిన రాబడి
- జనవరి వరకు ఆదాయ వ్యయాల నివేదిక కాగ్‌కు సమర్పణ
- గత ఏడాదితో పోలిస్తే పెరిగిన రెవెన్యూ రాబడి
- జీఎస్టీ ప్రభావంతో తగ్గిన ఆదాయం
- బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేసిన ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్
- కేసీఆర్ సూచనల మేరకు బడ్జెట్




హైదరాబాద్, సూర్య ప్రధాన ప్రతినిధిః తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ కౌంట్ డౌన్ మొదలైంది. ఈనెల 14 లేదా 15 బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు ఆర్థిక శాఖ సన్నాహాలు మెదలుపెట్టింది. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు దిశానిర్దేశం మేరకు వరుసగా ఐదో ఏడాది భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దేశంలోని రెవెన్యూ మిగులు ఉన్న రాష్ట్రాల్లో ఒకటైన తెలంగాణలో ఆర్థిక పరిస్థితులేంటి.. గతేడాది జూలై నుంచి అమల్లోకి వచ్చిన జీఎస్టీ ప్రభావం ఎంత.. ఆదాయ వ్యయాలెలా ఉన్నాయో.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తమ ఆదాయ వ్యయాల చిట్టాను కాగ్‌కు సమర్పించింది. 2018 జనవరి నెలాఖరు వరకు ఉన్న వివరాలను ఇందులో పొందుపరిచింది.

రూ.1.10 లక్షల కోట్లకు ఆదాయం!

కాగ్‌కు సమర్పించిన నివేదిక ప్రకారం. 2017-18 ఆర్థిక సంవత్సరంలో మిగులు ఆదాయం ఉంటుందని ప్రభుత్వం వేసిన అంచనాలు అందుకోవటం కష్టంగానే మారింది. మొత్తం రూ.1.49 లక్షల కోట్ల రాబడి అంచనా వేసిన ప్రభు త్వం ఫిబ్రవరి నెలాఖరు వరకు రూ.1.09 కోట్ల ఆదాయాన్ని అందుకుంది. అందులో రూ.93 వేల కోట్లు ఖర్చు చేసింది. సగటున ప్రతినెలా రూ.9 వేల కోట్ల ఆదాయం నమోదైంది. అదే

మిగతా 6లో

అంతా ఇంతే!



లీడర్ కన్నా రీడర్ గొప్పవాడు మేడం

ఈశాన్యాన ప్రగతి జ్యోతి

- అనుమానాలు వద్దు రాష్ట్రానికి అండగా ఉంటాం: మోడీ
- అగర్తలాలో మాట్లాడిన ప్రధాని మోడీ
- ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చి చూపిస్తాం
- త్రిపురలో బీజేపీ సర్కార్‌కు ప్రధాని హామీ
- సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన విప్లవ్ కుమార్ దేవ్
- ప్రమాణ స్వీకారానికి హాజరైన మోడీ, అద్వానీ, మురళీ మనోహర్ జోషి
- త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ కూడా

అగర్తలా : త్రిపురలో నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వానికి కేంద్రం పూర్తి స్థాయిలో అండగా నిలబడుతుందని ప్రధాని నరేంద్ర మోడీ హామీ ఇచ్చారు. సమాఖ్య స్ఫూర్తితో ఈశాన్య రాష్ట్రాలను మరింతగా వృద్ధిలోకి తెస్తామన్నారు. అగర్తలాలోని అసోం రైఫిల్స్ మైదానంలో శుక్రవారం జరిగిన త్రిపుర మంత్రివర్గం ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 'అపారమైన సహజ వనరులు ఈశాన్య ప్రాంతాన్ని అభివృద్ధిలోకి తీసుకురావాలన్నదే కేంద్ర ప్రభుత్వ సంకల్పం. కొత్త శిఖరాలను చేరే మీ (ఈశాన్య) ప్రయాణంలో యావత్ దేశం అండగా నిలుస్తుంది. త్రిపుర ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపడానికి అవసరమైన సహాయ సహకారాలన్నీ కేంద్రం అందిస్తుంది. ఈ విషయంలో మీకు ఎలాంటి అనుమానాలూ అక్కరలేదు' అని ప్రధాని మోడీ భరోసా ఇచ్చారు. ఈ సదర్భంగా త్రిపుర కొత్త ముఖ్యమంత్రి



విప్లవ్ కుమార్ దేవ్‌ను, ఉప ముఖ్యమంత్రి విష్ణు దేవ్ వర్మా, ఇతర మంత్రులకు శుభాభినందనలు తెలిపారు. ఏపీ, బీహార్, అసోంలకూ ఇలాగే : పార్లమెంట్‌లో

మిగతా 6లో



6లో

ఆందోళనలతో లోక్‌సభ వాయిదా

- 'సేవ్ ఏపీ' నినాదాలతో హోరెత్తిన లోక్‌సభ
- సభను నడిపించేందుకు విశ్వయత్నం చేసిన స్పీకర్
- చివరకు వాయిదా
- 'శాంతి' తరువాత 'హంగామా' అని స్పీకర్ వ్యాఖ్య

రాజీనామాలకు రాష్ట్రపతి ఆమోదం

- సుజనా, అశోక్ రాజీనామాలను ఆమోదించిన కోవింద్
- రాజీనామాలను ఆమోదించాలని ప్రధాని సిఫార్సు
- ఆ వెంటనే సంతకం చేసిన రాష్ట్రపతి
- ప్రధాని కార్యాలయానికి అందిన సమాచారం



6లో

మార్చ్‌కు నిరాకరణ: అరెస్టులపై కోదండరాం ఫైర్

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: తెలంగాణ ఉద్యమాన్ని కీలక మలుపు తిప్పిన ఘట్టం మిలియన్ మార్చ్ వార్షికోత్సవాలకు ప్రభుత్వం అనుమతివ్వలేదు. మార్చి 10న కార్యక్రమాన్ని నిర్వహిస్తామని టీజేఏసీ ఇదివరకే ప్రకటించిన నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు. గురువారం రాత్రి నుంచే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మొదలైన అరెస్టుల పర్వం శుక్రవారం సైతం కొనసాగుతున్నది. కాగా, ఈ అరెస్టులను కోదండరాం ఖండించారు. నిర్బంధాల ద్వారా ప్రజాస్వామిక ఆకాంక్షలను అణిచివేయలేరని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తక్షణమే జేఏసీ నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మిలియన్ మార్చ్ సందర్భంలోనే కోదండరాం నూతన రాజకీయ పార్టీ ప్రకటన చేయాలని భావించడం తెలిసిందే. మార్చ్‌కు అనుమతి లేదు : ఈ నెల 10వ తేదీన ట్యాంక్ బండ్‌పై మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభ నిర్వహణకు అనుమతించాలి టీజేఏసీ, సిపిఐలు ఇప్పటికే పోలీసులను కోరాయి. ఆట, పాట, మాట అనే కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అనుమతించాలని కోరుతూ తెలంగాణ జెఏసి తరపున చాడ ఈ నెల 2న నగర సెంట్రల్ జోన్ డిసిపికి దరఖాస్తు చేశారు. అయితే, నగరం నడిబొడ్డున కార్యక్రమం చేపట్టడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం, ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయని, పైగా పరీక్షలు కూడా జరుగుతుండటంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతారని, అందుకే అనుమతి ఇవ్వడం కుదరదని డిసిపి ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో జరిగిన మిలియన్ మార్చ్‌లో సంఘ విద్రోహశక్తులు చొరబడి పెద్ద ఎత్తున విధ్వంసం సృష్టించిన అనుభవాన్ని కూడా పోలీసులు గుర్తుచేశారు. ఆ సందర్భంగా చాలా మందికి గాయాలు కావడం, ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగిందని, ఆప్పట్లో చాలా మందిపై క్రిమినల్ కేసులు నమోదైనట్లు గుర్తు చేశారు. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకునే అనుమతి నిరాకరిస్తున్నట్లు తెలిపారు.



సారూ! పార్టీపై దృష్టిపెట్టండి!

● పార్టీ కమిటీల ఏర్పాటుకు మోక్షం ఎప్పుడు? ● ఎదురుచూస్తున్న అధికార పార్టీ నేతలు ● మూడేళ్లుగా పలు జిల్లా కమిటీలు ఖాళీ ● పొలిట్ బ్యూరోదీ అదే పరిస్థితి ● టీఆర్ఎస్‌లో పదవుల అలజడి

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి : అధికార టీఆర్ఎస్‌లో సంస్థాగత పదవుల అలజడి మళ్లీ మొదలైంది. ఎన్నికలు జరిగేందుకు మరో ఏడాది మాత్రమే గడువు ఉండడంతో సారూ..పార్టీపై దృష్టి పెట్టండీ అంటూ టీఆర్ఎస్ పార్టీ నేతలు గులాబిదళపతి, సీఎం కేసీఆర్‌ను దీనంగా వేడుకుంటున్నారు. జిల్లాలలో పార్టీ అభివృద్ధికి పాటు పడుతున్న వారికి సరైన గుర్తింపు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీకి కీలకమైన పొలిట్‌బ్యూరోతో సహా రాష్ట్రస్థాయిలో అనుబంధ సంఘాలు, జిల్లా కమిటీలు, నియోజకవర్గ స్థాయి కమిటీలు దాదాపు మూడేళ్లుగా ఖాళీగా ఉండటంపై పార్టీ ముఖ్యనేతల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పార్టీ జిల్లా కమిటీలకు పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ప్రకటించలేదు. కొత్త జిల్లాలు ఏర్పాటయ్యాక పాత జిల్లాలకు అధ్యక్షులుగా ఉన్నవారు నామమాత్రంగా మిగిలిపోయారు. ఇందులో కొంతమందికి రాష్ట్రస్థాయి కార్పొరేషన్లకు చైర్మన్లుగా అవకాశం లభించడంతో జిల్లా పార్టీని పెద్దగా పట్టించుకోవడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మొత్తంగా జిల్లా స్థాయిలో పార్టీ నాయకుల సమస్యలు, ఆధిపత్య పోరు, విభేదాలను పట్టించుకునే యంత్రాంగం లేకుండాపోయిందని పార్టీ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఉద్యమకాలంలో పనిచేసిన నాయకులు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయస్థితి నెలకొందని పేర్కొంటున్నారు. గత ఎన్నికల సందర్భంలో, తర్వాత టీఆర్ఎస్‌లో చేరిన ఇతర పార్టీల నాయకులు చాలా నియోజకవర్గాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. దీనితో ఉద్యమకాలంలో పనిచేసిన నాయకులను పట్టించుకునేవారెవరో అర్థంకాక.. త్రిశంకు స్వర్గంలో



కొట్టుమిట్టాడుతున్నామని పార్టీ నేతలు వాపోతున్నారు. ఇతర పార్టీల నుంచి చేరి ఎమ్మెల్యేలుగా గెలిచిన, ఎన్నికల తర్వాత ఇతర పార్టీల నుంచి చేరిన ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల్లో పరిస్థితి దారుణంగా మారింది.

జిల్లాలో పార్టీకి భరోసా ఏదీ? : టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పార్టీకి రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కమిటీలు, అనుబంధ సంఘాల నిర్మాణంపై దృష్టి పెట్టిన దాఖలాలు లేవు. పలు జిల్లాలలో పార్టీ పదవులు ఖాళీగా ఉన్నాయి. జిల్లా ఇన్‌చార్జి మంత్రులే జిల్లా పార్టీకి మార్గనిర్దేశం చేస్తున్నారు. నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేల నిర్ణయమే ఫైనల్ అని గులాబిదళపతి ముఖ్యమంత్రి కేసీఆర్ పలుసార్లు స్పష్టం చేశారు. దాంతో నామినేటెడ్ పదవుల్లో, ఇతర అంశాల్లో పార్టీ ఎమ్మెల్యేల ప్రతిపాదనలను మాత్రమే జిల్లా ఇన్‌చార్జి మంత్రులు పరిగణనలోకి తీసుకుంటున్నారు. నియోజకవర్గ స్థాయి నిర్ణయాల్లోనూ, నియామకాల్లోనూ ఎమ్మెల్యేల ప్రతిపాదనలను కాదని నిర్ణయం తీసుకునే పరిస్థితి నెలకొంది, ఇతర నియోజకవర్గాల్లో జోక్యం చేసుకునే పరిస్థితి జిల్లా మంత్రులకు సైతం లేదు. నామినేటెడ్ పదవులు, ఇతర పనులు ఆశించే నాయకులపై ఎమ్మెల్యేలకు విశ్వాసం లేకుంటే.. ఆ నాయకులను కాపాడుకునే వ్యవస్థ టీఆర్ఎస్‌లో లేకుండా పోయిందని పార్టీ శ్రేణులు తీవ్ర అంసతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. మండల, జిల్లా స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని పూర్తిచేస్తే పార్టీ మరింతగా బలపడనుందని వారంటున్నారు

పనిచేసే వారికి గుర్తింపు నివ్వాలి : పార్టీకి పనిచేసిన వారిని గుర్తించి, పార్టీ నుంచి కూడా ప్రతిపాదనలను తీసుకుంటే అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం దక్కుతుందని స్పష్టం చేస్తున్నాయి. అలా కాకుండా కేవలం ఎమ్మెల్యేలకే సర్వాధికారాలు ఇస్తే.. పార్టీకి కష్టకాలంలో పనిచేసిన వారికి ఇబ్బందులు వస్తున్నాయని కొందరు నేతలు చెబుతున్నారు. దీనితో పాటు ఎమ్మెల్యే తీరు నచ్చని పలువురు పార్టీ ముఖ్యుల పరిస్థితి ఆగమ్యగోచారంగా తయారయ్యింది. కాంగ్రెస్, టీడీపీతో పాటు ఇతర పార్టీల నుంచి గెలిచి, టీఆర్ఎస్‌లో చేరిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో పరిస్థితి దయనీయంగా మారిందని పేర్కొంటున్నారు. ఉద్యమకాలంలో పని చేసిన పార్టీ నేతలకు ఆయా ఎమ్మెల్యేలు వ్యతిరేకంగా ఉండటం, జిల్లా స్థాయిలో మంత్రులు పట్టించుకోకపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచకుండా పోతోందని అంటున్నారు. గతంలో పార్టీ అధినేత కేసీఆర్, ముఖ్యులు కేటీఆర్, హరీశ్‌రావు, కవిత వంటివారికి సమస్యలు చెప్పుకొనే అవకాశం ఉండేదని.. ఇప్పుడు వాళ్లెవరూ అందుబాటులో ఉండటం లేదని, వారిని కలిసి పరిస్థితిని తెలియజేయాలని హైదరాబాద్‌కు వెళ్లినా వారు దొరకడం లేదని, సమయం కూడా ఇవ్వడంలేదన్న అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

రైతుల పంట రుణాలను మాఫీ చేయాలి



హైదరాబాద్, మేజర్‌న్యూస్: 2013-14లో రిజర్వ్ బ్యాంక్ ఆదేశాలకు అనుగుణంగా రీషెడ్యూల్ చేయబడ్డ వ్యవసాయ పంట రుణాలను మాఫీ చేయాలని బీజేఎల్పీ నేత జి.కిషన్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం సీఎం కేసీఆర్‌కు ఆయన బహిరంగ లేఖ రాశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఆదిలాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఆనాడు ఏర్పడిన కరువు కారణంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఈ మూడు జిల్లాల్లోని బ్యాంకులకు అన్ని రకాల పంట రుణాలు రీ షెడ్యూల్ చేయాలని ఆదేశించిందని తెలిపారు. ఈ మార్గదర్శకాలకు అనుగుణంగా బ్యాంకులు, బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయం పొందిన కో-ఆపరేటివ్ సొసైటీలు రైతులకు ఇచ్చిన అన్ని రకాల పంట రుణాలను మొదటి ఏడాది మారిటోరియం ప్రకటించి, తదనంతరం 2016-17 రెండు ఏళ్లు రీ షెడ్యూల్ చేశారు. 2014లో టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే లక్ష రూపాయల లోపు రైతుల రుణాల మాఫీ ప్రకటించి, విడతల వారీగా నిధులు విడుదల చేయడంతో..ఈ మూడు జిల్లాల రైతులకు రీ షెడ్యూల్ ప్రకటించినందున 25శాతం రైతు ఖాతాలల్లో జమ చేయలేదని, బ్యాంకులు మారిటోరియం నిబంధనల కారణంగా ఈ నిధులను తిరిగి ప్రభుత్వానికి చేరినట్లు పేర్కొన్నారు. అర్హులైన రైతులందరికీ రుణ మాఫీ చేసేలా చర్యలు చేపట్టాలని కిషన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

11న టీఆర్ఎస్ ఎల్పీ సమావేశం



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: ఆదివారంనాడు తెలంగాణభవన్‌లో టీఆర్ ఎల్పీ సమావేశం నిర్వహించాలని పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. సోమవారం నుంచి శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సభలో అధికార పార్టీ సభ్యులు మాట్లాడే అంశాలను, విపక్షాల ఆరోపణలను తిప్పికొట్టేందుకు ఈ సమావేశంలో కేసీఆర్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దశ, దిశ నిర్దేశనం చేయనున్నారు. బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఈ సమావేశంలో చర్చిస్తారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొనాలని సీఎం ఆహ్వానించారు. మధ్యాహ్నం 1.0గంటకు తెలంగాణ భవన్‌కు చేరుకుని భోజనం చేస్తారు. మధ్యాహ్నం 2.30గంటలకు ఎల్పీ సమావేశం ప్రారంభం కానుంది. సింగరేణి బొగ్గు గని కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన వెంకట్రావు, రాజిరెడ్డిలు ప్రగతి భవన్లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి వారిని అభినందించారు. సింగరేణి బొగ్గు గని కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షురాలు, ఎంపీ కల్వకుంట్ల కవిత కూడా చిత్రంలో వున్నారు.

కేంద్రం నిధులు ఎలా రప్పిద్దాం

● మంత్రివర్గం నుంచి తప్పుకున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంపై దృష్టి ● బీజేపీతో పొత్తు వల్ల మనకు ఒరిగిందేమీ లేదు ● పార్టీ నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ● పరిణామాలను పరిశీలించేందుకు వ్యూహ కమిటీ ఏర్పాటు ● మంత్రులు, టీడీపీ ముఖ్య నేతలతో చంద్రబాబు అత్యవసర సమావేశం



వెలగపూడి, సూర్య ప్రత్యేక ప్రతినిధి : కేంద్ర మంత్రివర్గం నుంచి తెలుగుదేశం ఎంపీలు వైదొలిగినందున కేంద్ర సాయంతో రాష్ట్రంలో అమలయ్యే ప్రాజెక్టులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాల్సిన ప్రత్యామ్నాయాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించారు. ఈ మేరకు పార్టీ ముఖ్య నేతలతో తన నివాసంలో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కళా వెంకట్రావుతో పాటు మంత్రులు లోకేశ్, యనమల, సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి, కాల్వ శ్రీనివాసులు, పయ్యావుల కేశవ్, కుటుంబరావు తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. కేంద్రం నుంచి రాబట్టుకోవాల్సిన నిధులు, రాష్ట్ర రాజకీయాలపై ప్రధానంగా చర్చిస్తున్నారు. ప్రత్యేక హోదాపై కేంద్రంపై ఒత్తిడి పెంచుతూనే కేంద్ర నిధులు ఏ విధంగా రాబట్టుకోవాలనే కోణంలో ఈ సమావేశంలో కీలక చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఉపాధి హామీ వంటి పథకాల్లో బకాయిల కారణంగా పేద కూలీలు ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఉపాధి హామీ బకాయిలకు రాష్ట్ర నిధుల నుంచే చెల్లింపులు జరపాలని ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. ఇదే తరహా ఇబ్బందులు మరిన్ని వస్తే రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో పడుతుందంటూ ప్రభుత్వ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో సీఎం చంద్రబాబు తాజా సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

చంద్రబాబు అధ్యక్షతన వ్యూహ కమిటీ భేటీ : అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన టీడీపీ వ్యూహ కమిటీ మరోసారి భేటీ అయింది. ఈ సమావేశంలో మంత్రులు యనమల రామకృష్ణుడు, కళావెంకట్రావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కాలవ శ్రీనివాసులు, లోకేశ్, అచ్చెన్నాయుడు తదితరులు పాల్గొన్నారు. తాజా రాజకీయ పరిణామాలు, రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై చర్చించనున్నారు. ఢిల్లీలో పరిణామాలతో పాటు రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలతో పాటు ఎంపీల ఆందోళన నేపథ్యంలో కేంద్రం నుంచి స్పష్టత రాకపోతే ఎలాంటి వ్యూహం అనుసరించాలనే దానిపైనా చర్చించే అవకాశం ఉంది. ఈ నెల 11న పొలిట్‌బ్యూరో సమావేశం జరగనుంది. దీనిలో రాజ్యసభ అభ్యర్థులను ప్రకటించడంతో పాటు తాజా రాజకీయ అంశాలపైనా కీలకంగా చర్చించే అవకాశం ఉంది.

పొత్తు వల్ల ప్రయోజనం లేదు : బిజెపితో పొత్తువల్ల రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి అదనంగా ఒరిగిందేమీ లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ముఖ్యనేతల వద్ద అభిప్రాయపడ్డారు. సాధారణ ఎన్నికల కంటే ముందే జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తాజా రాజకీయ పరిణామాలపై ఎప్పటికప్పుడు చర్చించుకునేందుకు ఓ వ్యూహ కమిటీని ముఖ్యమంత్రి చంద్రబాబు ఏర్పాటు చేశారు. కమిటీలో యనమల రామకృష్ణుడు, కళా వెంకట్రావు, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, అచ్చెన్నాయుడు, కాల్వ శ్రీనివాసులతో పాటు మండలి చీఫ్ విప్ పయ్యావుల కేశవ్, సలహాదారులు పరకాల ప్రభాకర్, కుటుంబరావు ఉన్నారు. పరిణామాలను ఎప్పటికప్పుడు నిశితంగా గమనించాలని కమిటీకి చంద్రబాబు ఆదేశించారు. 2014 సార్వత్రిక ఎన్నికలకు ముందు పార్టీ పరిస్థితిని చంద్రబాబు తన నివాసంలో వ్యూహ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో విశ్లేషించారు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాతే బీజేపీతో పొత్తు పెట్టున్నామని, పొత్తు తర్వాత జరిగిన 2014 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ వల్ల టీడీపీకి అదనంగా ఓట్లు ఏమీ పడలేదని సీఎం అన్నట్లు సమాచారం. పొత్తులేకుండా ఎన్ని ఓట్లు వచ్చాయో పొత్తు తర్వాత అవే ఓట్లు తెలుగుదేశం పార్టీకి వచ్చాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా రాష్ట్రానికి ఏదైనా మేలు జరుగుతుందేమోనన్న ఉద్దేశంతోనే పొత్తు పెట్టుకున్నామని తెలిపారు. కేంద్ర మంత్రులతో రాజీనామాలు చేయించిన తర్వాత ప్రజాభిప్రాయం ఎలా ఉందని నేతలను చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు.


98 శాతం మంది ప్రజలు ఈ నిర్ణయాన్ని అభినందిస్తున్నారని మంత్రులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రమంత్రివర్గం నుంచి తెలుగుదేశం ఎంపీలు వైదొలిగినందున కేంద్ర సాయంతో రాష్ట్రంలో అమలయ్యే ప్రాజెక్టులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాల్సిన ప్రత్యామ్నాయాలపై చంద్రబాబుదృష్టి సారించారు. ఈ మేరకు పార్టీ ముఖ్య నేతలతో తన నివాసంలో ఆయన సమావేశమయ్యారు. కేంద్రం నుంచి రాబట్టుకోవాల్సిన నిధులు, రాష్ట్ర రాజకీయాలపై ఇందులో ప్రధానంగా చర్చించారు.

పార్లమెంటు వెలుపల టీడీపీ ఎంపీల ఆందోళన
కోయదొర వేషంలో ఆకట్టుకున్న ఎంపీ శివప్రసాద్



న్యూఢిల్లీ, సూర్య ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం తెలుగుదేశం ఎంపీలు అలుపెరుగని పోరాటం సాగిస్తున్నారు. దీనిలో భాగంగానే శుక్రవారం కూడా పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ఎంపీలు ఆందోళన చేశారు. ప్లకార్డులు చేతబట్టి ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేసిన అశోక్‌గజపతిరాజు తొలిసారి ఆందోళనలో పాల్గొన్నారు. చిత్తూరు ఎంపీ శివప్రసాద్ కోయదొర వేషంలో ఆందోళనలో పాల్గొన్నారు.

11న టీడీపీ పొలిట్ బ్యూరో సమావేశం



సూర్య, అమరావతి ప్రధాన ప్రతినిధి : ఈ నెల 11న టీడీపీ పొలిట్ బ్యూరో సమావేశం జరగనుంది. రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక, తాజా రాజకీయ పరిణామాలు, కేంద్రం నుంచి ఎంపీలు వైదొలగడం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. రాజ్యసభ ఎన్నికల సందర్భంగా టీడీపీకి 2 స్థానాలు వస్తాయి. మూడో అభ్యర్థిని రంగంలోకి దించటమా? లేదా? రెండు స్థానాల్లో ఎవరిని ఎంపిక చేయాలన్నదానిపై ఈ సమావే శంలో చర్చించనున్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని విభజన హామీలు అమలు చయకపోవడం వంటి పరిణామాలపై కూడా చర్చలు జరపనున్నారు. రాజ్యసభ స్థానాలు ఎవరికో : రాజ్యసభ స్థానాలు ఎవరికి దక్కుతాయోనని తెలుగుదేశం పార్టీలో ఉత్కంఠ నెలకొంది.

ప్రమాదంలో తెలంగాణ ప్రజాస్వామ్యం


● దళితులు, అణగారిన వర్గాలకు న్యాయవ్యవస్థపై నమ్మకం సన్నగిల్లుతోంది ● నేరెళ్ల కేసు మూడు నెలలైనా విచారణకు రాలేదు ● దళితులకు న్యాయవ్యవస్థలోను న్యాయం జరగడం లేదు ● తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, మేజర్‌న్యూస్: తెలంగాణలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. నేరెళ్ల ఘటన కేసు మూడు నెలలు అయినా ఇప్పటికీ విచారణకు రాలేదని అన్నారు. తెలంగాణలో దళితులకు, అణగారిన వర్గాలకు న్యాయవ్యవస్థపై నమ్మకం పోయే రోజులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నేరెళ్ల కేసు మూడు నెలలు అయినా విచారణకు రాలేదని, ఇది ఏం న్యాయవ్యవస్థ అంటూ ఉత్తమ్ ప్రశ్నించారు. దళితులకు న్యాయవ్యవస్థలో కూడా న్యాయం జరగకుంటే వారు ఎవరికి చెప్పుకోవాలని ఆయన అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్‌లో జరిగిన పీసీసీ ఎస్సీ సెల్ ప్లీనరీ దిశ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్, ఇవ్వకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. దళితులను పెద్ద ఎత్తున మోసం చేసిన కేసిఆర్ రాబోయే ఎన్నికలలో తగిన బుద్ది చెప్పాలని అన్నారు. నేరేళ్ళలో ఇసుక మాఫియాకు మంత్రి కేటిఆర్ అండగా ఉండి దళితు ప్రాణాలను బలి తీసుకున్నారని ఆరోపించారు. నాలుగు ఏళ్ళ పాటు దళితులకు భూమి ఇవ్వకుండా నాన్చివేత ధోరణిని ప్రభుత్వం అవలంభిస్తోందన్నారు. అర్హులైన దళితులకు వెంటనే మూడు ఎకరాల భూమి ఇవ్వాలని లేకపోతే, ఎకరానికి 5 లక్షల చొప్పున 15 లక్షల రూపాయలు వారి పేరిట బ్యాంకులో డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎఐసిసి ఎస్.సి సెల్ చైర్మన్ కొప్పుల రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాలలో ఎల్.డి.ఎం.ఆర్.సి విధానాల ప్రకారం పనిచేస్తే ఖచ్చితంగా రానున్నా ఎన్నికల్లో 25 సీట్లు గెలుస్తామని చెప్పారు. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆలోచనా విధానం ప్రకారం పనిచేయాలని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలంటే దళితుల మద్దతు తప్పనిసరి అన్నారు. దళితులకు మేలు జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ఆయన అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి ఆర్సీ కుంతియా మాట్లాడుతూ ప్రతిపక్షాలను బలహీన పరిచేందుకు కేసిఆర్ మూడో ఫ్రంట్ అంటూ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. కేంద్రంలో మోదీని, రాష్ట్రంలో కేసీఆర్‌ను రానున్నా ఎన్నికల్లో ఓడించేందుకు ప్రజలు సిద్దంగా ఉన్నారని అన్నారు. పార్టీ పదవుల్లో, రానున్నా ఎన్నికల్లో రాహుల్ గాంధీ యువకులకు, దళిత, గిరిజన, బిసిలకు ప్రాధాన్యత ఇవనున్నారని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. టీ-పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ టిఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో దళితులకు జరుగుతున్న అన్యాయాలు, నిర్బంధాలు, నియంత పాలనపై గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున చర్చ చేపట్టాలన్నారు. దళిత ఉప ముఖ్యమంత్రిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసి దళితుల్ని కేసీఆర్ అవమానపర్చారని అన్నారు. అవమానాలు, అసమానతలు లేని సమాజాన్ని



నిర్మించాలని అంబేద్కర్ కలలు కన్నారని పేర్కొన్నారు. మనమంతా కలిసి పనిచేస్తేనే అంబేద్కర్ కలలు కన్న సమాజం సాధ్యమని అన్నారు. ఈ సమావేశానికి ఎస్.సి విభాగం అధ్యక్షులు ఆరేపల్లి మోహన్ అధ్యక్షతన వహించగా, ఎమ్మెల్యేలు గీతారెడ్డి, సంపత్ కుమార్, మాజీ ఉప ముఖ్యమంత్రి దామోద్ రాజనర్సింహ్మా, మాజీ మంత్రులు ప్రసాద్ కుమార్, చంద్రశేఖర్, విజయరామారావు, మాజీ ఎంపీ మల్లు రవి, టీ-పీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ వచన్‌కుమార్ తోపాటు పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.


ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు ఏర్పాట్లు : పోస్టర్‌ను విడుదల చేసిన కార్యకర్తలు




విజయవాడ,సూర్యబ్యూరో: జనసేన ఆవిర్భావ దినోత్సవ సభను ఘనంగా నిర్వహించేందుకు ఆ పార్టీ నేతలు ఏర్పాట్లు ప్రారంభించారు. ఇందుకోసం విజయవాడలో సమన్వయ కమిటీ కార్యాలయాన్ని ఇటీవలే ప్రారంభించారు. నాగార్జున వర్శిటీ ఎదురుగా విశాల ప్రాంగణంలో ఈ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మార్చి 14న ఈ సభ జరగనుంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు మూడు లక్షల మంది కార్య కర్తలు సభకు రావచ్చునని అంచనా వేస్తున్నారు. దీనికి సంబంధించి పోస్టర్ కూడా విజయవాడలో విడుదల చేశారు. జనసేనపార్టీ విజయకేతనం ఎలా ఉండబోతుందన్నది దినోత్సవ రోజున తెలుస్తుందని ఓ కార్యకర్త అన్నారు.

రిజర్వేషన్ల పెంపునకు అతిగతి లేకుండాపోయింది

● గిరిజనులకు, ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు కేసీఆర్ హామీ ● అసెంబ్లీలో తీర్మానం చేసి చేతులు దులుపుకున్నారు ● నాలుగేళ్లు అయినా రిజర్వేషన్ల పెంపునకు అతిగతీలేకుండా పోయింది : సీఎల్పీ ఉప నేత, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : గిరిజనులకు, ముస్లింలకు చెరో 12 శాతం రిజర్వేషన్లను కల్పిస్తానని ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారని, ఆయన అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అయినా రిజర్వేషన్ల పెంపుకు అతిగతీ లేకుండా పోయిందని సీఎల్పీ ఉపనేత, మాజీమంత్రి జీవన్‌రెడ్డి విమర్శించారు. గిరిజన, ముస్లింల రిజర్వేషన్ల పెంపు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి బిల్లు పంపి కేసీఆర్ చేతులు దులుపుకున్నారన్నారు. శుక్రవారం అసెంబ్లీ మీడియాహాల్‌లో జీవన్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ గిరిజనులకు రాష్ట్ర పరిధిలో రిజర్వేజన్లను అమలు చేయవచ్చునని అన్నారు. కేంద్రంలో గిరిజనులకు 7.5 శాతం రిజర్వేషన్లు అమలవుతుంటే, తెలంగాణలో మాత్రం కేవలం ఆరు శాతం మాత్రమే అమలవుతున్నాయని చెప్పారు. గిరిజనులకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను వెంటనే పెంచాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్నదన్నారు. గిరిజనుల రిజర్వేషన్ల అమలుపై ఎవరికీ ఎటువంటి అభ్యతరాలు లేవన్నారు. కేసీఆర్ ఈ అంశాన్ని కేంద్రంపై నెట్టి వివాదస్పదం చేయడం సరికాదని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. నాలుగేళ్ళ పాటు అన్ని విషయాల్లో కేంద్రంలోని మోడీ సర్కార్ కు బేషరతుగా మద్దతు ఇచ్చిన కేసీఆర్, గిరిజన, ముస్లిం రిజర్వేషన్ల పెంపును ఎందుకు సాధించుకోలేక పోయారని ప్రశ్నించారు. కేసీఆర్ నిర్లక్ష్యం



వల్ల గిరిజనులు గత నాలుగేళ్లుగా నాలుగు శాతం రిజర్వేషన్లను కోల్పోవల్సిన పరిస్థితి నెలకొందన్నారు. నాలుగు శాతం రిజర్వేషన్లు అదనంగా అమలు జరిగివుంటే, ప్రతి ఏటా 150 మంది డాక్టర్లు అయ్యేవాళ్లన్నారు. మోడీ సూచనల మేరకు టిఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో ఆందోళనలు చేస్తున్నారన్న ఆయన, చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్ తమ పార్టీ ఎంపీలతో రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు జరిగిన నష్టాన్ని భర్తీ చేసేందుకు సూపర్ నేమోరీ పోస్ట్ లు క్రియేట్ చేసి వారికి ఉద్యోగాలు కల్పించాలన్నారు. ఎస్టీ సబ్ ప్లాన్ లో 16 వేల కోట్లు బడ్జెట్ లో కేటాయిస్తే, కేవలం 8 వేల కోట్లే ఖర్చు చేశారని జీవన్‌రెడ్డి అన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ లో 26వేల కోట్లు కేటాయిస్తే కేవలం 16 వేల కోట్లే ఖర్చు చేశారని పేర్కొన్నారు. ఇది కేసీఆర్ కు ఆయా వర్గాలపట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని జీవన్‌రెడ్డి మండిపడ్డారు.

బీజేపీ, టీడీపీపై ఈసీకి ఏపీ కాంగ్రెస్ ఫిర్యాదు



న్యూఢిల్లీ, మేజర్‌న్యూస్ : ఎన్నికల మేనిఫెస్టోలో ఏపీకి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేంద్రం విఫలమైందంటూ ఎన్నికల కమిషన్‌కు ఏపీ కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. బీజేపీ, టీడీపీపై ఈసీకి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నేతలు ఆ పార్టీల గుర్తింపు రద్దు చేయాలని కోరారు. అనంతరం ఏపీ పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి మీడియాతో మాట్లాడుతూ 15 ఏళ్లు ప్రత్యేక హోదా ఉండాలన్న వారు ఇప్పుడు మాట మార్చారని మండిపడ్డారు. విభజన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. మోదీకి నైతిక విలువలుంటే హోదా హామీని నెరవేర్చాలని కేవీపీ డిమాండ్ చేశారు.

కోయదొర వేషంలో పార్లమెంట్‌లో నిరసన



న్యూఢిల్లీ,సూర్యబ్యూరో: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదాను డిమాండ్ చేస్తూ తెలుగుదేశం ఎంపీలు చేస్తున్న నిరసనల్లో భాగంగా నిత్యమూ తనదైన వేషధారణలో పార్లమెంట్‌కు వస్తున్న చిత్తూరు ఎంపీ, నటుడు శివప్రసాద్, శుక్రవారం ఓ కోయదొర వేషంలో వినూత్నంగా కనిపించారు. పార్లమెంట్ ఆవరణలో అటూఇటూ తిరుగు తున్న ఆయనకు కాంగ్రెస్ నేత జైరాం రమేష్ కనిపించగా, ఆయన చేతిని తన చేతిలోకి తీసు కుని చేతి రేఖల గురించి వివరిస్తూ జాతకం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ పరిస్థితి బాగాలేదని ఈ చెయ్యిని చూస్తే తెలిసిపోతుందని వ్యాఖ్యానించారు. గతంలో ఈ చెయ్యి ఎంతో అధికారాన్ని చూసిందని ఈ రేఖను చూస్తే కనిపిస్తోందని, ఇప్పుడు మాత్రం గడ్డు పరిస్థితిలో ఉన్నావని జోకులు వేశారు. వీరిద్దరిని, వారి మధ్య సంభాషణను పక్కనే ఉన్న ఎంపీలు, మీడియా ఆసక్తిగా తిలకించారు. పార్లమెంటు సమావేశాల సందర్భంగా ఏపీ హామీలను నెరవేర్చాలని, ప్రత్యేక హోదాను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ... టీడీపీ ఎంపీ శివప్రసాద్ నేడు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. కోయదొర వేషంలో ఆయన పార్లమెంటుకు వచ్చారు. కొండదేవర తరహాలో మాట్లాడుతూ, పార్లమెంటులో కలియదిరిగారు.. బెజవాడ కనకదుర్గమ్మ మీద ఆన... తిరుపతి ఎంకన్న మీద ఆన.. జరిగింది చెబుతాను.. జరగబోయేది చెబుతాను.. ఆ నాడు ఇందిరకు చెప్పాను.. ఎన్టీఆర్ తో పెట్టుకోవద్దని.. పెట్టుకుంటే ఏం జరిగిందో తెలుసు కదా.. ఈనాడు మోదీకి చెబుతున్నాను... ఏపీతో సఖ్యంగా ఉండటం ఇష్టం లేదా.. మీకు మూడిందా ఏంది... తెలుగు ప్రజల ఆత్మ గౌరవ నాడి తెలియలేదా ఏంది.. ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చ లేదు నీవు.. ఏపీని ఏం చేయాలనుకుంటున్నావు నీవు. అంటూ కోయదొర మాదిరి మాట్లాడారు. మా మాట వింటే హుర్రో హుర్రు.. లేకపోతే పుర్రో పుర్రు అని అన్నారు. పుర్రో పుర్రు అంటే ఇంగ్లీష్‌లో 'అవుట్' అని అర్థమని చెప్పారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యే సర్కార్ లక్ష్యం

• మిషన్ భగీరథ ద్వారా అన్ని స్కూళ్లకు నల్లా నీళ్లు • స్కూల్ విద్యార్థినిలకు హెల్త్ అండ్ హైజీన్ కిట్స్ • గుడ్ల సంఖ్యను మూడు నుంచి ఐదారుకు పెంచుతాం • స్కూల్ గ్రాంట్స్ 12 నెలలకు పెంచుతాం • ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు రోల్ మోడల్‌గా ఉండాలి • ఉప ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : " ప్రభు త్వం ముందుంచిన మీ డిమాండ్లు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. మీ సంఘాన్ని అభినందిస్తున్నాను. ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేసే అంశాలే ఎక్కువగా చెప్పారు. ఏ పేరుతో పిలుస్తున్నా మనేది ముఖ్యం కాదు, మీకు ఏ విధంగా సరైన గౌరవం కల్పి స్తున్నామన్నది ముఖ్యం. ప్రభుత్వ విద్యను పటిష్టం చేయాల్సిన బాధ్యత మీపై ఉంది.. దీనిని సామాజిక బాధ్యతగా గుర్తించాలి. ప్రధానోపాధ్యాయులు లీడర్లుగా పని చేసిన చోట ఫలితాలు బాగా వస్తున్నాయి. సెప్టెంబరు 5న ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తాం. వీటికి మార్గదర్శకాలు రూపొందించాం. కొంతమంది ఆదివారం కూడా పనిచేస్తున్నారు. సెలవులు లేకుండా పనిచేస్తు న్నారు. వీరివల్ల ప్రభుత్వానికి మంచి పేరు వస్తోంది. మిగిలిన వారు కూడా అలా పని చేయాలని ఆశిస్తున్నాను. ఆదేశించడం లేదు. ప్రధానో పాధ్యాయులు విద్యార్థులకు రోల్ మోడల్‌గా ఉండాలి. పాఠశాల ఆవరణలో మీ ప్రవర్తన, వేష, భాష విద్యార్థులపై ప్రభావం చూపుతాయని" రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, విద్యా శాఖమంత్రి కడియం శ్రీహరి అన్నారు. వారిని పాజిటివ్ గా ప్రభావితం చేసే విధం గా మన ప్రవర్తన ఉండాలని కోరుతున్నానని అన్నారు. ఒక హెడ్ మాస్టర్ గా మీరు సర్పంచ్‌ని కలిస్తే మీకు నల్లా ఇవ్వరా అని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి చిన్న,చిన్న పనులు మీరే చేయించుకునే విధంగా ఉండాలన్నారు. మిషన్ భగీరథ కింద అన్ని స్కూళ్లకు నల్ల ఇవ్వాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. వీటిని అమలు చేయించు కునే బాధ్యత మీపైనే ఉన్నదన్నారు. అన్ని స్కూళ్లలో మౌలిక వసతులు పెంచే ప్రయత్నం చేస్తున్నా మని, బాలికల టాయిలెట్స్ పెంచనున్నామని చెప్పారు. హెల్త్ అండ్ హైజీన్ కిట్స్ 7 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థినిలకు న్యాప్కిన్స్ ఇవ్వాలని ప్రయ త్నం చేస్తున్నామన్నారు. 23 లక్షల మందికి మధ్యాహ్న భోజనం పెడుతున్నా మన్న ఆయన, గుడ్ల కోసం 200 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. దేశానికి ఆదర్శంగా ఉండేలా తెలం గాణ విద్యను తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం క్వాంటిటీ పెంచే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. గుడ్ల సంఖ్యను 3 నుంచి 5,6కి పెంచే విజ్ఞప్తిని పరిశీలిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు ఉన్నారని అయినా విద్యార్థుల నమోదు తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆశించినస్థాయిలో ఫలితాలు రావడం లేదని, దీనికి కారణాలు ప్రభుత్వ పరంగా, ఉపాధ్యాయుల ఆలోచిం చాలని సూచించారు. సామాజిక స్పృహతో ఆలోచించి, ప్రభుత్వం చేసే పనికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. 12 మాసాలకు స్కూల్ గ్రాంట్ ఇస్తామని, మీరు పాఠశాలను అభివృద్ధికి పని చేయాలన్నారు. దాని ప్రాభవం పెంచితే ఆ ఖ్యాతి మీకే దక్కుతుందన్నారు. లేకపోతే తగ్గుతుందని సుతి మెత్తగా హెచ్చరించారు. ప్రధానో పాధ్యాయులతో సమావేశం నిర్వహించి, పాఠశాల విద్యను పటిష్టం చేయడంపై చర్చిం చి అనేక చర్యలు చేపడుతున్నామన్నారు.

ఒకరిపై ఒకరు నెపం నెట్టివేసి తప్పించు కో వద్దన్న కడియం, ఈ స్కూల్ నాది అనే భావనతో పని చేయాలని సూచించారు. ప్రధానో పాధ్యాయుల సమస్యలే కాకుండా మిగిలిన సమస్యలు కూడా పరిష్కరించే ప్రయ త్నం చేస్తున్నామని తెలిపారు. 8792 పోస్టులకు నోటిఫికేషన్‌ను టి.ఎస్.పి.ఎస్.సి త్వరలోనే ప్రకటిస్తుందన్నారు. జూన్ నాటికి పని చేసే విధంగా ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. స్కూల్ విద్యుత్ బిల్స్ మాఫీ చేసే ప్రయత్నం చేస్తున్నా మన్నారు. విద్యార్థుల శ్రేయస్సు లక్ష్యంగా, నాణ్యమైన విద్య ధ్యేయంగ పని చేయాలని కోరుతున్నానని అన్నారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి ఈటెల రాజేందర్, చీఫ్ విఫ్ పాతూరి సుధాకర్ రెడ్డి, శాసనమండలి సభ్యులు పూలరవీందర్, కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధానోపా. ధ్యాయుల సంఘం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సంకల్ప యాత్ర 108వ రోజు షెడ్యూల్



ఒంగోలు, మేజర్‌న్యూస్ : ప్రజాసంకల్పయాత్ర 108వ రోజు షెడ్యూల్ ఖరారు అయింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ఉదయం వేటపాలెం శివారు నుంచి పాదయాత్రను ప్రారంభించ నున్నారు. అక్కడ నుంచి అంబేద్కర్ నగర్, దేశాయి పేట, జంద్రపేట మీదగా రామకృష్ణాపురం, చీరాల వరకూ ప్రజాసంకల్పయాత్ర కొనసాగ నుంది. ఈ మేరకు వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం శుక్రవారంనాడు పాదయాత్ర షెడ్యూల్‌ను విడుదల చేశారు.

బాబుకు చిత్తశుద్ధి ఉంటే మాతో రావాలి

బొత్స సత్యనారాయణ



హైదరాబాద్, మేజర్‌న్యూస్: టీడీపీకి చిత్తశుద్ధి వుంటే కేంద్రంపై తమ పార్టీ ఈ నెల 21న ప్రవేశ పెట్టే అవిశ్వాసతీర్మానానికి తమతో కలసి రావాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత బొత్స సత్య నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బొత్స సత్యనారాయణ మీడియా సమావేశంలో మాట్లాడారు. రాజకీయ ప్రయోజనాలపైనే చంద్రబాబు దృష్టి సారించారు. రాష్ట్రానికి కేంద్రం ఎన్నో చేసిందన్న సుజనా చౌదరి ఇప్పుడు మాటమార్చి ఏమీ ఇవ్వలేదంటున్నారు. 2016 సెప్టెంబర్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఏం చెప్పారో ఇప్పుడు అదే చెబుతున్నారు. కానీ అప్పుడు ఆ విషయాన్ని స్వాగతించిన చంద్రబాబు ఇప్పుడు ఎన్నికల సమయం కాబట్టి మరోలా స్పందిస్తున్నారు. ఈనెల 21న వైసీపీ ఎంపీలు అవిశ్వాస తీర్మానం పెడుతున్నారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే మాతో కలిసి రావాలి. లేకుంటే చంద్రబాబు అవిశ్వాసం పెడితే మేం మద్దతు ఇస్తాం అని పేర్కొన్నారు.

ఢిల్లీలో ప్రత్యేక హోదా సాధన సమితి ధర్నా



న్యూఢిల్లీ, మేజర్‌న్యూస్ : దేశ రాజధాని ఢిల్లీలోని ఏపీభవన్ ఎదుట ప్రత్యేక హోదా సాధన సమితి ధర్నాకు దిగింది. ఏపీకి ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేశారు. ఇద్దరు కేంద్ర మంత్రులు రాజీనామా చేసినా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని చలసాని శ్రీనివాస్ మండిపడ్డారు.

పల్స్ పోలియోకు విస్తృత ఏర్పాట్లు



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం పల్స్ పోలియో కార్యక్ర మాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పా ట్లు పూర్తి చేసింది. పల్స్ పోలియోకు విస్తృత ప్రచారం కల్పించడంలో వార్తా పత్రికలు, ఎలక్ట్రా నిక్ మీడియా గత అనేక ఏళ్లుగా సహకరించ డంతో దిగ్వి జయంగా ఈ కార్యక్రమాన్ని దిగ్వి జయంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పేర్కొంది. అలాగే ఈ నెల 11న రెండవ విడతకు మీడియా సహకారం కొనసాగించాలని కోరింది. గడిచిన 7ఏళ్లలో మన దేశంలో ఒక్క పోలియో కేసు నమోదు కూడా కాలేదని, పొరుగు దేశాలైన పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, నైజీరియా దేశాలలో పోలియో కేసులు నమోదు కావడం జరిగిందని, దీంతో మన దేశంలో తిరిగి ఈ వ్యాధి ప్రబల కుండా ఉండేందుకు భారత ప్రభుత్వం దేశ వ్యాప్తంగా పల్స్ పోలియో కార్య క్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.


గుంటూరు జనసేన నేతపై పోలీసు కేసు నమోదు



గుంటూరు, సూర్యబ్యూరో: పవర్ స్టార్ పవన్ కల్యాణ్ స్థాపించిన జనసేన పార్టీ గుంటూరు జిల్లా నేత గోపాళం రామస్వామి, ఆయన భార్య లక్ష్మీకళ దంపతులపై పోలీసు కేసు నమోదైంది. , జనసేన పార్టీలో స్థానిక నేతల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో జనసేనకే చెందిన పూల రామకోటేశ్వరరావు అనే వ్యక్తి ఇంటిపైకి దూసుకెళ్లిన రామస్వామి, ఆయన భార్య దౌర్జన్యం చేశారు. దీనిపై రామకోటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఫిర్యాదును విచారించామని, ప్రాథమిక ఆధారాలు లభించడంతో రామస్వామి దంపతులపై కేసును రిజిస్టర్ చేశామని పోలీసులు వెల్లడించారు.

కేంద్రంతో పూర్తిగా తలాక్ అయిపోయింది

ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి



న్యూఢిల్లీ,సూర్యబ్యూరో: కేంద్రంతో పూర్తిగా తలాక్ అయిపోయిందని, భార్యాభర్తలు విడిపోయినంత మాత్రానా పిల్లల అతీ గతీ చూడద్దా అని టీడీపీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. అప్పుడప్పుడు పోయి మాట్లాడుకుంటారని, పిల్లల కోసం ఏం చేయాలో ఇద్దరూ కలిసి ఆలోచిస్తారని, అలాంటి సంసారమే తమదని టీడీపీ, బీజేపీ పొత్తుపై ఆయన వ్యాఖ్యానించారు. శుక్ర వారం ఆయన మాట్లాడుతూ ఎంపీ పదవికి రాజీనామా చేయడానికి తాను సిద్దంగా ఉన్నానని, వైసీపీ కెపాసిటీ ఏంటో తేల్చుకోవడానికి రెడీగా ఉన్నానని, వైసీపీ ఎంపీలు కూడా రాజీనామాలు చేసి ప్రజల్లోకి రావాలని జేసీ సవాల్ విసిరారు. ఆ ఎంపీలు మీడియా కోసం మాట్లాడిన మాటలేనని, వైసీపీ ఎంపీల్లో చిత్తశుద్ధిలేదని ఆయన విమర్శించారు. రాజీనామాకు నేను సిద్ధమని ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. వైసీపీ ఎంపీలు రాజీనామాలు చేసి రావాలని, ప్రజల్లోకి వెళ్దామని పిలుపునిచ్చారు. మొదట వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఏ ఫ్రంట్ వైపు వెళ్లాల్సిన అవసరం తమకు లేదన్నారు. ఇక ప్రధాని మోదీని కలిసి ప్రయోజనం లేదని, కేంద్రంతో త్రిపుల్ తలాక్ అయిపోయిందని జేసీ దివాకర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. వీరి రాజీనామాలను రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ఆమోదించారు. టీడీపీ తరపున కేంద్ర మంత్రి వర్గంలో పౌర విమాన యాన శాఖ మంత్రిగా అశోక్‌గజపతిరాజు, శాస్త్రిసాంకేతిక శాఖ సహాయ మంత్రిగా సుజనాచౌదరి ప్రాతనిధ్యం వహించారు. గురువారం ప్రధానిని కలిసి రాజీనామా లేఖలను సమర్పించారు. ప్రజా సెంటిమెంట్‌ను గౌరవించి కేంద్రం నుంచి వైదొలగాలని తమ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ఆదేశాలతోనే రాజీనామాలు చేసినట్లు ప్రకటించారు.

కొలిక్కి వచ్చిన రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక

• సంతోష్ కుమార్ దాదాపు ఖరారు

• మరొకటి యాదవులకు • ఇంకొకటి మైనారిటీకి



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి : రాజ్యసభ అభ్యర్థుల ఎంపికను ముఖ్యమంత్రి కేసీఆర్ దాదాపు ఖరారు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. రాజ్యసభ ఎన్నిక తేదీ దగ్గర పడుతుండడంతో గత కొన్ని రోజులుగా రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై తీవ్రస్థాయిలో కృషిచేసిన ముఖ్యమంత్రి ముగ్గురు పేర్లను ఖరారు చేసినట్లు సమాచారం. రాష్ట్రంలో మూడు రాజ్యసభ సీట్లకు ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రస్తుతం శాసనసభలో టీఆర్ఎస్‌కు మూడు సీట్లను కైవసం చేసుకునే బలం ఉంది. ఈ మూడు రాజ్యసభ సీట్లు అధికార పార్టీ తన ఖాతాలో వేసుకోనుంది. ఈ మూడు రాజ్యసభ పదవులకు గాను పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీ న్యూస్ ఎండీ జోగినిపల్లి సంతోష్‌కుమార్ పేరు ఇప్పటికే ఖరారు అయినట్లు సమాచారం. ఒకటి యాదవులకు ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి ఇప్పటికే ప్రకటించడంతో పార్టీలోని యాదవులు రాజ్యసభ పదవికోసం తీవ్రస్థాయిలో పోటీ నెలకొంది. అయితే రాజ్యసభ పదవి ఉన్నత విద్యా వంతు లకే అప్పగించాలని సీఎం నిర్ణయించినట్లు సమాచారం. దీంతో యాదవు ల్లో పోటీ పడుతున్న



విద్యాసంస్థలనేత పేరును ఖరారు చేసినట్లు సమాచారం. మూడో అభ్యర్థిగా మైనార్టీకి చెందిన వ్యక్తిని నియమించాలని సీఎం నిర్ణయించినట్లు సమాచారం. ప్రస్తుతం రాజ్యసభలో టీఆర్ఎస్‌నుంచి మైనార్టీకి చెందిన వ్యక్తి లేడు. ఉద్యమ సమయం నుంచి పార్టీలో ఉంటూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అత్యంత సన్నిహితంగా మెలిగిన ఖాజా మోయినొద్దీన్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. 2002 నుంచి పార్టీలో ఉంటూ.. రాష్ట్ర మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా కొనసాగిన ఖాజామోయినుద్దీన్ 2008లో హైదరాబాద్ లోని ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అప్పటినుంచి పార్టీ అభివృద్ధికి పాటుపడుతున్న మోయినోద్దీన్‌పై సీఎం మొగ్గుచూపుతున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సోమవారం అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేసేందుకు పార్టీ ఏర్పాట్లలో మునిగి పోయింది.

గుడిపల్లి గుట్టపై 'భగీరథ' నీళ్లు

• 33 కిలోమీటర్ల దూరం నుంచి చేరిన నీరు

• ట్రయల్ రన్ ప్రారంభించిన ఇఎన్‌సీ



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి : మహబూబ్ నగర్ , రంగారెడ్డి జిల్లాలలోని ఆవాసాలకు నీళ్లు అందించడంలో కీలకమైన గుడిపల్లిగుట్ట మీదకు భగీరథ నీళ్లు చేరాయి. ఈ గుట్ట మీద నిర్మించిన జీఎల్‌బీఆర్ కు 33 కిలోమీటర్ల దూరంలోని నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండంలోని ఎల్లూరు ఇంటెక్ వెల్ నుంచి శుద్ధి చేయని నీరు చేరింది. శుక్రవారం రెండో రోజు మహబూబ్ నగర్ సెగ్మెంట్‌లో పర్యటిస్తున్న గ్రామీణ తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగం ఇంజనీర్-ఇన్-చీఫ్ బిజ్జుల సురేందర్‌రెడ్డి ఈ ట్రయల్ రన్ ను ప్రారంభించారు. మిషన్ భగీరథ ప్రాజెక్టులోనే ఎక్కువ ఎత్తులో (155 మీటర్లు)నిర్మించిన ఈ జీఎల్‌బీఆర్‌కు నిమిషానికి 38 వేల లీటర్ల నీరు చేరుతుంది. ఇక్కడి నుంచి మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల, మన్నెం కొండ, కల్వకుర్తిలో నిర్మించిన నీటిశుద్ధి ప్లాంట్లకు గ్రావిటీతోనే సరఫరా అవుతాయి. మిషన్ భగీరథలోనే ఎంతో క్లిష్టమైన గుడిపల్లిగుట్ట నిర్మాణ పనులను భగీరథ ఇంజనీర్లు, వర్క్ ఏజెన్సీ అధికారులు యజ్ఞంలా పూర్తిచేశారని ఈ.ఎన్.సి అభినందిం చారు. పగలు, రాత్రి కష్టపడి తక్కువ సమయంలోనే పనులు పూర్తి చేశారన్నారు. అంతకుముందు ఉదయం వనపర్తి జిల్లా పానగల్‌లో 5 ఎంఎల్‌డి సామర్థ్యంతో నిర్మించిన డబ్ల్యూటీపీలో మోటార్ల ట్రయల్ రన్ ను ఈ.ఎన్.సి ప్రారంభించారు. మూడు షిఫ్టులలో పని చేసి మిగిలిన పనులను కూడా పూర్తి చేసి, గ్రామాలకు నీటిని సరాఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. అక్కడి నుంచి వీపనగండ్లలో ఉన్న డబ్యూటీపీని పరిశీలించారు. ఆ తర్వాత నాగాపూర్‌లో మహబూబ్‌నగర్ సెగ్మెంట్‌పై సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న పనుల పరిస్థితిని తెలుసుకున్నారు. పైప్ లైన్‌ల లో ఉన్న గ్యాప్‌లను త్వరగా పూర్తి చేస్తే కొన్ని వందల గ్రామాలకు నీళ్లు చేరతా యన్నారు. ఆ పనులపై ప్రధానంగా దృష్టి పెట్టాల న్నారు. పైప్ లైన్ పనులకు ప్రజలు స్వచ్ఛందంగా అంగీకరిస్తున్నారని, వాళ్లతో సమన్వ యం చేసుకుంటూ పనులు చేయాలన్నారు. ఈనెల 20 నాటికి మహబూబ్ నగర్, వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాలోని ఆవాసాలకు భగీరథ నీళ్లు చేరేలా పనుల్లో వేగం పెంచాలన్నారు. ఆ తర్వాత గౌరిదేవిపల్లిలో నిర్మిస్తున్న హెడ్ వర్క్సను ఈ.ఎన్.సి పరిశీలిం చారు. స్విచ్ఛాన్ చేసి మోటార్ల ట్రయల్ రన్ ను ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ కృపాకర్‌రెడ్డి, ఎస్.ఈ చెన్నారెడ్డి, జగన్, ఈఈలు జయా బాయి, సీతారాంరెడ్డి, వెంకటరమణ, శ్రీధర్, పద్మలత తో పాటు ఇతర అధికారులు, వర్క్ ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళా శక్తి అమోఘమైనది : కె. లక్ష్మణ్



హైదరాబాద్, మేజర్‌న్యూస్‌: మహిళలు అన్ని రంగాలలో రాణిస్తూ ముందుకు సాగుతున్నారని, మహిళా శక్తి అమోఘమైనదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మన్ అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసిందని చెప్పారు. మొదటి రక్షణ శాఖ మంత్రిగా నిర్మలా సీతారామన్, లోక్ సభ స్పీకర్‌గా సుమిత్రా మహాజన్, విదేశాంగ శాఖ మంత్రిగా సుష్మాస్వరాజ్ వంటి మహిళ లకు కీలక బాధ్యతలు అప్పగించారని, వారంతా వారి బాధ్యతలు నిర్వహిస్తూ మహిళా శక్తిని ప్రపంచానికి చాటుతున్నారని చెప్పారు. అతివలు అన్ని రంగాలలో అవకాశాలల్లో, ఆకాశంలో సగభాగం అయ్యారని లక్ష్మన్ అన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వానికి మహిళలంటే చిన్నచూపు ఉందని, అందుకే రాష్ట్ర మంత్రి వర్గంలో ఒక్క మహిళకు కూడా చోటివ్వలేదని లక్ష్మన్ విమర్శించారు.

సీపీఎం సభకు అనుమతివ్వాలని పిటిషన్



హైదరాబాద్, మేజర్‌న్యూస్: సీపీఎం జన జాతర సభకు అనుమతి ఇవ్వాలని హైకోర్టులో ఆ పార్టీ పిటిషన్ వేసింది. ఈ పిటిషన్‌ను విచారణకు హైకోర్టు స్వీకరించింది. ఎన్టీఆర్ స్టేడియంలో సభకు అనుమతి ఇవ్వాలని పిటిషనర్లు న్యాయ స్థానాన్ని కోరారు. ఎన్టీఆర్ స్టేడియంలో సభకు అనుమతి ఇవ్వడం కుదురదని ప్రభుత్వం చెప్పింది. మరోచోట సభ ఏర్పాట్లు చేసుకుంటే ఆలోచిస్తామని ప్రభుత్వం తన వాదనలో పేర్కొంది. వచ్చే మంగళవారం లోగా పిటిషనర్లు తమ నిర్ణయం చెప్పాలని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ వచ్చే మంగళవారానికి హైకోర్టు వాయిదా వేసింది.

మరింత పెరగనున్న ఉష్ణోగ్రతలు



అమరావతి, సూర్య ప్రతినిధి : తెలుగు రాష్ట్రాల్లో ఎండలు ఈ ఏడాది నిప్పుల కొలిమిని తలపించనున్నాయి. ఇప్పటికే భానుడి ప్రతాపానికి సెగలు వస్తుండగా రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింతగా పెరగనుంది. తెలుగు రాష్ట్రాల్లో సగటు ఉష్ణోగ్రతల కంటే 1 డిగ్రీ ఎక్కువగా నమోదయ్యే అవకాశాలున్నట్లు భారత వాతావరణ సంస్థ వెల్లడించింది. వడగాలుల తీవ్రతా ఎక్కువే ఉంటుందని తెలిపింది. ప్రజలు ఇబ్బందులు పడ కుండా ఉండేందుకు ఈ మేరకు తగు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను వాతావరణ శాఖ అధికారులు కోరారు. అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మార్చి నుంచి మే నెల వరకు సాధారణ ఉష్ణోగ్రతల కంటే ఎక్కువ ఉష్ణో గ్రతలు నమోదవుతాయని ఆంధ్రప్రదేశ్‌లో మార్చి నుంచి జులై వరకు గతంలో కంటే అత్యధిక రోజులు వడ గాలులు వీస్తాయని హెచ్చరించారు. మార్చి, ఏప్రిల్ మాసాల్లో సాధారణ ఉష్ణోగ్రతలు 0.5 నుంచి గరిష్టంగా 1డిగ్రీ వరకు పెరిగే అవకాశాలున్నట్లు తెలిపారు. మార్చి 1 నుంచే వేసవికాలం మొదలు కాగా ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో గరిష్ఠ పగటి ఉష్ణోగ్రతలు 34 నుంచి 37 డిగ్రీల సెల్సియస్ మధ్య, తెలంగాణలో 36 నుంచి 38 డిగ్రీల మధ్య నమోదవు తున్నాయి. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు ఐఎండీ అంచనా వేసింది. కోస్తాంధ్రలో ఎండల తీవ్రత మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుందని తెలిపింది. ఎస్సెమ్మెస్, వాట్సాప్, ఈ మెయిల్, టెలీగ్రామ్‌ద్వారా వివరాలను తెలియజేస్తామని తెలిపారు. గత 20 ఏళ్ల నుంచి ఉష్ణోగ్రతలు పెరుగుతూనే ఉన్నాయనీ, వాతావరణ మార్పులే ఎందుకు కారణమని వివరించారు.

తెలంగాణ సీఎస్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: రైతు రుణవిమోచన కమిషన్ ఏర్పాటులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి హైకోర్టు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాలని సీఎస్‌ను ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. రైతు విమోచన కమిషన్ ఏర్పాటుచేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని భాజపా నేత ఇంద్రసేనా రెడ్డి గతంలో హైకోర్టును ఆశ్రయించారు. దానిపై విచారించిన న్యాయస్థానం రైతు రుణ విమోచన కమిషన్ ఏర్పాటుచేయాలంటూ సీఎస్‌ను ఆదేశించింది. అయినా ఇప్పటివరకు ఏర్పాటు చేయకపోవడంతో ఇంద్రసేనారెడ్డి కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన న్యాయస్థానం సీఎస్‌కు నోటీసులు జారీచేసింది.

ఆలోచనా దృక్పథంతోనే సాధికారత

అరకు పార్లమెంటు సభ్యురాలు కొత్తపల్లి గీత



న్యూఢిల్లీ, సూర్య ప్రత్యేక ప్రతినిధి : మహిళలలో ఆలోచనా ధృక్పదం, స్వీయ పరిశీలన ద్వారా సామాజిక వికాసం, సమాజాభివృద్ధి, మహిళా సాధికారికతని సాధించ గలమని పార్లమెంటు సభ్యురాలు కొత్తపల్లి గీత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యూ ఢిల్లీలోని ఏపీభవన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, తెలుగు ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో అరకు ఎం.పి. కొత్తపల్లి గీత, తమిళ్ నాడులోని తిరుచి ఎం.పి. శ్రీమతి సత్యభామ, నార్త్ ఢిల్లీ మేయర్ ప్రీతి అగర్వాల్, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి ప్రీతి సుడాన్ ముఖ్య అతిధులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎంపీ గీత మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న సమాజంలో మహిళలు ప్రతి నిత్యం అనేక సవాళ్ళ ను ఎదుర్కొంటున్నారని అన్నారు. మహిళల పట్ల గౌరవ భావం పెంపొందే విధంగా చిన్నతనం నుంచే చిన్నారులలో క్రమశిక్షణ అలవరుచుటలో తల్లి తండ్రులు శ్రద్ధ తీసుకోవలసిన ఆవశ్యకతను ఆమె విశదీకరించారు. మహిళల సంక్షేమం, మహిళల రక్షణకు ఎన్ని చట్టాలు, శాశనాలు చేసిన వాటి కార్యాచరణలో సవాళ్ళను, ఆటంకాలను ఎదుర్కొంటు న్నామన్నారు. మహిళల పట్ల హింసాత్మక ధోరణి, అత్యా చారాలు పెరుగు తున్నాయని, సామాజిక భద్రత లోపిస్తున్నాదని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తూ మహిళల ఆలోచనా ధృక్పధంలో, సమాజ అవగాహన, వ్యక్తిగత విశ్లేషణ అవసరమన్నారు. మహిళలపై నేరం, అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించినపుడే నేరస్తులలో భయం నెలకొని నేరాలు తగ్గగలవని అన్నారు. తమిళనాడు రాష్ట్రం తిరుచూరు పార్ల మెంటు సభ్యురాలు సత్యభామ మాట్లాడుతూ సాటి మహిళల పట్ల మహిళలలో సహేతుక మైన ధృక్పధం, సేవాతత్పరత పెంపొందాలని సూచించారు. భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమం కార్యదర్శి ప్రీతి సుడాన్ మాట్లాడుతూ ఆత్మీయత, ఆదరణ, అను రాగాలకు ప్రతిరూపం తెలుగు ఆడపడచులని కొనియాడారు. మహిళా సాధికారితకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. ఈ సంద ర్భంగా వివిధ రంగాలలో విశేష కృషి చేసిన మహిళా మణులను ముఖ్య అతధులు శాలువా, జ్ఞాపిక, పుష్పగుచ్చాలతో ఘనంగా సత్కరించారు. మీడియా రంగంలో కృషి చేస్తున్న స్వరూపా పొటపల్లి, వైద్య రంగంలో డాక్టర్ మాణిక్య మాల, నృత్యం విభాగంలో ఎ. రాధిక, సామాజిక సేవలలో శశి చందన, రచయిత్రి ప్రభల జానకి, ఫైన్ ఆర్ట్స్ విభాగం లో లక్ష్మి భార్గవి, విద్యారంగంలో ఎన్. భాస్కర వల్లీలు సత్కారం పొందిన వారిలో వున్నారు. తొలుత పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మహిళా దినోత్సవ విశేషాలను డాక్టర్ ప్రసాద్ విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో తేవా అధ్యక్షురాలు సుశీల వరదరాజు, తేవా సభ్యులు, ఢిల్లీలోని తెలుగు, తెలుగేతరులు, తదితరులు విశేషంగా పాల్గొన్నారు.

విదేశీ భవన్ నిర్మాణానికి 2 ఎకరాల భూమి



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో విదేశీ భవన్ నిర్మాణానికి రెండు ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లో భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి దానేశ్వర్ ములే.. సీఎం కేసీఆర్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా తెలంగాణ నుంచి పెద్ద ఎత్తున విదేశాలకు వెళ్తున్నందున ఇక్కడ సేవలందించేందుకు నగరంలో విదేశీ భవన్ నిర్మించాలని సీఎం నిర్ణయించారు.

తెలంగాణ ప్రభుత్వం
పంచాయతీ రాజ్ శాఖ, మెదక్ జిల్లా
టెండరు ప్రకటన
టెండరు ప్రకటన నం. HD/151-155/2017-18 తేది: 07-03-2018
మెదక్ జిల్లాలో ఫిషరీస్ కమ్యూనిటీ హాల్స్ (04) నిర్మాణం, సిసి రోడ్ వేయు పనులు చేపట్టుట కొరకు క్రింది సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV: రూ. 48.00 లక్షలు. దరఖాస్తుల స్వీకరణ & టెండరు షెడ్యూల్ జారీకి ప్రారంభ తేది: 08-03-2018 నుండి. దరఖాస్తుల స్వీకరణ & టెండరు షెడ్యూల్ జారీకి చివరి తేది: 17-03-2018న సా. 5.00 గం.ల వరకు. టెండరు స్వీకరించు తేది: 19-03-2018న మ.3 గంటల వరకు. టెండర్లు తెరుచు తేది: 19-03-2018న మ.3.30 గం.లకు. తదుపరి వివరాలను క్రింది సంతకందారు నుండి పొందగలరు.
సం/- జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్, మెదక్ జిల్లా.
DIPR RO No.3295/CL/Advt/1/1/2017-18, Dt: 9/3/2018

సంపాదకీయం

editpage@suryaa.com

“ మిత్రధర్మాన్ని పాటించడంలో ప్రధాని నరేంద్ర మోడీ పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలు రెండు తెలుగు రాష్ట్రాల్లో బాహాటంగా వినిపిస్తున్నాయి. నమ్ముకున్న పార్టీలను, ప్రజలను కమలనాథులు నమ్మకద్రోహం చేశారనే విమర్శల వర్షం కురుస్తోంది. ముఖ్యంగా ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని నాడు బీజేపీ నేతలు చేసిన వాగ్దానమే ఇవుడు కమలనాథుల కొంప ముంచేలా కనిపిస్తోంది. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రాంతీయ పార్టీల అవసరాలు తీరుస్తామని నమ్మబలికి వివిధ పార్టీలతో పొత్తు పెట్టుకొని బీజేపీ అధికారంలోకి వచ్చింది. ఆ ఎన్నికల్లో బీజేపీ సంపూర్ణ మెజార్టీ సాధించి భాగస్వామ్య పక్షాలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ బాధ్యతలు స్వీకరించారు. అయితే రాబోయే సార్వత్రిక ఎన్నికలకు మరో యేడాది సమయం ఉన్న నేపథ్యంలో అవే ప్రాంతీయ పార్టీలతో బీజేపీకి గట్టి ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే 2019 ఎన్నికల సమయానికి ఈ ప్రాంతీయ పార్టీలన్నీ ఏకమైతే ఎన్డీయేకు గడ్డుకాలమేనని రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నిజానికి బీజేపీకి దక్షిణాది రాష్ట్రాల్లో ఆది నుంచి పెద్ద పట్టులేదు. కాకపోతే వచ్చే ఎన్నికల్లో దక్షిణాదిన కూడా పాగా వేసేందుకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా ఏపీ, తెలంగాణలో ఎలాగైనా పాగా వేయాలని బీజేపీ పావులు కదిపింది. అందుకు తగ్గట్లుగానే ఏపీలో సీఎం చంద్రబాబును, తెలంగాణలో కేసీఆర్‌ను దూరం చేసుకోకుండా ఇంతవరకు నెట్టుకొచ్చింది. కానీ గతవారం రోజులుగా అటు ఢిల్లీ, ఇటు తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న రాజకీయ పరిణామాలను చూస్తే రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయి. ప్రత్యేకహోదాకు కేంద్రం తలొగ్గకపోవడంతో పాటు తెలంగాణకు ఇచ్చిన హామీలను కూడా కేంద్రం నెరవేర్చలేదు. ”

మిత్రధర్మంలో మోడీ విఫలం

మిత్రధర్మాన్ని పాటించడంలో ప్రధాని నరేంద్ర మోడీ పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలు రెండు తెలుగు రాష్ట్రాల్లో బాహాటంగా వినిపిస్తున్నాయి. నమ్ముకున్న పార్టీలను, ప్రజలను కమలనాథులు నమ్మకద్రోహం చేశారనే విమర్శల వర్షం కురుస్తోంది. ముఖ్యంగా ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని నాడు బీజేపీ నేతలు చేసిన వాగ్దానమే ఇవుడు కమలనాథుల కొంప ముంచేలా కనిపిస్తోంది. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రాంతీయ పార్టీల అవసరాలు తీరుస్తామని నమ్మబలికి వివిధ పార్టీలతో పొత్తు పెట్టుకొని బీజేపీ అధికారంలోకి వచ్చింది. ఆ ఎన్నికల్లో బీజేపీ సంపూర్ణ మెజార్టీ సాధించి భాగస్వామ్య పక్షాలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ బాధ్యతలు స్వీకరించారు. అయితే రాబోయే సార్వత్రిక ఎన్నికలకు మరో యేడాది సమయం ఉన్న నేపథ్యంలో అవే ప్రాంతీయ పార్టీలతో బీజేపీకి గట్టి ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే 2019 ఎన్నికల సమయానికి ఈ ప్రాంతీయ పార్టీలన్నీ ఏకమైతే ఎన్డీయేకు గడ్డుకాలమేనని రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నిజానికి బీజేపీకి దక్షిణాది రాష్ట్రాల్లో ఆది నుంచి పెద్ద పట్టులేదు. కాకపోతే వచ్చే ఎన్నికల్లో దక్షిణాదిన కూడా పాగా వేసేందుకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా ఏపీ, తెలంగాణలో ఎలాగైనా పాగా వేయాలని బీజేపీ పావులు కదిపింది. అందుకు తగ్గట్లుగానే ఏపీలో సీఎం చంద్రబాబును, తెలంగాణలో కేసీఆర్‌ను దూరం చేసుకోకుండా ఇంతవరకు నెట్టుకొచ్చింది. కానీ గతవారం రోజులుగా అటు ఢిల్లీ, ఇటు తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న రాజకీయ పరిణామాలను చూస్తే రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయి. ప్రత్యేకహోదాకు కేంద్రం తలొగ్గకపోవడంతో పాటు తెలంగాణకు ఇచ్చిన హామీలను కూడా కేంద్రం నెరవేర్చలేదు. దీంతో టీడీపీతో పాటు టీఆర్ఎస్ కూడా బీజేపీపై విరుచుకుపడుతోంది. విభజన అనంతరం ఏపీ, తెలంగాణలు కేంద్రసాయం కోసం ఎదురుచూస్తుంటే బీజేపీ పిడుగులాంటి వార్త వినిపించింది. తెలంగాణలో ప్రతిష్ఠాత్మక మిషన్ భగీరథ, కాకతీయలకు మెచ్చుకోళ్లతో కేంద్రం సరిపుచ్చుతున్న తీరు తెలంగాణను అసహనానికి గురిచేస్తోంది. పూర్తిగా వ్యవసాయ ఆధార రాష్ట్రంగాఉన్న ఆంధ్రప్రదేశ్‌కు పదేళ్లు ప్రత్యేక హోదా కల్పిస్తామన్న కమలనాథులు, దానిని ప్రత్యేక ప్యాకేజీకి కుదించినా, దానిని అరకొరగానే అమలు చేస్తున్నారు. మిత్రధర్మానికి కట్టుబడి ఢిల్లీకి వెళ్లి ఎంతమొత్తుకొన్నా ప్రయోజనం లేకపోయేసరికి ఎన్‌డీఏ ప్రభుత్వం నుంచి తెదేపా నిష్క్రమించింది. సీమాంధ్రకు అయిదేళ్లు కాదు పదేళ్ల ప్రత్యేక హోదా కల్పించాలని, రెవిన్యూ లోటు భర్తీ నిమిత్తం కేంద్ర సంచిత నిధి నుంచి రూ.10వేల కోట్లు కేటాయించాలని 2014 ఫిబ్రవరి 20న పెద్దల సభలో భాజపా పెద్దలే అప్పటి అధికార కాంగ్రెసును గట్టిగా నిలదీశారు. బిడ్డ కోసం తల్లిని చంపేశారంటూ తిరుమలేశుని సన్నిధిలో ఏపీకి జరిగిన అన్యాయాన్ని ప్రస్తావించిన మోడీ... ఢిల్లీని తలదన్నే రాజధాని నిర్మాణంతోపాటు అన్ని విధాలుగా ఆదుకొంటామని హామీ ఇచ్చారు. ప్రత్యేక హోదా ఎవరికీ ఇవ్వరాదని పద్నాలుగో ఆర్థిక సంఘం సిఫార్సు చేసిందని జైట్లీ పదేపదే చెబుతున్నా, అలాంటిదేమీ లేదని ఆర్థిక సంఘం సభ్యులు అభిజిత్ సేన్ స్పష్టం చేశారు. పెట్టుబడిదారులు తమ లాభదాయకత చూసుకొంటూనే ఉపాధి అవకాశాలు విస్తరించి ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తారని, అలా వచ్చిన సొమ్ముతో రాష్ట్రాలు అభివృద్ధి పథకాలు చేపట్టాలని గతంలో ఉద్బోధించిన జైట్లీకి పారిశ్రామిక సేవారంగాల్లో ఏపీ పరిస్థితి తెలియనిది కాదు. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లోని వెనకబడిన ప్రాంతాలకు కోరావుట్-బలంగీర్-కలహండి(కేబీకే), బుందేల్‌ఖండ్‌ల తరహా అభివృద్ధి ప్యాకేజీ లభిస్తుందన్నది రాజ్యసభలో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఇచ్చిన హామీ. అది అమలులోకొచ్చేసరికి జిల్లాకు రూ.50 కోట్లవంతున అయిదేళ్లపాటు సాయానికే కేంద్ర పరిమితమైంది. ఇదిలావుండగా ప్రత్యేక హోదా అనేది కీలకమైన రాజకీయ అంశంగా కేంద్ర స్థానంలో నిలబెట్టటంలో వ్యూహాత్మకంగా వైసీపీ సఫలమైంది. అయితే.. ఈ క్రమంలో కేంద్రం మీద ఒత్తిడి పెరిగేలా ప్రజాందోళనలను రూపొందించటం కన్నా.. కేంద్రం నుంచి సాధించటంలో విఫలమయిందంటూ టీడీపీ మీద పోరాటానికే ప్రాధాన్యం ఇచ్చింది. హోదా ఇవ్వకపోతే మోడీ మంత్రివర్గం నుంచి తప్పుకోవాలని, ఎన్‌డీఏ నుంచి చంద్రబాబు బయటకు రావాలని జగన్ పదే పదే డిమాండ్ చేయటం అందులో భాగమే అని వైసీపీకి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడొకరు పేర్కొన్నారు. మరోవైపు టీడీపీ సైతం తను భాగస్వామిగా ఉన్న మోడీ ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి హోదా సాధించే విషయంలో బలంగా ఒత్తిడి తేలేకపోయింది. ప్రత్యేక హోదా సాధ్యం కాదని కేంద్రం అంటే.. ప్రత్యేక ప్యాకేజీకైనా సరే అని అంగీకరించింది. అలాగే ఎన్‌డీఏ నుంచి తాము బయటికి వస్తే వైసీపీ ఆ కూటమిలో చేరాలని తహతహలాడుతోందని ప్రతిపక్షంపై ఎదురుదాడి చేస్తూ వస్తోంది. ఈ క్రమంలో ఓటుకు నోటు కేసుకు భయపడి మోడీ ముందు చంద్రబాబు చేతులు కట్టుకున్నారని జగన్ ఆరోపిస్తుంటే ఆస్తుల కేసులో జైలుకు వెళ్లకుండా ఉండటానికి మోడీకి జగన్ సరెండర్ అయ్యారని చంద్రబాబు ప్రత్యారోపణ చేస్తున్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తే బీహార్ వంటి ఇతర రాష్ట్రాల్లో అవే డిమాండ్లు బలపడతాయని, ఆయా రాష్ట్రాల్లో తమకు రాజకీయ ఇబ్బందులు వస్తాయని, అందువల్ల హోదా జోలికి వెళ్లరాదని బీజేపీ పార్టీ ఆలోచనగా ఉందని పరిశీలకులు అంటున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ సైతం ఇదే హోదా డిమాండ్‌తో ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్ష పేరుతో ఢిల్లీలో ధర్నా చేస్తోంది. రాహుల్‌గాంధీ ఆ ధర్నాలో పాల్గొని మేం అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తాం అని ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ప్రకటించారు. అదే సమయంలో వామపక్ష పార్టీలు కూడా హోదా డిమాండ్‌తో వేరుగా ఢిల్లీలో ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఆంధ్రుల అభీష్టానికి విరుద్ధంగా రాష్ట్ర విభజన జరిగింది. ఆ సమయంలో ఆంధ్రా సెంటిమెంట్ బలంగా పనిచేసింది. ఆ తరువాత, ఇప్పుడు ప్రత్యేక హోదా సెంటిమెంట్ ఇది కూడా తీవ్రంగానే ఉంది. హోదాకి బదులు ప్యాకేజీ ఇస్తామని చెప్పి, దాన్ని కూడా కేంద్రం ఎలా నిర్లక్ష్యం చేసిందో ప్రజలు గమనిస్తున్నారు. పైగా, తాజా కేంద్ర బడ్జెట్‌లో కొన్ని రాష్ట్రాలకు ఉన్న హోదాను పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో గతంలో ప్యాకేజీకి ఆమోదించిన టీడీపీ సర్కారు తాజాగా ప్రత్యేక హోదా ఇవ్వాలనే డిమాండ్‌ను మరింత ఉధృతం చేసింది.

కాంగ్రెస్‌కు అక్కడ విజయాలు దక్కేనా?

ఎంవిఎస్. సత్య - హైదరాబాద్
8333011972

- రాహుల్ అధ్యక్ష పీఠం ఎక్కినప్పటికే కాంగ్రెస్‌కు కష్టకాలం
- కర్నాటకలో అధికారం నిలబెట్టుకోవటమే కీలకం
- రాజస్థాన్‌లో ఉప విజయాల ఊపులో హస్తం నేతలు
- ఛత్తీస్‌గఢ్‌లో అధికారాన్ని అందుకునేందుకు ఆరాటం
- త్రిపుర స్ఫూర్తిగా కర్నాటక వైపు కదలిన కమలనాథులు

నూట పాతికేళ్ల పైచిలుకు వయసున్న కాంగ్రెస్ పార్టీ పరిస్థితి దేశంలో రోజురోజుకీ మరీ ధారుణంగా తయారవుతుండటం ఆశ్చర్యం కలగక మానదు. అసలు కాంగ్రెస్ పరిస్థితి ఏమిటి? రాహుల్ గాంధి కాంగ్రెస్ రాజ్యాభిషిక్తుడు అయినప్పటి సమయానికి ఆ పార్టీ బలం-బలగం పెద్దెత్తున ఉన్నప్పటికీ ఎందుకు ఇంతలా చతికిల్లపడుతోందన్నది ఆ పార్టీ నేతలకు కూడా అంతుపట్టని విషయంగా కనిపిస్తోంది. చిన్నా చితకగా ఉప ఎన్నికలలో గెలవటం ఒకెత్తు అయినా సార్వత్రిక ఎన్నికలలో గెలవటం ఆ పార్టీకి అగ్నిపరీక్షే.

వివిధ రాష్ట్రాలలో ఇప్పటివరకు జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ ఓటమి పాలైన ప్రతిసారి అధ్యక్షుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో పెను మార్పులు జరుగుతున్నాయని, మంచి నాయకుడుగా ఎదగబోతున్నాడని, రాబోయే రోజులలో కాంగ్రెస్ కు మంచి రోజులు వస్తున్నాయంటూ ఆ పార్టీ నేతలు భుజకీర్తులు తగిలించడం తప్ప పార్టీకి ఎదురవుతున్న సమస్యలపై దృష్టి కేంద్రీకరించడంలో విఫలమవుతున్నట్లు కనిపిస్తోంది.

ఇప్పటికే ఈశాన్య రాష్ట్రాలలో పార్టీ పూర్తిగా చతికిల్లపడి, మేగాలయలో అధికారాన్ని సైతం కోల్పోయిన నేపథ్యంలో మరి మూడు రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 2019లో సాధారణ ఎన్నికలకంటే ముందు జరిగే ఈ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకే కాదు, ఇటు బిజెపికి కూడా ఎంతో కీలకం. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీసఘఢ్ ఈ మూడు రాష్ట్రాలు ప్రస్తుతం బిజెపి పాలిత రాష్ట్రాలు కావటంతో కాంగ్రెస్ వీటిపై ప్రధానంగా దృష్టి పెట్టింది. బిజెపి పార్టీకి గెలువు అవకాశాలు మెండుగా ఉండచ్చున్న భావన వీడి ప్రభుత్వాల వ్యతిరేక ఓట్లని పట్టుకునే పనిని ఇప్పటికే కాంగ్రెస్ ప్రారంభించాల్సి ఉన్నా, ఆ పని చేయక పోవటం మరీ విడ్డూరం.

నిజానికి గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత, దేశ వ్యాప్తంగా ఏ పార్టీ హవా ఉండబోతోందన్న విషయంపైనే సోషల్ మీడియాలో చర్చలు తీవ్రస్థాయిలో ప్రారంభమయ్యాయి. దాదాపు ఏతావాత ఇక్కడ తేలింది ఏమిటంటే, రాబోయే రోజులలో కాంగ్రెస్ పార్టీకి అత్యంత సంక్లిష్ట సమయం, బిజెపిని ఎదుర్కొనేందుకు ముఖ్య వ్యూహాలను రచించుకునేందుకు అతి కీలకమైన కాలంగాను కనిపిస్తోంది. ఈ ఏడాదిలో కాంగ్రెస్, కమ్యూనిస్టుల పాలిత మూడురాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరిగితే వాటిలో రెండింటిలో ఎన్నికలు జరిగి ఫలితాలు కూడా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగామేఘాలయ నాగాలాండ్ ఫలితాలను బిజెపి తనకు అనుకూలంగా మార్చుకునే వ్యూహాలతో ముందుకు వెళ్లి మంచి ఫలితాలూ సాధించింది. అటు త్రిపురలోనూ కమ్యూనిస్టుల పాలనకు చెక్‌చెప్పి పాలనా పగ్గాలను అందుకోగలిగింది. ఈ అంశాలను



పరిగణకి తీసుకుని కాంగ్రెస్ పరిస్థితిని నిశితంగా పరిశీలించిన వారికెవ్వరికైనా ఆపార్టీకి అంత్యకాలం దాపురించినట్లేననిపించక మానదు. ఈదిశగా సొంత పార్టీ నేతలలో కూడా ఆందోళన కనిపిస్తుండటంతో ఇతర పార్టీల వైపు చూస్తున్నట్లు కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా ఇప్పుడు ప్రముఖంగా బిజెపి వినిపిస్తున్న నినాదం కాంగ్రెస్ ముక్త భారత్. ఇప్పటికే 20 రాష్ట్రాలలో అధికార పగ్గాలు అందుకోగలిగామది బిజెపి ఆనందం వ్యక్తం చేస్తుంటారు.

బిజెపి వ్యతిరేకత ఎక్కువగా కనిపిస్తున్న రాజస్థాన్‌లో ఇటీవల జరిగిన స్థానిక ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పాగా వేసింది. అంటే మరికొంత కష్టపడితే గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అలాగే త్వరలో ఎన్నికలు జరగనున్న కర్ణాటక వ్యవహారం కాంగ్రెస్‌కు కీలకంగా కనిపిస్తోంది. ఎందుకంటే ఇక్కడ భారతీయ జనతాపార్టీకి చెప్పుకోదగ్గ బలం ఉంది. ఇప్పటికే ఒకసారి అధికారం చేపట్టిన చరిత్ర ఉంది. ప్రభుత్వ వ్యతి రేక తని అంచనాలు వేస్తూ, శరవేగంగా మరో మారు అధికారంలోకి వచ్చేలా ప్రణా ళికలు రూపొందిస్తున్న కమలనాథులు కాంగ్రెస్‌కు పగ్గాలు అందని తీరుగా అప్పుడే మాటల యుద్ధం ప్రారంభిం చేసారు. కమలం పార్టీ అధిష్టానం కూడా కర్నాటకలో ఖచ్చితంగా అధికారం తమదేనని నమ్మకంతో ఆ రాష్ట్రం మీద చాలా కాలంగా ప్రత్యేక శ్రద్ధ పెడుతోంది. కేంద్ర మంత్రులు, నాయకులు, ప్రధాని నరేంద్ర మోడీసైతం మోహరించి, అనేక కార్యక్రమాలకు హాజరవు తున్నారు. ఇటీవల కేంద్రం తరవున జరిగిన ఒక అధికారిక కార్యక్రమానికి ప్రధాని హాజరైతే, రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కనీసం ప్రోటో కాల్ పట్టించుకోలేదు. ఆ రేంజిలో కాంగ్రెస్, బాజపా ఇరు పార్టీల మధ్య యుద్ధ వాతావరణం నెలకొని ఉంది. కర్ణాటకలో అధికారం కోసం నిలువు కోవటానికి ఒకరు, అధికా రం గెలుచు కోవటానికి మరొకరు గట్టిగానే పోటీ పడుతున్నాయి. ప్రజల్లో సిద్ధ రామయ్య, ఆయన ప్రభుత్వం మీద అనేక ఆరోపణలు, వ్యతిరేకత ఏర్పడి ఉన్న నేపథ్యంలో పరిస్థితులు భాజపాకు అనుకూలంగా ఉండవచ్చుననే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ప్రజలు మార్పు కోరు తున్నా రు కారణం తీవ్ర రూపం దాల్చిన ప్రభుత్వ వ్యతిరేకతే.

ఇలాంటి నేపథ్యంలో కర్ణాటకలో గనుక కాంగ్రెస్ ఓడితే ఆ పార్టీకి రోజులు దగ్గరపడ్డట్లేనని భావించాల్సి ఉంటుందని విశ్లేషకులు చెపుతున్నారు. ఇప్పటికే ఈశాన్య రాష్ట్రాల్లో కూడా తన ప్రభ వ్యాపింపజేసిన మోడీ-షాలు కర్నాటకను కూడా గెలుచుకునేందుకు మరింత వ్యూహాలను రూపొందిచే ఆస్కారం లేక పోలేదు. పాతికేళ్ల పార్టీ త్రివురను పాలించిన కమ్యూనిస్టుల కోటనే బీటలు వార్చి గెలిచిన ఉత్సాహం వారికి ప్రోత్సాహం కలిగిస్తోంది ఇప్పుడు. కాంగ్రెస్ ముక్త భారత్ కోరిన భాజపాకు వామపక్ష ముక్త భారత్ నినాదంగా మార్చుకుని పగ్గాలు అందుకున్న తీరును ప్రజలు గమనిస్తునే ఉన్నారు. ఇక కేంద్ర పాలిత ప్రాంతంగా ఉన్న పాండిచ్చేరిలో కాంగ్రెస్ పాలన ఉన్నా, చిన్న చుక్క లాంటి దాన్ని మ్యాప్‌లో వెతుక్కోవాల్సి పరిస్థితి. ఒక వేళ పార్టీకి అధికారం అందించేలా భారీ ఎత్తున పార్లమెంటు సభ్యులనీ అందించే పరిస్థితి లేనే లేదు.

ఛత్తీస్‌గఢ్‌లో పోయిన సారి జరిగిన ఎన్నికలలో అధికార పిఠం దగ్గరకు వచ్చి మిస్ అయిన కాంగ్రెస్ ఈ సారి గెలిచే అవకాశం ఉంది. ఇదీ ఈ మూడు రాష్ట్రాల పరిస్థితి. ప్రజావ్యతిరేకతను కాంగ్రెస్సుకు అనుకూలంగా ఎంతవరకు మార్చగలరో చూడాలి. ఒక రాష్ట్రంలో కాంగ్రెస్ పాగా వేస్తే అధ్యక్ష పగ్గాలు చేపట్టిన రాహుల్ కు ఇక తిరుగుండదు.ఏ మాత్రం కాంగ్రెస్ చతికిలపడినా ఇక రాహుల్‌పై వ్యతిరేక ముద్రలను వేసేందుకు సామాజిక మీడియాలో కొన్ని గ్రూపులు ఎప్పుడూ సిద్ధంగా కాచుకు కూర్చొని ఉంటాయి.

ఇంత క్లిష్ట సమయంలో పార్టీ సారథ్య బాధ్యతలు తీసుకున్న రాహుల్ గాంధి ఇప్పటి నుంచే కర్ణాటకపై ఇంకొంత ప్రత్యేక శ్రద్ధ పెడితే తప్ప, ఏకంగా పార్టీ మనుగడ సాధ్యం కాదని, జాతీయ స్థాయిలో భాజపా వ్యతిరేకతతో ఒక కూటమి అంటూ ఏర్పడినా దానికి సారథ్యం వహించే స్థితిలో కూడా రాహుల్ గాంధి ఉండలేని పరిస్థితి వస్తుంది. కూటమిలో నామమాత్ర భాగస్వామిగా ఉండే అతి చిన్న పార్టీగా కాంగ్రెస్ బతుకీడ్వవలసిన పరిస్థితి వస్తుందని పలువురు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

చరిత్రలో ఈరోజు


మార్చి 10

1896: నిడుముక్కల సుబ్బారావు, రంగస్థల నటుడు, జననం.
1928: స్వర్ణలత, తెలుగు సినిమా నేపథ్య గాయని, జననం
1946: పి. కేశవ రెడ్డి, తెలుగు నవలా రచయిత, జననం
1967: కాండ్రు కమల, మెంబర్ అఫ్ అసెంబ్లీ మంగళగిరి జననం.
1994: మత్స సంతోషి, కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్‌లో 53 కిలోల విభాగంలో కాంస్య పతక విజేత, జననం
1993 : ముక్కని వినయ్ కుమార్, ఉపాధ్యాయుడు, జననం
1982: జి.ఎస్.మేల్కోటే, స్వాతంత్ర్య సమరయోధులు మరణం.
1997 - స్వర్ణలత తెలుగు సినిమా నేపథ్య గాయని, మరణం.
2016 - కోగంటి విజయలక్ష్మి ప్రముఖ రచయిత్రి మరణం.

స్వర్ణలత


స్వర్ణలత మార్చి 10, 1928న జన్మించి, మార్చి 10, 1997న మరణించారు. పాతకాలవు తెలుగు సినిమా గాయనీమణి. ఈమె 1950లు నుండి 1970లు మధ్య కాలంలో ఎక్కువగా హాస్యభరితమైన గీతాలు పాడారు. స్వర్ణలత అసలు పేరు మహాలక్ష్మి. ఈమె కర్నూలు జిల్లా, చాగలమర్రి గ్రామంలో జన్మించింది. ఈమె భర్త డా. అవరాథ్. వీరికి 1956లో వివాహమైనది. వీరికి 9 మంది పిల్లలు : 6 కొడుకులు మరియు 3 కూతుర్లు. ఒక కొడుకు సినీ నటుడు ఆనంద్‌రాజ్. నలుగురు కొడుకులు అమెరికాలో డాక్టర్లుగా స్థిరపడ్డారు. ఇంకొక కొడుకు డాన్సర్ నటరాజ్ (ఇప్పుడు అనిల్‌రాజ్). ఒక కూతురు అమెరికాలో డాక్టరు. ఇంకొక కూతురు స్వర్ణలత కూడా గాయని. ఈమె 1997 సంవత్సరంలో మార్చి 10 తేదీన దోపిడీ దొంగలచే హత్య చేయబడ్డారు.

జి.ఎస్. మెల్కోటే



జి.ఎస్.మేల్కోటేగా ప్రసిద్ధిచెందిన గోపాలయ్య సుబ్బుకృష్ణ మేల్కోటే సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధులు, వైద్యులు మరియు పరిపాలనా దక్షులు. వీరు ఒడిషా రాష్ట్రంలోని బరంవురంలో 1901 అక్టోబర్ 17 విజయ దశమి రోజున జన్మించారు. 1982 మార్చి 10వ తేదీన పరమపదించారు. దేశీయ వైద్య విధానాన్ని, యోగాసనాల ప్రభావాన్ని జోడించి ఉత్తమ వైద్యులుగా ఖ్యాతిపొందారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, హైదరాబాదు అధ్యక్షులుగా పనిచేశారు. 1916లో స్వదేశీ ఉద్యమంలో మొదటిసారిగా పాల్గొన్నారు. ఉప్పు సత్యాగ్రహంలో తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురం వద్ద మరియు కర్ణాటక రాష్ట్రంలోనూ ఉప్పు తయారుచేసి పోలీసులచే నిర్బంధితులై హింసలకు గురయ్యారు. కరాచీ కాంగ్రెస్‌లో హైదరాబాదు ప్రతినిధిగా 1931లో పాల్గొన్నారు.

డా. పి. కేశవ రెడ్డి



డా. పి.కేశవరెడ్డి 1946 మార్చి 10న జన్మించి, 2015 ఫిబ్రవరి 13న మరణించారు. ఆయన తెలుగు నవలా రచయిత. ఇప్పటి తెలుగు రచయితలలో డాక్టర్ కేశవరెడ్డిదే అగ్రస్థానం. ఆయన రాసిన ఎనిమిది నవలలు విశేషంగా పాఠకుల ఆదరణ పొందాయి. ఆయన రాసిన కొన్ని నవలలు హిందీలోకి తర్జుమా కాగా, ఇంగ్లీషులో మాక్మిలన్, ఆక్స్‌ఫర్డ్ వంటి ప్రముఖ ప్రచురణ సంస్థలు ప్రచురించాయి. రచయితగా కేశవరెడ్డి ఏ వాదాలతోనూ, ఉద్యమాలతోనూ సంబంధం ఉన్న వారు కాదు. అవేవీ లేకుండా తన పాఠకవర్గాన్ని సృష్టించుకున్న రచయిత డాక్టర్ కేశవరెడ్డి. అణగారిన ఎరుకలకు, యానాదులకు, మాలలకు రెక్కలు ముక్కలు చేసుకున్నా కడుపు నిండని బక్కిరెడ్డి వంటి కాపోనికి, బతుకు భారమై నూతిని, గోతిని వెతికే సమస్త కులాల కష్ట జీవులకు, వ్యథార్త జీవులకు కావ్యగౌరవం కలిగించి వారి జీవిత కదనాన్ని కథనంగా మలిచి పాఠకుడి ముందు నిలిపిన రచయిత కేశవరెడ్డి. గ్రామీణ సమాజపు రూపురేఖలను, అంతః సంఘర్షణలను లోతుల్లోకి వెళ్లి చిత్రీకరించిన రచయితగా, దళితులు, గిరిజనులు, స్త్రీలు, అణచి వేతకు గురయ్యే సమూహాల పట్ల సంవేదనతో రచనలు చేసిన ప్రగతిశీల రచయిత కేశవరెడ్డి.

ఎన్నాళ్లకెన్నాళ్లకి....

ఈ మధ్య కాంగ్రెస్ పార్టీ అధికారిక పగ్గాలను యువనేత రాహుల్ గాంధీకి అప్పగించిన మాజీ చీఫ్ సోనియాగాంధీ చాలా కాలం మీడియా ముందు కనిపించడమే మానేసారు. ఓ వేళ కనిపించినా చిరునవ్వులు చిందిస్తూ, ముందుకు సాగిపోవటమే తప్ప పెద్దగా మాట్లాడింది లేదనే చెప్పాలి. అలాంటిది సోనియా గురువారం భారతీయ జనతా పార్టీపై తనదైన శైలిలో విరుచుకు పడటం మీడియాలో గమనించిన వారి అధ్యక్షురాలిగా ఆమెనే కొనసాగితే బాగుండేదన్న భావన ఆ పార్టీ కార్యకర్తలలోనూ వినిపించింది., వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి రానిచ్చే ప్రసక్తేలేదని గత నాలుగేళ్లలో దేశం గణనీయంగా అభివద్ధి సాధించిందంటూ కేంద్రం గొప్పలు చెప్పుకోవడం మినహా చేసిందేంలేదన్న ఆమె వాదన వాస్తవంగా కనిపించింది. ముక్యంగా బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే యోచనలో ఉందంటూ కేంద్రమంత్రి అనంత కుమార్ హెగ్డే చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను గుర్తు చేయటంతో స్వీయ ప్రయోజనాల కోసం బిజెపి ఏం చేసినా చేస్తుందనిపిస్తోంది. గతానికి భిన్నంగా పార్లమెంటులో ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం ఇవ్వటంలేదని ఎవన్‌బీ కుంభకోణంపై నిలదీసే అవకాశం లేకుండా మా గొంతు నొక్కారని విమర్శల జడివాన వినిపించిన ఆమె వ్యక్తిగతంగా మోదీ ఎవరో కూడా నాకు తెలియదు... అని ఆమె పేర్కొనడం మరీ విడ్డూరం. ఇలాంటి చిన్న చిన్న వ్యాఖ్యలతోనే నేతలు తమ పరువు పోగొట్టుకుంటూ ఉంటారు. అంతా హుందాగా మాట్లాడి మోడీ ఎవరో తెలీదనటంపై నెటిజన్లు సెటైర్లు వేస్తున్నారు.

- తాతా శ్యాంకుమార్, హైదరాబాద్

సైకిలెక్కుతున్న ఏనుగు

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీయేతర పార్టీల మధ్య సయోధ్య పెరిగే అవకాశం కనిపిస్తోంది. అందునా బిజెపి పార్టీకి పూర్తి ప్రాభవం ఉన్న ఉత్తర ప్రదేశ్ లాంటి రాష్ట్రంలో ప్రధమంగా దెబ్బదీసేందుకు అటు సమాజ్‌వాదీ పార్టీ, ఇటు బహుజన్ సమాజ్ పార్టీ నిన్నటి వరకు నిప్పు ఉప్పులా ఉండి, గత ఎన్నికలలో పార్టీలు చెల్లా చెదరు కావటంతో తాజా ఉప ఎన్నికలలో అయినా ఏకతాటిపైకి రావవాలని నిర్ణయించుకోవటం చూస్తుంటే రానున్న రోజులలో దేశంలో ప్రతిపక్షాల ఐక్యత సాధ్యమేననడానికి ఓ సంకేతంగా చెప్పుకోవచ్చు. గోరఖ్పూర్, ఫూల్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గాల ఉప ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ఈ రెండు పార్టీలు శతవిధాల ప్రయత్నిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీకి ఓటు వేయాలని బహుజన్ సమాజ్ పార్టీ ఇంటింటికీ వెళ్ళి మరీ ప్రచారం చేస్తోంది. బీఎస్‌పీకి కట్టుబడి ఉండేవారిని వ్యక్తిగతంగా కలిసి మరీ సమాజ్‌వాదీ అభ్యర్థులకు ఓటు వేయాలని కోరుతోంది. ఈమేరకు అవసరమైన ప్రచారం చేసేందుకు కూడా మాయావతి సిద్ధ అవతోంది. మరి ఈ రెండు పార్టీలు కాంగ్రెస్ పార్టీకి అనుకూల యుపిఏ పక్షాన నిలుస్తాయో? రానున్న తృతీయ కూటమిలో చేరుతాయో చూడాలి.

- ముక్కామల ఉదయ్‌భాస్కర్, ముంగండ, తూర్పుగోదావరి జిల్లా

మీ లేఖలు, వ్యాసాలు పంపవలసిన చిరునామా
Editor, Surya, Surya Soudha, Plot.No.185,
MCH no. 258/1/185, Siddi vinayk nagar,
Opp:Hi-Tech City, Hyd-57
Mail: e d i

నాలుగేళ్ల జనసేన సాధించిందేంటి?

- ఆది నుంచి అదే సంశయాలలో కొనసాగుతున్న పవన్
- హొదాపైనా అయోమయ పరిస్థితి ఎందుకు?
- ప్రశ్నిస్తామని వచ్చిన పవన్‌కు దొరికిన జవాబులెన్ని?
- ఆవిర్భావ వార్షికోత్సవానికైనా పవన్ స్పష్టతకు వచ్చేనా?
- ఎన్నికలలో ఎవరితో కలసి నడిచేదీ ప్రకటనకు ఛాన్స్



తెలుగుసినీ జగత్తులో తనకంటూ ప్రత్యేకతలు నిలుపుకుంటూ పాతిక సినిమాలే చేసినా.. కోట్ల మంది అభిమానులను సంపాదించుకున్న సినీ నటుడు పవన్ కళ్యాణ్ నేతృత్వంలో జనసేన ఆవిర్భవించి అక్షరాలా నాలుగేళ్లు. ప్రశ్నించడానికే పాలిటిక్స్‌లోకి వచ్చిన జనసేనాని.. తొలిరోజు నుంచి కన్ఫ్యూజన్‌లోనే ఉన్నారన్న వాదనలు అప్పుడప్పుడే ప్రసంశలుగా మారి.... ఆపై మళ్లీ వెనక్కి తగ్గి రెండు రాష్ట్రాలలో అన్ని స్థానాలలోనూ పోటీకి దిగుతున్నామని పదే పదే చెప్తారు. నిజానికి పవన్‌కళ్యాణ్ నైజం అంతేనేమో? పార్టీ పెట్టినప్పటి నుంచి.. జెండా ఎగరేసినప్పటి నుంచి నుంచి..రాజకీయాలలోకి ఎందుకొస్తున్నానో చెప్పినప్పటి నుంచి... అజెండా ఏంటో ప్రకటించుకున్నప్పటి నుంచి.. జోరు పెంచాల్సిన చోట మెతక వైఖరి, సమయానుకూల నిర్ణయాల్లో ఆలస్యం.. వెరసి జనసేన నాలుగేళ్ల పొలిటికల్ కెరియర్‌లో.. అంతా అస్పష్టతలేని పరిస్థితిగా తయారైందన్న వాదలూ లేకపోలేదు.

మరికొద్ది రోజుల్లో.. పార్టీ ఆవిర్భావ సభ జరగనుండటంతో.. ఏ అంశాన్ని అజెండాగా తీసుకోవాలన్న దానిపై పవన్‌కు ఇంకా క్లారిటీ లేదు. ప్రశ్నించడం కోసమే పార్టీ పెట్టిన జనసేనాని గొంతు ఎందుకనో ఇంకా తడబడుతూనే ఉంది.

తనలో ఉన్న ఉద్దేశ్యాలు మంచివే కావచ్చు. తెలుగు ప్రజలకు ఏదో చేయాలన్న తపన ఆతనిలో ఉండొచ్చు. కానీ ఆ విషయంలో కూడా పూర్తి స్పష్టత లేకపోవడం ఆ పార్టీ నేతలనే కాదు పవన్ అభిమానులనూ అయోమయంలో పడేస్తూ, ఒక్కోసారి తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ఇందుకు ప్రధాన కారణం ప్రతి విషయంలో మెతక వైఖరి అవలంబిండమేనని, పవన్ వ్యవహార శైలి ని తప్పుపడుతున్నా... ఆతనిలో మార్పుమాత్రం రావటంలేదు.

నిజానికి ఆంధ్రప్రదేవ్ రాష్ట్రానికి సంబంధించి ప్రత్యేక హోదా అంశంపై తొలినాళ్లలో ప్రకటనలు చేసి... అంతా సిద్ధమవుతున్న దశలో షూటింగు ల పేరుతో ఉద్యమానికి దూరంగా వెళ్లిపోవటంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్ దానిని అందుకుని ముందుకు సాగారు. అది ఆ పార్టీకి కొంత ఉపయుక్తమని అనుకున్నా, హోదా విషయంలో మోడీ వద్ద తనకు పరపతి ఉందని భావించే పవన్ ఆదిశగా ప్రయత్నాలు చేసిందీ లేదు. పైగా హోదాపై పోరాటం విషయంలో సారథ్యం వహించి కేంద్రంతో పోరాటానికి సిద్ధమైతే . అతని వెనుకే అడుగులు వేస్తాం అని తెలుగునాట ఉద్యమకారులు స్పష్టం చేసినప్పటికీ.... ఆ దిశగా కనీస చర్యలు కూడా చేపట్టలేదు. హోదా కోసమంటూ ప్రధానిని కలసిందీ లేదు. ఉద్యమ బాధ్యతలు తీసుకున్నదీ లేదు. హోదా కోసం అంటూ ఢిల్లీలో చేయాల్సిన దీక్షలు, పోరాటాలను తెలుగునాట గల్లీలలో చేయటం కూడా ప్రశ్నించాల్సినవ్యక్తిగా ఉన్న పవన్ తిరిగి జవాబిచ్చుకోవాల్సి వచ్చిందని చెప్పడం సమంజసం. ప్రత్యేక హోదా కోసం ఏతో ప్రజలు, నాయకులు, పార్టీలు అంతా ఒక్కటై ఢిల్లీ నుంచి గ్రామాల వరకు నినదిస్తుంటే.. ప్రధానిని సైతం నిలదీస్తుంటే.. పవన్ మాత్రం ఇంకా వెయిట్ చేద్దాం. చూద్దాం అన్న తన ధోరణి కొనసాగిస్తున్నారు. ఇటీవల విభజన హామీల అమలు విష యంలో తెలుగుదేశం పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని తప్పుపట్టడం, బడ్జెట్లో కేటాయింపులు సమేతుకంగా లేకపోవటం పట్ల చర్చలు సమావేశాల పేరుతో కొన్నాళ్లు హడావిడి చేశారు. లెక్కలేవంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పుపట్టి తీరా అవన్నీ అందుకుని నిపుణుల కమిటీ ముందు తోచ్చి ఇచ్చి తర్వాత వచ్చిన రిపోర్ట్‌తో ఓ ప్రెస్‌మీట్ పెట్టడం మినహా దానివల్ల ఏం ఒరిగింది.? ఏపీకి ప్రయోజనం ఏం దక్కిందో అర్థం కానిది. హోదా కోసం ప్రధానిపై అవిశ్వాసం పెట్టాలని సవాల్ విసురుతారు. ఇందుకు మద్దతుగా దేశంలోని పార్టీల మద్దతూ కూడగతానని ప్రతిన చేసే పవన్ కళ్యాణ్ ఇప్పుడు అవిశ్వాసం, రాజీనామాల వల్ల ప్రయోజనం ఉండదన్నపల్లవిని అందుకోవటం ఆశ్చర్యం కలిగించేదే.

ప్రశ్నించడం కోసమే వుట్టిన పార్టీగా జనసేన. అధినేత అప్పుడప్పుడూ తన వంతుగా ప్రశ్నిస్తే.. కొన్ని సమాధానాలు దొరుకుతున్న క్రమంతో పాటు ఎన్నికలకు కూడా సమయం దగ్గర పడుతుండటంతో పార్టీని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు పవన్ కల్యాణ్. త్వరలోనే పార్టీ ప్లీనరీ సమావేశాలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఇన్నాళ్లూ వన్ మ్యాన్ షో గానే ఉన్న జనసేన పార్టీ లో మరికొందరిని కీలకం చేసి పార్టీ అధికార ప్రతినిధులుగా ప్రజలకు పరిచ యం చేసేందుకు పవన్ కల్యాన్ ప్లీనరీని వేదికగా చేయనున్నట్లు కనిపిస్తోంది. తన పార్టీపై అపనిందలు వేస్తున్న వారిపై అమరావతి వేదికగా ఈ నెల 14 నుంచి జరగనున్న ప్లీనరీలో ధీటైన సమాధానం చెప్పడంలో పాటు ఎన్నికలలో పోటీపైనా పొత్తులపైనా ఓ స్పష్టత ఇచ్చే అవకాశాలున్నట్లు కనిపిస్తోంది. ఈ ప్లీన రీలోనే తెలుగు రాష్ట్రాల్లో మరోమారు చలోరే చలోరే చల్ పేరుతో రాజకీయ యాత్రనూ నిర్వహించి కార్యకర్తల్లో ఊవు తీసుకురావాలని నిర్ణయించినట్లు కనిపిస్తోంది.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం పవన్ పడుతున్న ఆరాటాన్ని, చిత్తశుద్ధిని ఎవరూ శంకించడం లేదు. అయితే ఆయన పయనిస్తున్న పద్దతినే అంతా ప్రశ్నిస్తున్నారు. మరి ప్లీనరీలో అడుగులు ఏదిశగా పడతాయో చూడాలి.



సైబర్ క్రైమ్ ఉచ్చులో కేంద్ర ఆరోగ్య శాఖ మాజీ కార్యదర్శి

న్యూఢిల్లీ: కేంద్ర ఆరోగ్య శాఖ మాజీ కార్యదర్శి, రిటైర్డు ఐఏఎస్ అధికారి సుజాతారావు మలేషియా వెళ్లేందుకు టిక్కెట్ కొనే ప్రయత్నంలో సైబర్ మోసగాళ్ల చేతిలో మోసపోయారు. దీంతో ఆమె సీసీఎస్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసు వివరాల్లోకి వెళ్తే... ఫిబ్రవరి 13న మలేషియా వెళ్లేందుకు సుజాతారావు ఆన్ లైన్ లో వీసా, విమాన టిక్కెట్ల వివరాల కోసం గూగుల్ లో సెర్చ్ చేశారు. సెర్చ్ చేస్తుండగా మలేషియా ఆన్ లైన్ వీసా. ఓఆర్జీ వెబ్ సైట్ ఒకటి స్క్రీన్ పై ప్రత్యక్షమైంది. దానిని పరిశీలించిన ఆమె పూర్తి వివరాలు నమోదు చేసి, ఛార్జీలు ఎక్కువగా ఉన్నాయని అమౌంట్ పే చేయకుండా మధ్యలోనే విరమించుకున్నారు. అనంతరం తన బ్యాంక్ అకౌంట్ నుంచి రెండు దఫాలుగా 16,605 రూపాయల చొప్పున మొత్తం 33,210 రూపాయలు ట్రావెల్ ఏజెంట్ ఖాతాలోకి బదిలీ అయినట్టు వచ్చిన మెసేజ్ ను చూసి అవాక్కయ్యారు. వెంటనే ట్రావెల్ ఏజెంట్ ను సంప్రదించి, తన డబ్బులు తనకు వాపస్ చెయ్యాలంటూ డిమాండ్ చేశారు. దీంతో ఆ సంస్థ పది రోజుల్లో డబ్బులు వెనక్కి పంపిస్తామని సూచించింది. పదిరోజులు పూర్తయినా డబ్బులు వెనక్కి రాకపోవడంతో ఆమె సీసీఎస్ పోలీసులను ఆశ్రయించారు. ఆ సంస్థపై అనుమానంగా ఉందని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఛీటింగ్ కు పాల్పడింది సైబర్ నేరగాళ్లుగా అనుమానిస్తున్నామని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు.

బిజినెస్

ఇండియా, చైనాలపై మరింత పన్ను

పరస్పర పన్ను విధానం అవలంభిస్తానని డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

● మా సుంకాలు ఉన్నట్టుగానే మీ సుంకాలు కూడా ఉండాలి ● హెచ్చుతగ్గులుంటే సహించేది లేదు ● మీ సుంకాలను పరిశీలించి మా సుంకాలనూ పెంచుతాం ● అమెరికా ఆర్థిక భద్రత కోసమే ఈ నిర్ణయం ● స్టీల్, అల్యూమినియం దిగుమతులపై భారీగా పన్నును పెంచేందుకు ట్రంప్ ఆమోదం



న్యూయార్క్: అమెరికా సుంకాలతో సంబంధం లేకుండా భారత్, చైనాలాంటి దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరస్పర సుంకాలు విధించే విధానం అమలు చేసేందుకు సన్నాహాలు చేశారు. భారత్, చైనా దేశాలు అమెరికా సుంకాలతో సంబంధం లేకుండా పన్నులు విధించిన పక్షంలో, ఆ దేశాలపై పరస్పర సుంకాలను తీసుకొస్తామని ట్రంప్ చెప్పారు. వారు ఎంత సుంకాలు విధిస్తే దానికనుగుణంగా తాము కూడా అంతే విధిస్తామన్నారు. అమెరికా ఆర్థిక భద్రత కోసమే ఈ నిర్ణయం తీసుకున్నాం. మా నౌకలను మేమే నిర్మించుకోవాలనుకుంటున్నాం. మా ప్లాంట్లను, మా మిలిటరీ పరికరాలను మేం తయారుచేసుకుంటాం. అది కూడా మా దేశంలో ఉన్న స్టీల్, అల్యూమినియంతోనే. మా దేశంలోని కంపెనీలను, సిబ్బందిని మేం రక్షిస్తాం. అంతేకాకుండా ఒక వస్తువును అమెరికాలోనే ఉత్పత్తి చేస్తే దాని మీద ఎలాంటి పన్నులు విధించబోం అని ట్రంప్ చెప్పారు. తాజాగా స్టీల్, అల్యూమినియం దిగుమతులపై భారీ స్థాయిలో సుంకాన్ని విధించే రెండు ప్రతిపాదనలపై డొనాల్డ్ ట్రంప్ ఆమోదముద్ర వేశారు. కొత్త ప్రతిపాదనల ప్రకారం స్టీల్ దిగుమతులపై 25శాతం, అల్యూమినియం దిగుమతులపై 10శాతం సుంకాన్ని విధించారు. సవరించిన రేట్లు 15 రోజుల్లో అమల్లోకి రానున్నాయి. అయితే ఈ దిగుమతి సుంకాల నుంచి కెనడా, మెక్సికో దేశాలకు మినహాయింపు కల్పించారు. అయితే ఈ మినహాయింపు ఉత్తర అమెరికా వాణిజ్య ఒప్పందాలు(నాఫ్తా) పూర్తయ్యేంత వరకు మాత్రమే అని ట్రంప్ స్పష్టం చేశారు. ట్రంప్ నిర్ణయంతో ప్రపంచ దేశాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. స్టీల్, అల్యూమినియం దిగుమతులపై అమెరికా సుంకాలను పెంచడం చాలా విచారకరమని, దీని వల్ల అమెరికాతో ఉన్న వాణిజ్య సంబంధాలు దెబ్బతినే అవకాశమున్నాయని జపాన్ పేర్కొంది. అంతేగాక ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ఇది ప్రభావం చూపుతుందని అభిప్రాయపడింది. అటు ఫ్రాన్స్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. అమెరికా నిర్ణయం యూరోపియన్ ఆర్థికవ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపనుందని ఫ్రాన్స్ ఆర్థిక మంత్రి అన్నారు. వాణిజ్య సమస్యల పరిష్కారానికి ఇది సరైన మార్గం కాదని యూకే పేర్కొంది. అమెరికా సుంకాల నుంచి యూరోపియన్ యూనియన్‌కు మినహాయింపు కల్పించాలని అభిప్రాయపడింది.

9-3-2018 ... మార్కెట్ సమాచారం

సెన్సెక్స్	
ఆరంభం	33,481.21
గరిష్ఠం	33,506.23
కనిష్ఠం	33,262.96
ముగింపు	**33,307.14**
మార్పు (పా)	-44.43
మార్పు (శా)	-0.13

&

నిఫ్టీ	
ఆరంభం	10,271.30
గరిష్ఠం	10,292.05
కనిష్ఠం	10,216.70
ముగింపు	**10,226.85**
మార్పు (పా)	-15.80
మార్పు (శా)	-0.15

ఎన్ఎస్ఈ ఇండియా మార్కెట్ గ్రాఫ్



సెక్టోరల్ ఇండెక్స్‌లు

ఇండెక్స్	ప్రస్తుతం	మార్పు (పా)	మార్పు (శా)
S&P BSE SENSEX 50	10,683.77	-13.59	-0.13
S&P BSE SENSEX Next 50	32,762.61	+35.56	+0.11
S&P BSE 100	10,577.79	-9.59	-0.09
S&P BSE Bharat 22 Index	3,488.62	-11.45	-0.33

అత్యధిక లాభాల్లో...

కంపెనీ (కోడ్)	ప్రస్తుతం	మార్పు (రూ)	మార్పు (శా)
CENTRALBK	76.45	+6.75	+9.68
SJVN	34.90	+2.00	+6.08
RTNPOWER	5.77	+0.33	+6.07
NAUKRI	1265.05	+65.10	+5.43
OBEROIRLTY	524.75	+26.60	+5.34

భారీ నష్టంలో...

కంపెనీ (కోడ్)	ప్రస్తుతం	మార్పు (రూ)	మార్పు (శా)
RCOM	22.70	-2.45	-9.74
ADANIENT	156.00	-12.90	-7.64
SAIL	69.45	-4.75	-6.40
CANBK	235.20	-15.25	-6.09
IDBI	70.70	-4.15	-5.54

టాప్ టర్నోవర్

కంపెనీ (కోడ్)	ధర (రూ)	టర్నోవర్	వాల్యూమ్
CENTRALBK	76.45	106.25	14188650
FEDERALBNK	93.80	96.13	10178881
HGINFRA	270.05	89.35	3325230
TATASTEEL	605.60	75.92	1228986
IDBI	70.70	47.83	6479470

రూపాయి మారకపు విలువ

కరెన్సీ	మారకపు విలువ	కరెన్సీ	మారకపు విలువ
డాలర్	**65.0784**	యూరో	**80.1636**
యన్	**60.9700**	పౌండ్	**89.8537**


బెస్ట్ ఎయిర్ కార్గో సర్వీస్ ప్రొవైడర్‌గా ఎయిర్ ఇండియా



హైదరాబాద్: మినిస్ట్రీ ఆఫ్ సివిల్ ఏవియేషన్, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా, తెలంగాణ ప్రభుత్వం, ఫిక్కీ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన వింగ్స్ ఇండియా-2018లో ఎయిర్ ఇండియా శాట్స్ ఎయిర్‌పోర్టు సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్(ఏఐఎస్ఏటీఎస్) బెస్ట్ గ్రౌండ్ హ్యాండ్లింగ్ సర్వీస్ ప్రొవైడర్, బెస్ట్ ఎయర్ కార్గో సర్వీస్ ప్రొవైడర్‌గా అవార్డులు అందుకుంది.

14 విభాగాల్లో 63 ఎంట్రీలు రాగా అందులో 18 విభాగాల్లో అవార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్, సివిల్ ఏవియేషన్ కార్యదర్శి ఆర్ ఎన్ చౌదరి పాల్గొన్నారు. డెడికేటెడ్ అవుట్‌లుక్ స్టేట్ అవార్డుకు తెలంగాణ రాష్ట్రం ఎంపికైంది. ఫ్రెండ్లీ ప్యాసింజర్ విభాగంలో విస్తారా ఎయిర్‌లైన్సుకు, డొమెస్టిక్ ఎయిర్‌వేస్ గా స్పైస్ జెట్, ఎయిర్ ఇండియా, గ్రీన్ ఎయిర్‌పోర్టుగా ఢిల్లీకి చెందిన ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, బెస్ట్ డొమెస్టిక్ ఎయిర్‌పోర్టుగా ఛత్రపతి శివాజీ ఎయిర్‌పోర్టుకు అవార్డులు లభించాయి.


ఉబర్ ఇండియా ప్రచారకర్తగా కోహ్లీ



న్యూఢిల్లీ: టీం ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ తాజాగా ప్రముఖ క్యాబ్ సేవల సంస్థ ఉబర్ ఇండియాకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నట్లు సంస్థ ప్రకటించింది. ఈ సందర్భంగా కోహ్లీ మాట్లాడుతూ.. ఓ క్రికెటర్‌గా నేను చాలా ప్రదేశాల్లో పర్యటించాను. ఉబర్‌లో బుకింగ్ చేసుకోవడంలో మంచి అనుభూతి ఉంది. వ్యక్తిగతంగా చాలా ఎంజాయ్ చేశాను. అధునాతన టెక్నాలజీని ఉపయోగించి ప్రజలు వివిధ ప్రాంతాలకు వెళ్లేలా ఒక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి, లక్షలాది మందికి ఆర్థిక అవకాశాలు కల్పించడం గొప్ప విషయం. దేశవ్యాప్తంగా పలు నగరాల్లో ప్రజలకు సేవలందిస్తున్న కంపెనీతో చేతులు కలపడం చాలా ఆనందంగా ఉందని కోహ్లీ చెప్పాడు.

భారతీయ ఐటీ ఉద్యోగులకు జపాన్ స్వాగతం

● జపాన్ లో 2 లక్షల మంది ఐటీ నిపుణులకు డిమాండ్ ● ఇండియన్ ఐటీ ప్రొఫెషనల్స్ కు ఆహ్వానం ● 2030 నాటికి 8 లక్షల మందికి ఛాన్స్




టోక్యో: 2 లక్షల మంది భారతీయ ఐటీ నిపుణులను నియమించుకోవాలని జపాన్ నిర్ణయించింది. జెట్రో (జపాన్ ఎక్స్ టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్) ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ షిగేకి మయేడా ఇండియా-జపాన్ బిజినెస్ పార్టనర్ షిప్ సెమినార్ లో మాట్లాడుతూ, భారతీయ ఐటీ ప్రొఫెషనల్స్ కోసం జపాన్ డోర్లు తెరవబోతోందని చెప్పారు. దేశంలో అత్యంత వేగంగా చోటు చేసుకుంటున్న ఐటీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అవసరాల కోసం భారీ సంఖ్యలో ఇండియన్ ఐటీ నిపుణులను ఆహ్వానించబోతోందని తెలిపారు. 2030 నాటికి 8 లక్షల మంది భారతీయ ఐటీ ప్రొఫెషనల్స్ జపాన్ లో నివాసం ఉండేలా చర్యలు తీసుకోబోతోందని చెప్పారు. ప్రస్తుతం జపాన్ లో 9.2 లక్షల మంది ఐటీ ప్రొఫెషనల్స్ ఉన్నారని... మరో 2 లక్షల మంది నిపుణుల కోసం డిమాండ్ ఉందని షిగేకి అన్నారు. అమెరికా హెచ్1బీ వీసాల భయంలో ఉన్న ఐటీ నిపుణులకు ఈ వార్త ఉపశమనం కలిగించేదే.

చివరి గంటలో బేర్‌మన్న మార్కెట్లు



ముంబై: ఆసియా మార్కెట్ల సానుకూల ప్రభావంతో పాటు కొనుగోళ్లకు ఇన్వెస్టర్లు మొగ్గు చూపడంతో... ఈ ఉదయం నుంచి మన స్టాక్ మార్కెట్లు జోరుగానే కొనసాగాయి. కానీ, చివరి గంటలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి... సెన్సెక్స్ 44 పాయింట్లు కోల్పోయి 33,307కు పడిపోయింది. నిఫ్టీ 16 పాయింట్లు నష్టపోయి 10,227 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్‌గా సెంట్రల్ బ్యాంక్ (9.68%), ఇన్ఫో ఎడ్జ్ ఇండియా (7.84%), డీబీ కార్ప్ (6.13%), రతన్ ఇండియా పవర్ (6.07%), ఒబెరాయ్ రియాలిటీ (5.39%) తదితర కంపెనీలుండగా, రిలయన్స్ కమ్యూనికేషన్స్ (-9.74%), అదానీ ఎంటర్ ప్రైజెస్ (-7.64%), స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (-6.40%), కెనరా బ్యాంక్ (-6.09%), ఐడీబీఐ బ్యాంక్ (-5.54%) తదితర కంపెనీలు నష్టపోయాయి.

రజనీకాంత్ ట్విట్టర్ ఖాతా మార్పు



చెన్నై: తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ తన ట్విట్టర్ ఖాతాలో కీలక మార్పు చేశారు. తన ట్విట్టర్ ఖాతా నుంచి సూపర్ స్టార్ అనే బిరుదును ఆయన తొలగించారు. లక్షలాది అభిమానులకు ఆరాధ్యదైవంగా ఉన్న రజనీకాంత్ ఆ బిరుదును తొలగించడం చాలా వెలితిగా ఉందని సామాజిక మాధ్యమాలు వేదికగా ఆయన అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ఎంతో నిరాడంబరంగా ఉండే రజనీ, తన బిరుదును ట్విట్టర్ ఖాతాలో నుంచి తొలగించారు. దీంతో సూపర్ స్టార్ రజనీకాంత్ కాస్తా రజనీకాంత్‌గా ఆయన ట్విట్టర్ ఖాతా మారింది. కాగా, 2013లో రజనీకాంత్ తన ట్విట్టర్ ఖాతాను ప్రారంభించారు.

ఎంసీటీ ఇంజనీరింగ్‌తో రాక్‌మ్యాన్ ఇండస్ట్రీస్ భాగస్వామ్య వాటా

న్యూఢిల్లీ: హీరో గ్రూప్‌నకు చెందిన ఆరు బిలియన్ డాలర్లు విలువచేసే కంపెనీ రాక్‌మ్యాన్ ఇండస్ట్రీస్ తాజాగా మోల్డెక్స్ కాంపోసైట్స్ ద్వారా యుకేకి చెందిన ఎంసీటీ ఇంజినీరింగ్‌తో భాగస్వామ్య వాటాను దక్కించుకున్నట్లు ప్రకటించింది. కాగా ఎంసీటీ ఇంజినీరింగ్ అనేది యుకెకి చెందిన కార్బన్-కాంపోసైట్స్ ఉత్పాదక సంస్థ. అలాగే సంస్థ ఆటోమోటివ్ విభాగానికి సంబంధించి నాణ్యత కలిగిన ఉత్పత్తులను రూపొందిస్తుంటుంది. అలాగే లగ్జరీ కార్లయిన జాగౌర్ ల్యాండ్ రోవర్ తరహా బ్రిటీస్, యూరోపియన్ బ్రాండ్లకు రూపకల్పన చేస్తోంది. ఈ సందర్భంగా రాక్‌మ్యాన్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ సుమన్ కాంత్ ముంజల్ మాట్లాడుతూ భవిష్యత్ అంతా కర్బన మిశ్రమాలతోనే ముడిపడివుంది. ఈ నేపథ్యంలో 2022 నాటికి రాక్‌మ్యాన్ టర్నోవర్‌లో 10శాతం పెరుగుదలను అంచనా వేస్తున్నామన్నారు.

అమెజాన్‌లో సమ్మర్ సంబరాలు



ముంబై: రోజురోజుకీ ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగిపోతున్నాయి. అందు కోసం ఈ వేడిని తగ్గించేందకు అమెజాన్ సిద్ధమైంది. వేసవి తాపాన్ని తగ్గించే ఉత్పత్తులకు అమెజాన్ ప్రత్యేక వేదిక ఏర్పాటుచేసింది. దీనిలో భాగంగా వివిధ రకాల ఎయిర్ కండీషనర్లు, రిఫ్రిజరేటర్లు, సమ్మర్‌కు అనువైన దుస్తులు, చర్మాన్ని చల్లబరిచే క్రీములు మొదలైనవాటిని అందుబాటులో ఉంచింది. ఎయిర్ కండీషన్లలో విద్యుత్‌ను ఆదాచేసేవాటిని, అత్యాధునిక సదుపాయాలు కలిగినవాటిని అందుబాటులో ఉంచారు. వేసవిలో చల్లని పానీయాలు తాగాలని ప్రతీఒక్కరికీ అనిపిస్తుంది. దీనికి అనువుగా సింగిల్ డోర్, డబుల్ డోర్, సైడ్ బై సైడ్ డోర్ మొదలైన రకాలను వినియోగదారులకు అందుబాటులో ఉంచినట్లు అమెజాన్ పేర్కొంది.



మగువల సంపాదన తక్కువే

న్యూఢిల్లీ: లింగ ఆధారిత వేతన చెల్లింపుల అంతరం ఐదుశాతం తగ్గినప్పటికీ మగవారికన్నా మగువల సంపాదన తక్కువగానే ఉందని మాన్‌స్టర్ శాలరీ ఇండెక్స్ వెల్లడించింది. పనిచేసేచోట ఉద్యోగినులు ఎదుర్కొనే సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించగలమని 44శాతం మగవారు స్పష్టం చేశారు. అయితే మగవారు తమ వ్యక్తిగత పనుల్లో మాత్రమే మద్దతు ఇచ్చేందుకు ముందుకు వస్తుంటారని 80శాతం మహిళలు వెల్లడించారు. అలాగే మహిళను అత్యుత్తమ స్థాయి మేనేజిమెంట్ ఉద్యోగాలకు అంత తేలికగా పరిగణనలోకి తీసుకోరని 32శాతం మహిళలు అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా ఉద్యోగాన్ని ఎంపిక చేసుకోవడం, ఉద్యోగం లేకపోవడాన్ని అతిపెద్ద సమస్యగా భావించే మహిళల్లో 84శాతం మంది భద్రతకు పెద్దపీట వేస్తున్నారని ఈ నివేదిక వెల్లడించింది.

హీరో నిదాహస్ ట్రోఫీ-2018కి భాగస్వామిగా శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్



హైదరాబాద్: శ్రీలంక జాతీయ విమానయాన సంస్థ ఒన్‌వరల్డ్‌లో సభ్యత్వం కలిగిన శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్, హీరో నిదాహస్ ట్రోఫీ- 2018కు అధికారిక ఎయిర్‌లైన్ భాగస్వామిగా ఎంపికైంది. అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సిరీస్‌ను, ఐటీడబ్ల్యు కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నారు. ఈ సిరీస్ కొలంబోలో మార్చి6 నుంచి 18 వరకూ జరుగుతుంది. శ్రీలంక, ఇండియా, బంగ్లాదేశ్‌కు చెందిన ప్రముఖ క్రికెటర్లు ఈ ట్రోఫీలో టైటిల్ కోసం పోరాడనున్నారు. కొలంబోని ఆర్ ప్రేమదాస ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఈ టోర్నీ జరగనుంది. ఈ సందర్భంగా శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్, చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ శివ రామచంద్రన్ మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌ను శ్రీలంక స్వాతంత్ర్య దినోత్సవ స్మారకంగా నిర్వహిస్తున్నామన్నారు.

వ్యాలెట్లకు ఫుల్ కేవైసీ పూర్తి చేయకున్నా నష్టమే

● నానాటికీ పెరుగుతున్న స్మార్ట్‌ఫోన్ల వాడకం ● కేవైసీ వివరాలు అందించకుంటే 28 తరువాత నష్టం ● క్యాష్ బ్యాక్ ప్రయోజనాలకు విఘాతం



న్యూఢిల్లీ: స్మార్ట్ ఫోన్ల వినియోగం పెరుగుతోంది. దీంతో నెట్ వాడే వారి సంఖ్య సైతం పెరుగుతోంది. ఇవన్నీ కలసి డిజిటల్ చెల్లింపులను పెంచుతున్నాయి. పేటీఎం తరహా వ్యాలెట్లు, ఓలా మనీ, మొబిక్విక్, సొడెక్సో, సిట్రస్ వ్యాలెట్ తదితర డిజిటల్ పేమెంట్ వ్యాలెట్లు చాలానే ఉన్నాయి. వీటిని వినియోగించే వారు లక్షల సంఖ్యలో ఉన్నారు. వీరంతా పూర్తి కేవైసీ వివరాలతో తమ వ్యాలెట్లను అప్ డేట్ చేసుకోకపోతే ఈ నెల 28 తర్వాత కొన్ని రకాల ప్రయోజనాల్ని కోల్పోవాల్సి వస్తుంది. వీటన్నింటినీ ప్రీపెయిడ్ పేమెంట్ ఇనుస్ట్రుమెంట్స్ (పీపీఐ)గా పిలుస్తారు. ఎక్కడైనా ఓ వేదిక దగ్గర ముందస్తు చెల్లింపులకు వీలు కల్పించే డిజిటల్ సాధనాలు ఇవి. వీటి నుంచి చెల్లింపులు చేస్తే కొంత మేర క్యాష్ బ్యాక్ ప్రయోజనాలను ఆయా సంస్థలు ప్రమోషన్ లో భాగంగా అందిస్తుంటాయి. కస్టమర్లను ఆకట్టుకునేవి ఈ తాయిలాలే. ఒక్కసారి వీటిని వాడడం మొదలు పెట్టిన తర్వాత ఆ ప్రయోజనాలు లేకపోయినా వాటి వినియోగం కొనసాగుతూనే ఉంటుంది.

ముఖ్యంగా కొన్ని వేదికల దగ్గర వ్యాలెట్ ద్వారా చెల్లింపులు ఎంతో సౌకర్యంగా అనిపిస్తుంది. కారణాలేవైనప్పటికీ ఈ పీపీఐ వ్యాలెట్లను వాడే వారి సంఖ్య గణనీయంగానే ఉంది. వీరంతా ఈ నెల 28లోపు ఫుల్ కేవైసీ పూర్తి చేసుకోవాలి. లేదంటే మీ ఖాతా నిలిపివేయడం లేదా లాక్ చేయడం జరుగుతుంది. పీపీఐలకు సంబంధించిన మార్గదర్శకాలను ఆర్ బీఐ గతేడాది డిసెంబర్ లో సవరణలు చేసింది. వీటి ప్రకారం పీపీఐ కంపెనీలు పూర్తి కేవైసీలను పూర్తి చేయాలి. అంటే కస్టమర్ల నుంచి నో యువర్ కస్టమర్ (కేవేసీ) వివరాలు పూర్తిగా తీసుకోవాల్సి ఉంటుంది. అప్పుడే అవి సాధారాణ సేవలు అందించగలవు. లేదంటే వ్యాలెట్ల వినియోగంపై ఆంక్షలు అమలవుతాయి. ఒకవేళ పూర్తి కేవైసీ ఇచ్చి లేకపోతే అది పూర్తి చేసుకోవడం మంచిది.

ఫుల్ కేవైసీ

ప్రస్తుతం డిజిటల్ వ్యాలెట్ల యూజర్లలో అధిక శాతం సాధారణ కేవైసీ నిబంధనలు కూడా పూర్తి చేసి ఉండరు. గతంలో ఎప్పుడో వ్యాలెట్ లో తమ పేరు, మొబైల్ నంబర్ క్రియేట్ చేసుకున్న వారు వాటిని చక్కగా వినియోగించుకుంటూ వస్తున్నారు. ఇంత వరకు వారి మొబైల్ నంబర్, ఈ మెయిల్ ఐడీలనే వెరిఫై చేసి ఉన్నారు. వారికి సంబంధించి ఇతర వివరాలు ఏంటన్నది వ్యాలెట్ సంస్థలకు తెలియదు. కానీ, ప్రతీ కస్టమర్ గురించి పూర్తిగా తెలుసుకోవాలని నిబంధనలు చెబుతున్నాయి.

ఇటీవలి కాలంలో ఈ వ్యాలెట్లలో లాగిన్ అయ్యే వారు తమ పేరు, పాన్ లేదా ఆధార్ నంబర్ తో నమోదు చేసుకుంటున్నారు. ఇది బేసిక్ కేవైసీ మాత్రమే. బేసిక్ కేవైసీ అన్నది పలు నియంత్రణలతో ఉంటుంది. ఉదాహరణకు పేటీఎంలో కనీస కేవైసీ కస్టమర్లు ఇతర వ్యాలెట్లకు డబ్బులు పంపుకోలేరు. అలాగే బ్యాంకు ఖాతాలకు కూడా డబ్బులు పంపుకునేందుకు అవకాశం లేదు. అదే విధంగా వ్యాలెట్ లో రూ.10,000కు మించి లోడ్ చేసుకోలేరు.

ఆర్‌బీఐ 2017 అక్టోబర్ లో కేవైసీకి సంబంధించి పీపీఐ సంస్థలకు మాస్టర్ సర్క్యులర్ జారీ చేసింది. తొలుత ఫుల్ కేవైసీ నిబంధనలు పూర్తి చేసేందుకు ఏడాది గడువు ఇవ్వగా, తాజాగా ఫిబ్రవరి 28లోపే పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. పూర్తి కేవైసీ నిబంధనల నుంచి మినహాయించాలని ఆయా సంస్థలు ఆర్బీఐని గట్టిగానే కోరాయి. ఎందుకంటే 80 శాతం వాటి ఆదాయం బేసిక్ కేవైసీ అకౌంట్ల నుంచే వస్తోంది. అయినా కేంద్ర బ్యాంకు అందుకు అంగీకరించలేదు. ఒకవేళ చివరి నిమిషంలో ఏమైనా మినహాయింపు ఇస్తుందేమో చూడాలి.

ఫుల్ కేవైసీ పూర్తి చేయడం ఎలా?

ఆర్‌బీఐ మినహాయింపు ఇస్తుందని చూడడం కంటే కేవైసీ నిబంధనలు పూర్తి చేసుకోవడం వినియోగం దృష్ట్యా మంచిదే. పూర్తి కేవైసీలో భాగంగా మీ వ్యాలెట్ ను ఆధార్ తో అనుసంధానించుకోవాలి. మొబైల్ నంబర్ ఆధారంగా యాప్స్ నుంచి లేదా వాటి వెబ్ సైట్ నుంచి లేదా కేవైసీ సెంటర్ కు వెళ్లి కూడా పూర్తి చేసుకోవచ్చు.

పేటీఎం

పేటీఎం వ్యాలెట్ యూజర్లు పూర్తి కేవైసీ పూర్తి చేయాలంటే తప్పనిసరిగా ముఖాముఖిగానే సాధ్యం. అంటే పేటీఎం ప్రతినిధిని కలసి అన్ని వివరాలు తెలియజేసి పత్రాలను చూపించడం ద్వారా ఆధార్ ధ్రువీకరణ కేవైసీ పూర్తి చేసుకోవాలి. లేదా కేవైసీ సెంటర్ కు వెళ్లి కూడా చేసుకోవచ్చు.

పేటీఎం అకౌంట్ లోకి లాగిన్ అయిన తర్వాత కేవైసీ ఐకాన్ ను సెలక్ట్ చేసుకుని 12 అంకెల ఆధార్ నంబర్, ఆధార్ కార్డుపై ఉన్న పేరును ఎంటర్ చేయాలి. ప్రొసీడ్ అనే బటన్ ను క్లిక్ చేస్తే, చూజ్ కేవైసీ ఆప్షన్ వస్తుంది. రిక్వెస్ట్ ఏ విజిట్, విజిట్ ఏ కేవైసీ సెంటర్ ఆప్షన్లు కనిపిస్తాయి. రిక్వెస్ట్ ఏ విజిట్ ను సెలక్ట్ చేసుకుంటే మీ చిరునామా ఇవ్వాలి. దాంతో పేటీఎం ప్రతినిధి మీ చిరునామాకు వచ్చి అన్ని పత్రాలను పరిశీలించి వెళతారు. కేవైసీ సెంటర్ కు వెళ్లేట్లు అయితే ఆధార్ ఒరిజినల్ కార్డు తీసుకెళ్లాలి.

సీవోడీ ఆప్షన్‌ను ఎత్తేసిన షియోమీ

న్యూఢిల్లీ: చైనా మొబైల్ తయారీ సంస్థ షియోమీ తాజాగా విడుదల చేసిన రెడ్‌మీ నోట్ 5 ప్రొ క్యాష్ ఆన్ డెలివరీ (సీవోడీ) ఆప్షన్‌ను తొలగించింది. రిటైలర్లు వీటిని కొనుగోలు చేసి ఎక్కువ ధరకు తిరిగి విక్రయిస్తున్నట్టు ఆరోపణలు రావడంతో ఈ నిర్ణయం తీసుకుంది. మార్చి 7న నిర్వహించిన ఫ్లాష్ సేల్‌లో ఈ ఆప్షన్ లేకుండానే ఫోన్లను విక్రయించింది. స్మార్ట్‌ఫోన్ రీ సెల్లింగ్‌ను నియంత్రించేందుకే ఈ సీవోడీ ఆప్షన్‌ను తొలగించినట్టు షియోమీ పేర్కొంది. ఫిబ్రవరిలో రెడ్‌మీ నోట్ 5 ఫోన్లకు నిర్వహించిన ఫ్లాష్ సేల్‌లో అనూహ్య స్పందన వచ్చింది. కేవలం మూడు నిమిషాల్లోనే మూడు లక్షల స్మార్ట్‌ఫోన్లను విక్రయించింది. అయితే ఫోన్లను రిటైలర్లు కొనుగోలు చేసి స్టాక్ పెట్టుకుని తర్వాత వాటిని అధిక ధరకు విక్రయిస్తున్నట్టు తేలింది.

ఏపీ ఎంపీల ఆందోళనల హోరు

సోమవారానికి లోక్ సభ వాయిదా

న్యూఢిల్లీ : ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కావాలని కోరుతూ రాష్ట్ర ఎంపీలు శుక్రవారం పార్లమెంటు ఉభయ సభల్లో తమ నిరసనలు కొనసాగించారు. 'సేవ్ ఏపీ' అని నినాదాలు చేస్తూ, వెల్‌లోకి దూసుకువెళ్లారు. సభ్యుల ఆందోళనల మధ్యే సభను నడిపించేందుకు లోక్ సభ స్పీకర్ ప్రయత్నించినప్పటికీ, సభ సాగకుండా ఏపీ ఎంపీలు అడ్డుకున్నారు. వాస్తవానికి ప్రతి శుక్రవారం మధ్యాహ్నం జరిగే ప్రైవేట్ మెంబర్ బిల్లులకు ఎవరూ అంతరాయం కలిగించకూడదు. అయినప్పటికీ, ఏపీకి న్యాయం చేయాల్సిందేనంటూ టీడీపీ, వైసీపీ ఎంపీలు ఆందోళనకు దిగారు. దీంతో, ప్రైవేట్ మెంబర్ బిల్లులు కూడా సజావుగా సాగే అవకాశం లేదనే నిర్ణయంతో సభను సోమవారానికి వాయిదా వేశారు స్పీకర్ సుమిత్రా మహాజన్. శుక్రవారం ఉదయం లోక్ సభ సమావేశాలు ప్రారంభమైన తరువాత ఎప్పటిలానే ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక హోదాను డిమాండ్ చేస్తూ టీడీపీ, వైఎస్ఆర్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీలతో పాటు వివిధ డిమాండ్లను లేవనెత్తుతూ పలు ప్రతిపక్షాలు పోడియంలోకి దూసుకువెళ్లాయి, దీనితో లోక్ సభను వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రకటించారు. అంతకు ముందు ఇటీవల మరణించిన భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక సభ్యుడు, మాజీ ఎంపీ భాను కుమార్ శాస్త్రికి లోక్ సభ నివాళులు అర్పించింది. ఆయన సేవలను గుర్తు చేసిన సుమిత్రా మహాజన్, శాస్త్రి ఆత్మ శాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించాలని సభ్యులను కోరారు. ఆ కార్యక్రమం ముగిసిన వెంటనే, సభ్యులు నినాదాలకు దిగగా, 'శాంతీ కే బాద్ హంగామా' (శాంతి తరువాత హంగామా) అంటూ జోక్ వేశారు. సభ్యులను వెనక్కు వెళ్లాలని ఆమె కోరినప్పటికీ, ఆ పరిస్థితి కనిపించకపోవడంతో సభను మధ్యాహ్నానికి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు.



దేశ రాజధానిలో 'హోదా' పోరు

- టీడీపీ- బీజేపీ పొత్తుపై ఆసక్తికర చర్చ
- ఎన్‌డిఏ నుంచి బయటకు వస్తారా ?
- ఆచి తూచి స్పందిస్తున్న ప్రతిపక్ష వైసీపీ



(వెలగపూడి నుంచి 'సూర్య' ప్రత్యేక ప్రతినిధి):ప్రత్యేక హోదాపై పోరు దేశ రాజధానిలో ప్రకంపనలు సృష్టిస్తోంది. అధికార తెలుగుదేశం పార్టీతోపాటు కాంగ్రెస్, వైసీపీ, వామపక్ష పార్టీలు సైతం హోదా పోరాటంలో భాగస్వాములయ్యారు. ఉభయసభలు శుక్రవారం వీరి ఆందోళనలు సోమవారానికి వాయిదా పడ్డాయి. అయినా కేంద్రం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడం తో నవ్యాంధ్రలో టీడీపీ–బీజేపీ పొత్తుపై ఆసక్తి కరమైన చర్చ సాగుతోంది. ఎన్‌డిఏ ప్రభుత్వం కలిసి ఉంటుందా ? పూర్తిగా బయటకు వస్తుందా అని చర్చించుకుంటున్నారు. కేంద్ర క్యాబినెట్ నుంచి టీడీపీ మంత్రులు, రాష్ట్ర క్యాబినెట్ నుంచి బీజేపీ మంత్రుల రాజీనామా రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంశంపై తలెత్తిన ఈ వివాదం ఎంత వరకు వెళుతుంది. తెలుగుదేశం– భారతీయ జనతాపార్టీల మధ్య ఇన్నాళ్లూ కొనసాగిన మిత్ర బంధం మిత్రభేదంగా మారితే ఏమౌతుంది. పొత్తు కొండెక్కితే ఆ రెండు పార్టీల బలాబలాలు మారుతాయా. అధికార టీడీపీకి లాభమా. నష్టమా. ఈ పరిణామాలు విపక్ష వైసీపీకి అనుకూలిస్తాయా. నవ్యాంధ్రలో ఎక్కడ చూసినా ఇదే హాట్ టాపిక్. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచెయ్యి ఎదురైన రోజునుంచి మిత్రపక్షాల మధ్య క్రమక్రమంగా ముదురుతూ వస్తున్న అభిప్రాయ భేదాలు, నిష్ఠూర వ్యాఖ్యలు రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టే నాటికి తీవ్రరూపం దాల్చాయి. ఇరు పక్షాల నుంచి మంత్రుల రాజీనామాలతో పరాకాష్టకు చేరుకుంది. వ్యవహారం ఇంత దూరం వచ్చిన తరువాత ఇక సంధి కుదురుతుందా అనే అనుమానాలు మొదలయ్యాయి. పొత్తు కాస్త పెడాకులతై వచ్చే ఎన్నికల్లో ఆ రెండు పార్టీల పరిస్థితి ఎలా ఉండబోతోందన్న ఆసక్తిరమైన విశ్లేషణలు ఆరంభమయ్యాయి. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి కాంగ్రెస్‌కు పట్టిన గతే పడుతుందని తెలుగుదేశం ఎమ్మెల్యేలు అంటుంటే చంద్రబాబు సరికొత్త డ్రామా మొదలు పెట్టారని వైసీపీ ఎమ్మెల్యేలు అంటున్నారు. మరి సామాన్య ప్రజలు ఏమంటున్నారు, రాజకీయ విశ్లేషకులు ఎలా అంచనా వేస్తున్నారనే విషయంలోకి వెళితే బీజేపీతో పొత్తు తెగిపోయినా జిల్లాలో తెలుగుదేశం పార్టీకి కొత్తగా వచ్చే నష్టం ఏమీ ఉండదనే అభిప్రాయాన్నే టీడీపీ అభిమానులు వ్యక్తం చేస్తున్నారు. పైగా ఎంతోకొంత మేలు జరుగుతుందని అంచనా వేస్తున్నారు.

వెంకయ్య తర్వాత గెలుపు లేదు: ఒక పార్టీ బలాన్ని అంచనా వేయాలంటే ఆ ప్రాంతంలో ఆ పార్టీకి ఉన్న సంప్రదాయ ఓటర్ల బలం, ఆ పార్టీ తాజాగా అనుసరించిన విధానాల పట్ల సామాన్య ప్రజల స్పందనలే ప్రామాణికాలు. ఆ కోణంలో చూస్తే భారతీయ జనతాపార్టీ బలహీనంగా ఉన్న జిల్లాల్లో నెల్లూరు జిల్లా ఒకటి. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సొంత జిల్లా అనే ప్రత్యేకత తప్ప పార్టీ కంటూ ఇక్కడ పెద్దగా ప్రజాబలం లేదు. 1978, 1983 ఎన్నికల్లో ఈ జిల్లానుంచి వెంకయ్యనాయుడు గెలిచినా, దాని వెనుక పార్టీ ప్రభావం కంటే విద్యార్థి నాయకునిగా ఆయన చేసిన సేవలే ప్రధాన కారణం. ఇక ఆ తరువాత ఎప్పుడూ బీజేపీ గెలువలేదు. 1999 లో నెల్లూరు నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన వ్యక్తికి డిపాజిట్టు కూడా దక్క లేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న గత నాలుగేళ్లలో కూడా జిల్లాలో బీజేపీ బలపడిందంటూ ఏమీ లేదు. సరిక దా వర్గపోరు మరింత తీవ్రమైంది. జిల్లాలో ఉన్న ఇద్దరు నాయకులు సురేంద్రరెడ్డి– సురేషరెడ్డి మధ్య సఖ్యత లేదు. కొత్తగా పార్టీలోకి వచ్చిన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రజల్లో పట్టున్న నాయకుడే. అయితే ఎన్నికల వరకు ఆయన అదే పార్టీలో కొనసాగుతారనే గ్యారెంటీ లేదనే ప్రచారం జరుగుతోంది.



ముస్లిం మైనార్టీ ఓటర్లు దగ్గరయ్యే ఛాన్స్...

ఇక ప్రజాబలం విషయానికి వస్తే సాధారణంగా పట్టణ ప్రాంతాల్లోనే బీజేపీకి కొంత బలం కనిపిస్తుంది. అయితే మొన్నటి అసెంబ్లీ, కార్పొరేషన్ ఎన్నికల ఓటింగ్‌ను పరిశీలిస్తే అసెంబ్లీకి పోటీచేసిన బీజేపీ అభ్యర్థి కన్నా కార్పొరేషన్ ఎన్నికల్లో కార్పొరేటర్లకే ఎక్కువ ఓట్లు రావడం గమనార్హం. వాస్తవానికి బీజేపీ ప్రధాన బలం నరేంద్రమోది గ్లామర్. ఎన్నికల ముందు, తరువాత కూడా ప్రజల్లో మోది పేరు మార్మోగింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో మోది క్రేజ్ కూడా ఓట్ల రూపంలో టీటీడీకి కొంత కలిసి వచ్చిందనడంలో అనుమానం లేదు. అయితే నరేంద్రమోదికి అప్పుడున్న క్రేజ్ ఇప్పుడు తగ్గిందనే చెప్పాలి. పెద్ద నోట్ల రద్దు ప్రభావం, జీఎస్‌టీ దెబ్బలతో ప్రజల్లో మోది పట్ల పలు వర్గాల్లో ఇష్టత తగ్గి వ్యతిరేకత పెరిగింది. తిరుమల వెంకటేశ్వరస్వామి సాక్షిగా రాష్ట్రానికి అన్ని విధాలా అండగా ఉంటానని తిరుపతి ఎన్నికల ప్రచార వేదికపై ప్రకటించిన మోది ఆ హామీని పక్కన పెట్టారని, ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు విషయాల్లోనూ న్యాయం చేయడం లేదని, మాట తప్పారని సామాన్య ప్రజలు విశ్వసిస్తున్నారు. ఇలా మోదిపై ప్రజల్లో ఏర్పడిన అసహనం వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు రూపంలో ప్రతిఫలిస్తుందని పలువురు విశ్వసిస్తున్నారు. ఊహించినట్లు బీజేపీతో తెగదెంపులు చేసుకున్నా నెల్లూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీకి వచ్చే నష్టం ఏమీ లేదని, పైగా మైనారిటీ ఓటర్లకు దగ్గరయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. జిల్లాలో నెల్లూరు సిటీ, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల పరిధిలో ముస్లిం మైనారిటీల ఓట్లు గణనీయంగా ఉన్నాయి. ఇప్పుడు బీజేపీతో తెగదెంపులు చేసుకుంటే జిల్లావ్యాప్తంగా ఇప్పటికన్నా ఎక్కువ శాతం ముస్లిం ఓట్లు టీడీపీకి వస్తాయని ఆ పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. మరి ఎన్నికల నాటికి మరెన్ని పరిణామాలు జరుగుతాయో వేచిచూడాల్సిందే మరి.

రాజ్యసభ బరిలో కాంగ్రెస్ అభ్యర్థి

సీఎల్పీ భేటీలో నిర్ణయం



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని పోటీకి పెట్టాలని కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో నిర్ణయించారు. సీఎల్పీనేత జానారెడ్డి అధ్యక్షతన సుదీర్ఘంగా జరిగిన సమావేశంలో రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని పోటీ పెట్టాలన్న అంశంపై భిన్న వాదనలు వినిపించాయి. అయితే చివరకు మెజార్టీ సభ్యుల అభిప్రాయం మేరకు అభ్యర్థిని పోటీకి పెట్టాలని నిర్ణయించినట్లు సీఎల్పీ విప్ సంపత్‌కుమార్ తెలిపారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై సుదీర్ఘంగా చర్చించినట్లు వెల్లడించారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి ఆర్సీ కుంతియా తమకు మార్గ నిర్దేశం చేశారని చెప్పారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రజాగొంతుక వ్యవహరిస్తామని సంపత్ అన్నారు. సీఎల్పీ సమావేశంలో 25 అంశాలపై చర్చించినట్లు తెలిపారు. దళితులపై దాడులు, నిరుద్యోగ సమస్య, శాంతిభద్రతల అంశం, రాజకీయ హత్యలపై ఈసమావేశంలో చర్చించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు టీఆర్ఎస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేవిధంగా వ్యవహరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ బంద్‌కు కాంగ్రెస్‌పార్టీ సంపూర్ణమద్దతునిస్తున్నట్లు సంపత్ తెలిపారు.

సామాజిక వైద్యుల కుఆత్మీయ సన్మానం



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః అంత ర్జాతీయ మహిళా దినోత్స వాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో సామా జిక వైద్యులుగా వ్యవహరించే మంత్రసానులకు కాచం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని జైపురి కాలనీలో ఘనంగా సన్మానించారు. గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక వైద్యులుగా వ్యవహరిస్తున్న మంత్రసానులను ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనిచ్చి ఆదుకోవాలని టీఆర్ఎస్ మహిళావిభాగం కార్యదర్శి, కాచం ఫౌండేషన్ అధ్యక్షురాలు సుష్మ కోరారు.

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి

సమాచార, పౌరసంబంధాలశాఖాధికారులకు కమీషనర్ ఆదేశం

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి ,సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సమాచార పౌరసంబంధాల శాఖాధికారులు ముఖ్యభూమిక పోషించాలని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమీషనర్ అరవింద్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఎంసీహెచ్‌ఆర్డీలో సమాచార పౌర సంబంధాల శాఖలో వివిధ స్థాయిలో పనిచేస్తున్న అధికారులకు, ప్రభుత్వ పథకాల ప్రచారంలో సోషల్ మీడియా వినియోగం పై ఐటి శాఖ డిజిటల్ మీడియా సహకారంతో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.


ఈ సందర్భంగా అరవింద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ ప్రతిష్టాత్మక కార్యక్రమాల ద్వారా ప్రజలలో వచ్చిన సానుకూల మార్పులు, అభివృద్ధికి సంబంధించి అనుకూల వార్తలు వచ్చేలా ప్రత్యేకంగా కథనాలను మీడియాకు అందించేలా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ కార్యక్రమాల ప్రచారంలో సోషల్ మీడియాను (ఫేస్ బుక్, ట్విట్టర్) విస్తృతంగావాడాలని అధికారులను ఆదేశించారు. అధికారులందరు టీం వర్కులాగా పనిచేసి శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ,ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం, కెసిఆర్ కిట్స్, రెసిడెన్షియల్ స్కూల్స్, విద్య, వైద్యం, మహిళా శిశుసంక్షేమం, మున్సిపాలిటీలలో అమలవుతున్న అర్బన్ స్కీమ్స్ వంటి కార్యక్రమాల ద్వారా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం పై ప్రత్యేక వార్తా కథనాలు మీడియాకు అందించాలన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారులు కలెక్టర్ కు నిత్యం అందుబాటులో ఉండి జిల్లా అధికారులతో ఆయాశాఖల అభివృద్ధి కార్యక్రమాలపై సమాచారం సేకరించి ప్రజలలోకి చేరేలా చూడాలన్నారు. జిల్లాలో ప్రత్యేకంగా జరిగే అభివృద్ధిపై రాష్ట్ర స్థాయిలో ప్రచారం వచ్చేలా కమీషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సోషల్ మీడియా సెల్ కు ఎప్పటికప్పుడు పంపించాలన్నారు. ప్రతి జిల్లానుండి నెలకు కనీసం మూడు పాజిటివ్ కథనాలను పంపించాలని కమీషనర్ జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రముఖుల పర్యటనలు, ముఖ్యమైన అభివృద్ధి కార్యక్రమాలకు సంబందించిన ఫోటోలు, వీడియోలు, వివరాలను పంపాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఎంతో అభివృద్ధి కన్పిస్తుందని, సానుకూల ప్రభావంపై కథనాలు పంపాలని అన్నారు. అన్ని శాఖలకు సంబంధించిన అభివృాఎద్ధి, సంక్షేమ పథకాల వివరాలను సమాచార శాఖ ఫేస్ బుక్, ట్విట్టర్ల ద్వారా ప్రజల్లోకి చేరేలా చూడాలన్నారు.



ఐటి శాఖ డైరెక్టర్ కొనతం దిలీప్ మాట్లాడుతూ సోషల్ మీడియా విశ్వ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిందని, సమాచార శాఖ అభివృాఎద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఈ మాధ్యమాలను వినియోగించుకొని ప్రజల్లోకి తీసుకువెళ్ళాలన్నారు. ఖచ్చితమైన సమాచారాన్ని మాత్రమే పోస్ట్ చేయాలన్నారు. సోషల్ మీడియా ప్రయోజనాలు, పేజీల నిర్వహణ ట్విట్టర్, ఫేస్ బుక్ అకౌంట్లకు సంబంధించి తీసుకోవలసిన జాగ్రత్తలను అధికారులకు వివరించారు. జిహెచ్ ఎంసి పరిధిలో ఇప్పటికే 60 లక్షల మంది ఫేస్ బుక్ యూజర్స్ ఉన్నారని, పోలీసు, ముఖ్యమంత్రి కార్యాలయం, మంత్రులు వినియోగిస్తున్నారని అన్నారు. ట్విట్టర్ కు సంబంధించి ట్వీట్స్, రీట్వీట్స్, హష్ ట్యాగ్స్, ఫోటోస్, వార్తల అప్ లోడ్ విధానంపై అవగాహన కల్పించారు. సమాచార శాఖకు సంబంధించి ట్విట్టర్, ఫేస్ బుక్ అకౌంట్స్ ను పాపులరైజ్ చేయాలని సూచించారు. రియల్ టైం సమాచారాన్ని తక్కువ సమయంలో ఎక్కువ మందికి రీచ్ అయ్యే సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగించాలన్నారు. సమాచార అదనపు సంచాలకులు నాగయ్య కాంబ్లే మాట్లాడుతూ, కమీషనర్ ఆదేశం మేరకు సమాచార శాఖ సిబ్బంది సమిష్టిగా పనిచేసి ప్రభుత్వ పథకాలకు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తామని అన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా సోషల్ మీడియాపై అవగాహన కలిగిందన్నారు. సమాచార శాఖ ఛీఫ్ ఇన్ ఫర్ మేషన్ ఇంజనీర్ కిషోర్ బాబు, పబ్లిసిటిసెల్ డిప్యూటి డైరెక్టర్ శ్రీ మధుసూధన్, సోషల్ మీడియా ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సమాచార శాఖ జెడి సుజాత, డిప్యూటీ డైరెక్టర్లు, ఆర్ ఐలు, క్షేత్రస్థాయి పౌర సంబంధాల అధికారులు కమీషనర్ కార్యాలయపు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

ప్రాణం పోయేంత వరకు కేసీఆర్‌తోనే




7 గంటల కరెంట్ కూడా ఇవ్వలేకపోయింది. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 24 గంటల కరెంట్ ఇస్తున్నమని తెలిపారు. కాంగ్రెస్ చరిత్ర ఉద్యమంలో వెనుకడుగే, రాజీనామాలో వెనుకడుగేనని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలో ప్రాజెక్టులన్నీ పెండింగ్ ప్రాజెక్టులుగా మారితే, తమ హయాంలో అవి రన్నింగ్ ప్రాజెక్టులుగా మారాయన్నారు. మీరు కరెంట్ ఇవ్వలేదని. మేం ఇచ్చామని అన్నారు. మంత్రి ఈటెల రాజేందర్ మీద విమర్శలు నిరాధారమని అని హరీష్ రావు కొట్టిపారేశారు.

సుజనా, అశోక్ రాజీనామాలను ఆమోదించిన రాష్ట్రపతి



న్యూఢిల్లీ : తెలుగు దేశం పార్టీ ఎంపీలుగా ఉన్న కేంద్ర మంత్రులు సుజనా చౌదరి, అశోక్ గజపతిరాజు రాజీనామాలను రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ఆమోదించారు. ఈ విషయమై రాష్ట్రపతి కార్యాలయం నుంచి ప్రధాని కార్యాలయానికి సమాచారం అందింది.

అంతకు ముందు ప్రధాని కార్యాలయం నుంచి రాజీనామాలను ఆమోదించాలని కోరుతూ ప్రధాని సంతకం చేసిన లేఖ రాష్ట్రపతికి చేరింది. ఆపై ఆయన వీటిపై సంతకం చేశారు. ప్రస్తుతానికి వారిద్దరి శాఖలూ ప్రధాని వద్దే ఉంటాయని, ఎవరికీ అదనపుబాధ్యతలు ఇవ్వడం లేదని ప్రధాని కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. కాగా, గురువారం స్వయంగా ప్రధానిని కలిసిన సుజనా, అశోక్ తమ పార్టీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి తాము కేంద్ర మంత్రి పదవులకు రాజీనామాలు చేస్తున్నట్టు ప్రకటించి, రాజీనామా లేఖలను మోడీకి అందజేసిన సంగతి తెలిసిందే.



మొదటి పేజీ తరువాయి


ఈశాన్యాన ప్రగతి జ్యోతి



వరుస ఆందోళనల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా అంశం దేశవ్యాప్తంగా చర్చనీయమైంది. ఈ తరుణంలో ప్రధాని మోడీ ఆయా రాష్ట్రాలకు గతంలో ఇచ్చిన హామీల తాలూకు వీడియోలు సోషల్ మీడియా లో వైరల్ అవుతున్నాయి.

ఏపీకి హోదా కల్పిస్తా మని సాక్షాత్తూ వేంక టేశ్వరుడి సన్నిధి లో మోడీ ప్రకటించడం, బీహార్ ఎన్నిక లప్పుడు ఆ రాష్ట్రానికి రూ. 1.50 లక్షల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ఇస్తాననడం, అసోం ఎన్నికల ప్రచారంలోనూ భారీ తాయిలాలు ప్రకటించడం తెలిసిందే. ఆయా రాష్ట్రాల్లోని ఎన్డీయే ప్రభుత్వాల్లో ఏమేరకు మోడీ హామీలు అమలు జరిగాయన్నది విదితమే!

కారుణ్య మరణానికి సుప్రీం అంగీకారం




శుక్రవారం ఉదయం తీర్పు వెలువరించింది. బతి కేందుకు ఎటువంటి మార్గమూ లేదని అన్ని విధాలుగా తేలి పోయిన తరు వాత, స్వచ్ఛంద మరణాన్ని కోరుకునే హక్కు న్యాయమైన హక్కేనని పరిగణిస్తున్నామని ధర్మాసనం పేర్కొంది. పౌరులకు గౌరవంగా మరణించే హక్కు ఉందని అభిప్రాయపడ్డ న్యాయమూర్తులు విధి విధానాలకు తగ్గట్టు గా వారు తమ కోరికను తీర్చుకోవచ్చని స్పష్టం చేశారు. ఎప్పటికీ నయం కాని వ్యాధితో బాధపడు తున్న వ్యక్తి ఈ లోకాన్ని త్వరగా విడిచి వెళ్లాలని భావించడం తప్పేమీ కాదని కూడా న్యాయమూర్తులు తమ తీర్పులో వెల్లడించడం గమనార్హం.

మేలో డొనాల్డ్ ట్రంప్, కిమ్ జాంగ్ భేటి



జాతీయ భద్రతా సలహాదారు చుంగ్ ఈ యాంగ్, శ్వేత సౌధంలో అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఆపై ఆయన మీడియాతో మాట్లాడుతూ, అణు పరీక్షలకు, క్షిపణి ప్రయోగాలను ఆపేందుకు, దక్షిణ కొరియాతో కలసి సంయుక్త సైనిక విన్యాసాలు చేసేందుకు కిమ్ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వింటర్ ఒలింపిక్స్ తరువాత ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య ఉన్న ఉద్రిక్త వాతావరణం చల్లబడగా, గడచిన సోమవారం పాంగ్‌యాంగ్ లో కిమ్‌తో చుంగ్ ఈ యాంగ్ నాలుగు గంటల పాటు సమావేశమయ్యారు. ఆ వివరాలను అగ్ర రాజ్యానికి వివరించిన ఆయన మే నెలలోగా ట్రంప్, కిమ్ భేటీ ఉంటుందని, అందుకు ట్రంప్ సైతం అంగీకరించారని స్పష్టం చేశారు. సాధ్యమైనంత త్వరలో ట్రంప్‌ను కలుసుకోవాలని కిమ్ కూడా భావిస్తున్నారని, వీరి భేటీ చరిత్రాత్మకమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

బడ్జెట్ కౌంట్ డౌన్ షురూ



అంచనాతో ఆర్థిక సంవత్సరంలో మిగిలింది మార్చి నెల ఆదాయం కూడా జోడిస్తే.. రాష్ట్ర ఆదాయం దా దాపు రూ.1.10 లక్షల కోట్లకు చేరే అవకాశముందని ఆర్థికశాఖ అధికారులు పేర్కొంటున్నారు. వాస్తవ ఆదాయానికి మించి అంచనాలు వేసుకోవటంతో పాటు ఏడాది మధ్యలో కేంద్రం తెచ్చిన జీఎస్టీ ఎఫెక్ట్‌తోనే ఈ పరిస్థితి తలెత్తినట్లు స్పష్టమవుతోంది. ఆర్థిక సంవత్సరంలో రూ.4,571 కోట్ల మిగులు ఉంటుందని అంచనా వేసిన ప్రభుత్వం తొలి పది నెలల్లో రూ.3,643 కోట్ల లోటును కాగ్‌కు చూపించింది.

15.6 శాతం ఆదాయ వృద్ధి

అంతకు ముందు ఏడాదితో పోలిస్తే రాష్ట్ర రెవెన్యూ రాబడి మొత్తం 13 శాతం ఎగబాకింది. పన్నుల ద్వారా వచ్చే ఆదాయం 15.6 శాతం వృద్ధి సాధించింది. 2016–17లో తొలి పది నెలల్లో పన్నుల ద్వారా రూ.48,704 కోట్ల ఆదాయం సమకూరగా, ఈ ఫిబ్రవరి నెలాఖరుకు రూ.65,348 కోట్ల రాబడి వచ్చింది. ప్రధానంగా ఎక్సైజ్ డ్యూటీ ద్వారా వచ్చే ఆదాయం ఖజానాకు ఊతమిచ్చింది. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఎక్సైజ్ డ్యూటీ అమాంతం రూ.3,500 కోట్లు, స్టాంపుల రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయం రూ.410 కోట్ల మేరకు పెరిగింది.

జీఎస్టీతో రూ. 7వేల కోట్ల గండి

అయితే జీఎస్టీతో రాష్ట్ర ఖజానాకు నష్టం వాటిల్లింది. 2016–17లో పది నెలల్లోనే వ్యాట్ ద్వారా రూ.27 వేల కోట్ల ఆదాయం వస్తే.. వ్యాట్ స్థానంలో వచ్చిన జీఎస్టీతో ఈ సారి రూ.20,882 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దీంతో జీఎస్టీతో దాదాపు రూ.7 వేల కోట్ల గండి పడింది. ద్రవ్య లోటును భర్తీ చేసేందుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.24,140 కోట్లు అప్పులు తీసుకుంది.

మోడీ కన్నా వాజ్‌పేయి మేలు

రాకపోవడం తన ఇష్టం అని చెప్పారు. లోక్‌సభలో కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా నిరాకరించి, వీలు చిక్కినప్పుడల్లా గాంధీ– నెహ్రూ కుటుంబాలపై విమర్శలు గుప్పించే ప్రధాని నరేంద్ర మోడీ తీరును కాంగ్రెస్ మాజీ అధినేత్రి సోనియా గాంధీ తప్పు పట్టారు. 2014, మే 26 (మోడీ బాధ్యతలు స్వీకరించిన రోజు) కంటే ముందు దేశంలో అసలు అభివృద్ధే జరగలేదన్నట్లు, గడచిన నాలుగేళ్లలోనే అంతా సాధించినట్లు మాట్లాడడం జాతిని అవమానించినట్లేనని సోనియా అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఇండియా టుడే ముంబై కంక్లేవ్‌లో మాట్లాడిన ఆమె వాజపేయి, మోడీ మధ్య తేడాను ఎత్తిచూపారు. ప్రజాస్వామ్యానికి



పట్టుకొమ్మ వంటి పార్లమెంటరీ వ్యవస్థను వాజపేయిగారు అమితంగా గౌరవించే వారని, ప్రస్తుత ప్రధాని మాత్రం ప్రజాస్వామ్యాన్ని ఏకపాత్రగా పరిగణిస్తున్నారని, అసమ్మతి, చర్చలు ఉంటాయనే స్పృహను మరచిపోయారని, వాజపేయికి, మోడీకి మధ్య ప్రధానమైన తేడా ఇదేనని సోనియా అన్నారు. లీడర్ కన్నా మంచి రీడర్ నేను : ఒక పార్టీకి అధ్యక్షురాలిగా నా పరిధి ఏమిటనేది స్పష్టంగా తెలుసు. నేను మంచి వక్తను కానని ఒప్పుకోవడానికి వెనుకాడను. నన్ను లీడర్ అనే కన్నా మంచి రీడర్ అంటే సబబుగా ఉంటుందేమో (నవ్వులు) అని చమత్కరించిన సోనియా తన కంటే మన్మోహన్ సింగ్ సమర్థుడైన నాయకుడని కితాబు ఇచ్చారు.

కొత్త శైలితోనే కాంగ్రెస్‌కు జీవం : 2014 ఎన్నికల తరువాత కాంగ్రెస్ పార్టీ వరుస వైఫల్యాలపై సోనియా కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడారు. అవును. మేము మార్కెట్ నుంచి తోసేయబడ్డాం. ఇప్పుడు సరికొత్త శైలితో మళ్లీ ప్రజలతో మమేకం అవుతాం. పార్టీ విధి విధానాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళతాం అని సోనియా చెప్పారు.

ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తన భర్తను గుర్తు తెచ్చుకుని కన్నీరు పెట్టుకున్నారు. రాజకీయాల్లో ప్రజా సేవ మాత్రమే మొదటి ప్రాధాన్య అంశమని, మిగతావన్నీ ఆ తరువాతేనని ఆమె అన్నారు. తన అత్త ఇందిరా గాంధీ హత్య అనంతరం తన భర్త రాజీవ్ గాంధీ రాజకీయాల్లోకి రావడం అనివార్యమైందని చెప్పారు. అయితే, ఆయన కూడా కుటుంబానికి దూరమవుతారని తాను ఆందోళన చెందానని తెలిపారు. అందుకే తాను అప్పట్లో ఆయనను రాజకీయాల్లోకి రావద్దన్నానని, అలా అనడం తన స్వార్థమే కావచ్చని సోనియా గాంధీ చెప్పారు. ఆయనను హత్య చేస్తారనే భయం తమలో ఉండేదని, చివరికి భయపడినట్లు జరిగిందని చెప్పి సోనియా గాంధీ కన్నీరు పెట్టుకున్నారు. రాజీవ్ గాంధీని 1991లో ఎల్టీటీఈ తీవ్రవాదులు హత్య చేసిన విషయం తెలిసిందే.



చల్లపల్లిలో జరిగిన జాబ్‌మేళాకు విశేష స్పందన

చల్లపల్లి, మేజర్‌న్యూస్: నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జాబ్‌మేళా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో చల్లపల్లి సన్‌ఫ్లవర్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సంధర్భంగా జరిగిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బుద్ధప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను తగ్గించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషిచేస్తున్నారనీ, ఇందుకోసం నైపుణ్యాభివృద్ధి సంస్థను ఏర్పాటుచేసి రాష్ట్రవ్యాప్తంగా జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా నియోజకవర్గంలో రెండుసార్లు జాబ్‌మేళా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారన్నారు. నిరుద్యోగులు జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగులుగా స్థరపడితే ప్రభుత్వానికి అంతకంటే మరో సంతోషం ఉండదని అన్నారు. ప్రతిభావంతులను గుర్తించి వారిని రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు చేయాలనే ఆలోచన ముఖ్యమంత్రి చేస్తారనీ, ఈ క్రమంలో అమెరికాలో ఉన్నతస్థానంలో ఉన్న గంటా సుబ్బారావును పిలిపించుకుని ఏపీ ఐటీ అభివృద్ధికి బాటలు వేశారనీ, నవ్యాంధ్రలో నైపుణ్యాభివృద్ధి సంస్థకు డైరక్టర్‌గా నియమించారని తెలిపారు. యువతకు ఉపాధి శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించేందుకు సంస్థ పనిచేస్తున్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ డైరక్టర్ గంటా సుబ్బారావు మాట్లాడుతూ యువతకు నైపుణ్యశిక్షణ ఇచ్చి కృష్ణాజిల్లాలో గత ఏడాదిలో మూడువేల మందికి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు.

కాంగ్రెస్‌కు యాత్రలు కలిసొచ్చేనా?

- ముగిసిన మొదటి విడత ఉత్తమ్ బస్సు యాత్ర
- చేవేళ్ల సెంటిమెంట్ ఫలిస్తుందా?
- యువనాయకత్వం పాదయాత్రలకు సన్నహాలు
- ఖమ్మం నుంచి భట్టి - ఆదిలాబాద్ నుంచి పొన్నం- మహబూబ్‌నగర్ నుంచి రేవంత్
- కాంగ్రెస్ హైకమాండ్ పచ్చజెండా
- హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ
- యాత్రలకు ఢిల్లీ నుంచి నేతల రాక
- ప్రభుత్వ వైఫల్యాలపై దండయాత్ర
- అధికారమే లక్ష్యంగా వాగ్దానాలు

(ఖమ్మం సూర్యబ్యూరో): రానున్న ఎన్నికలకు పార్టీలు సిద్ధమౌతున్నాయి. ఈ సారీ తెలంగాణ రాష్ట్రంలో పోరు రసవత్తరంగా మారే ఆవకాశాలు కనిపిసున్నాయి. అధికారంలో ఉన్న టిఆర్‌యస్ అధికారాన్ని నిలబెట్టుకు నేందుకు సిద్ధపడుతుండగా , కాంగ్రెస్ పార్టీ ఈ సారి ఏలాగైనా అధికారాన్ని హస్త గతం చేసుకోవాలని ఎత్తులు వేస్తుంది. అధికారం కోసం ఈ రెండు పార్టీలు పోటి పడుతుండగా ఎన్నికలు కురుక్షేత్రాన్ని తలపించనున్నాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మిగతా పార్టీలు ఆవకాశాలకోసం ఎదురు చూస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ ప్రధానంగా యాత్రల సెంట్‌మెంట్‌ను నమ్ముకుంది. 2003లో వైయస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర చేయటం ద్వారానే అధికారంలోకి వచ్చాడని అందువల్ల పాదయాత్రలు తమకు కలిసొచ్చే ఆంశంగా భావిస్తున్న కాంగ్రెస్ రాష్ట్రంలోని మూడు ప్రాంతల నుంచి ముగ్గురు నేతల ద్వారా యాత్రలు చేపట్టేందుకు సిద్ధమౌతుంది. దీనికి కాంగ్రెస్ హైకమాండ్ నుంచి గ్రీన్ సిగ్నల్ రావటంతో నాయకులు యాత్రలకోసం రూట్ మ్యాప్‌లను తయారు చేసుకుంటున్నారు. టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రెడ్డి బస్సు యాత్ర చేపట్టి రంగారెడ్డి, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలను చుట్టివచ్చారు. అందుకు ప్రత్యేక బస్సును సిద్ధంచేసి తమకు సెంటిమెంట్‌గా ఉన్న చేవేళ్ళ నుంచి యాత్ర ప్రారంచించారు. రాష్ట్రం అంతటా జరిగే ఈ యాత్ర మొదటి దశలో 8 రోజులు గురువారంతో ముగిసింది. యాత్ర జయప్రదం కోసం ప్రత్యేక కమిటీలను కూడా ఏర్పాటుచేశారు. యాత్రల ద్వారా టిఆర్‌యస్ పాలనపై విమర్శనాస్త్రాలు సందించారు. అందురు నాయకులు కలిసి ఐక్యతా రాగం వినిపించారు. పాదయాత్రలకు కూడా హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో పార్టీలోని యువనాయకత్వం సిద్ధమౌతుంది. ఈ యాత్రలకు ఢిల్లీ నుంచి కాంగ్రెస్ పెద్దలు హాజరుకానున్నట్లు తెలుస్తుంది. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క యాత్రను తన నియోజకవర్గమైన మధిర నుంచి ప్రారంభించాలనే ఆలోచనలో ఉన్నారు. పాత ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాలోని నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ఇక పిపిసి ఉపాధ్యక్షుడుగా ఉన్న మాజీ




ఎంపి పొన్నం ప్రభాకర్ ఆదిలాబాద్‌జిల్లా నుంచి యాత్రను ప్రారంభించినున్నారు. ఆయన నిజామాబాద్, మెదక్, రంగారెడ్డి హైద్రాబాద్ చేరుకుంటారు. రేవంతరెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి బయలు దేరి రంగారెడ్డి హైద్రాబాద్ చేరుకుంటారు. మూడు యాత్రలు హైద్రాబాద్‌లో ఒకే రోజు చేరుకునేలా ప్రణాళికలు రూపొందించనున్నారు. దీనికన్నా ముందు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ నెల 26 నుంచి బస్సు యాత్ర చేపట్టారు. మొదటి విడతగా 8 రోజుల పాటు ఈ యాత్ర చేవేళ్ళ నుంచి ప్రారంభమై ఉత్తర తెలంగాణ జిల్లాల్లో సాగింది. యాత్రసాగిన తీరుపట్ల కాంగ్రెస్ నాయకత్వం సంతృప్తిని వ్యక్తంచేసింది. తెలంగాణలో అధికార టిఆర్‌యస్ మీద అసంతృప్తి ఉన్నప్పటికి దాన్ని మెటిరియలైజ్ చేసుకునే స్థితిలో



కాంగ్రెస్ పార్టీలేదనే అభిప్రాయాన్ని రాజకీయ పరిశీలకులు వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో సమర్ధులైన నాయకులు ఉన్నప్పటికి సమన్వయ లోపం వారిని కోంప ముంచుతుందనే బావన కూడా లేకపోలేదు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్‌కు ప్రజల్లో ప్రచారం చేసుకునే ఆవకాశం ఉన్నప్పటికి దాన్ని వారు ప్రజల్లోకి తీసుకుని పోలేకపోతున్నారనే అభిప్రాయాలు ఉన్నాయి. కాంగ్రెస్‌ను ఏమాత్రం ఆలోచించుకోనివ్వకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఎదో ఒక పథకం పెడుతున్నానని ప్రకటించటం దానిపై కాంగ్రెస్ నేతలు దూమారం లేపటంతోనే సరిపోతుంది. దీంతో కేసీఆర్ పన్నుతున్న ఉచ్చులో చిక్కుకుని కాంగ్రెస్ నాయకులు గిజగిజ లాడుతున్నారు. ఆయన చేసిన వాగ్దానాలు , టిఆర్‌యస్ ఎన్నికల ప్రణాళికపై నిలదీసే బదులు ఆయన జిమ్మిక్కులకే ఎక్కువ ప్రధాన్యత ఇస్తున్నారనే అభిప్రాయాలు కాంగ్రెస్ పార్టీలో ఉన్నాయో లేవో కాని ప్రజల్లో మాత్రం బాగా ఉన్నాయి. నీరు, నియామకాలు, నిధులు కోసం కోట్లాడి సాధించుకున్న తెలంగాణలో వాటిపై స్పష్టత లేకపోగా పాత ప్రాజెక్టులకే షోకులు చేస్తు ఇది తమ ఘనతగా చెప్పుకునేందుకు టిఆర్‌యస్ ప్రభుత్వం ప్రయత్నంచేస్తుందనే కాంగ్రెస్ విమర్శలు ప్రజల్లోకి తీసుకుని పోవటంలో ఎంతవరకు సక్సెస్ అయ్యారో చూడాలిమరి .అసలు తెలంగాణలో ఏం జరుగుతుంది. ప్రజలకు వచ్చిన ఇబ్బంది ఏమిటి? యాత్రల ఉద్దేశ్యం ఏమిటి? అనే ఆంశాలను కాంగ్రెస్ పెద్దలు ప్రజల్లోకి తీసుకునిపోయోందుకు చేస్తున్న ప్రయత్నాలు ఎంతవరకు ఫలితాలిస్తాయి. ప్రజలు ఏలా స్వీకరిస్తారు అనే దానిపై ఆధారపడి కాంగ్రెస్ భవిష్యత్ ఉంటుంది.మొదటి విడత బస్సు యాత్రలో ప్రజల నుంచి మంచి స్పందన వ్యక్తం అయిందని కాంగ్రెస్ పెద్దలు సంబరపడిపోతున్నారు. టిఆర్‌యస్ ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తుందనే విషయం ప్రజల్లో ఉందని అది తమకు ఉపయోగపడుతుం దని కాంగ్రెస్ బావిస్తే అంతకన్నా తెలివితక్కవ తనం మరొకటి ఉండదు. దానికి తగ్గ ఆధారాలను ప్రజలు విశ్వసించే విధంగా చెప్పారా? ప్రజలు ఏవిధంగా తమ ఉపన్యాసాలు విన్నారనే దానిపై ఆదారపడి ఉంటుంది. టిఆర్‌యస్ ప్రభుత్వం చేపట్టిన అనేక పథకాలు ప్రజలకు ఎంతవరకు ఉపయోగపడ్డాయి. వాటిలో దుర్వినియోగం ఏమైనా జరిగిందా? అనేది చూడాలి. జరిగితే ఎంతవరకు జరిగింది ఉదాహరణలతో సహ లెక్కులు వివరించి చేసిన ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయి అనేది చూడాలి. మిషన్ కాకతీయ ద్వారా ఎన్నిచెరువుల్లో మట్టితీశారు. తీసిన మట్టి ఎంత? ఎంత ఖర్చుచేశారు. ఒక్కక్క చెరువుకు ఎంత ఖర్చుచేశారు. లెక్కలు ఏమిటి? నిజంగా అంత పనిజరిగిందా? అనే విషయాలపై అవసరమైతే నిపుణుల చేత నిర్ధారణకు రావాల్సి ఉంటుంది. మిషన్ భగీరథ ద్వారా ఏంచేశారు. ఈ పథకం ఉద్దేశ్యం ఎంత వరకుసక్సెస్‌అయింది. రైతుల సమితులను ఏర్పాటు చేయటం ద్వారా రైతలకు ఏపాటి మేలు జరుగుతుంది. ఫీజు రీయంబర్స్ మెంట్, రైతలుకు రుణమాఫీ, ఉద్యోగనియామకాలు, కంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులైజేషన్, డ్యాక్రా మహిళలకు రుణమాఫీ, దళితులకు మూడు ఎకరాల భూమి లాంటి వాగ్దానాలపై కాంగ్రెస్ ఈ యాత్రల ద్వారా ప్రభుత్వాన్ని పై దాడి పెంచింది. తాము అధికారంలోకి వస్తే రైతులకు 2 లక్షల రూపాయాల రుణమాఫీ, ఒక్కసారిగా రద్దుచేస్తామని , నిరుద్యోగభృతి 3వేల రూపాయాలు ఇస్తామని , పెన్షన్ పెంచుతామని, పూర్తి పీజురియంబర్స్‌మెంట్‌చేస్తామని , డ్యాక్రామహిళలకు లక్షరూపాయాల వరకు రివల్వింగ్ ఫండ్ ఇస్తామని వాగ్దానాల వర్షం కురిపించింది. ఇక యాత్రల ముగింపు సందర్బంగా హైద్రాబాద్‌లో పెద్ద బహిరంగసభ నిర్వహించాలని దానికి ఎఐసిసి అధ్యక్షుడు రాహుల్‌గాంధీని ఆహ్వానించాలని నిర్ణయించారు. టిఆర్‌యస్ కూడా బహిరంగసభలు జనరంజక పథకాలతో ముందుకు సాగుతుంది. ఎన్నికల వేళ ఒక పక్క యాత్రలు మరో పక్క బహిరంగసభలతో రాష్ట్ర రాజకీయాలు వేడేక్కనున్నాయి.

మంత్రి ఈటల నిప్పులాంటి మనిషి

ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



హైదరాబాద్, మేజర్‌న్యూస్: రాష్ట్ర ఆర్థికమంత్రి ఈటెల రాజేందర్ నిప్పులాంటి మనిషని, ఆయనతో చెలగాటం కాంగ్రెస్ నేతలకు మంచిది కాదని రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అట్టడుగు స్థాయి నుంచి వచ్చిన ఈటెల, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ప్రజలకు సుపరిపాలనను అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈటెలపై కాంగ్రెస్ నేతలు పిచ్చి, పిచ్చి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ చచ్చిన పీనుగని, ఇక పైకిలేచే ప్రసక్తే లేదన్నారు. హుజురాబాద్‌లో ముగిసింది కాంగ్రెస్ బస్సు యాత్ర కాదని, ఆ పార్టీకి జరిగిన అంతిమ యాత్రని విమర్శించారు. తిట్ల కోసమే అయితే బస్సు యాత్రలు ఎందుకని ఆయన ప్రశ్నించారు. మంత్రి కేటీఆర్‌పై కాంగ్రెస్ చేసిన అడ్డగోలు విమర్శలను ఖండిస్తున్నామని తెలిపారు. . మైకు దొరికితే చాలు కాంగ్రెస్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి బండ బూతులు మాట్లాడుతున్నారని అన్నారు. రేవంత్ కాంగ్రెస్‌లో జోకర్‌గా మారారని ఎద్దేవా చేశారు. ఉద్యమంలో దొంగగా ఉన్న రేవంత్‌కు ఉస్మానియాలో తగిన గుణపాఠం జరిగిందని గుర్తు చేశారు. ఇతరులపై బురద చల్లి కడుక్కోమన్నట్టుగా రేవంత్ ధోరణి ఉందని రసమయి బాలకిషన్ విమర్శించారు.

ఏపీ ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలి

వైసీపీ నేత నాగిరెడ్డి



విజయవాడ, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా మోసం, దగా అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం అధ్యక్షుడు నాగిరెడ్డి విమర్శించారు. వ్యవసాయానికి ఎంతో చేస్తామని చెప్పిన చంద్రబాబు ప్రభుత్వం చివరకు అరకొర కేటాయింపులే చేసిందని మండిపడ్డారు. శుక్రవారం ఆయన పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర రైతాంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆఖరి బడ్జెట్‌లో కూడా కేటాయింపులు చేయకుంటే రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఓ పక్క ధాన్యానికి గిట్టుబాటు ధరలు లేకున్నా మరోపక్క, నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నా చంద్రబాబు ఎందుకు మౌనంగా ఉండిపోయారని నిలదీశారు. ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారని ప్రశ్నించారు. అంసెబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని అబద్ధాలే చెప్పారని దుయ్యబట్టారు. పంటల సాగు తగ్గిపోయి రైతుల వలసలు పెరగిపోతుంటే వ్యవసాయ రంగం ఎక్కడ బాగుందని ప్రశ్నించారు. రైతుల ఉసురు పోసుకున్న ప్రభుత్వాలు ఇప్పటి వరకు మనుగడ సాగించలేదని, చంద్రబాబు ప్రభుత్వం కూడా ఎక్కువకాలం ఇక సాగబోదని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే రైతాంగానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

హెూదా ఇస్తే ఎవరితోనైనా కలుస్తాం

వైసీపీ ఎంపీ వరప్రసాద్



న్యూఢిల్లీ, మేజర్‌న్యూస్: ప్రత్యేక హోదా బీజేపీ సొమ్ముకాదని, ఇచ్చి తీరాల్సిందే అని వైసీపీ ఎంపీ వరప్రసాద్ డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా ఇస్తే ఎవరితోనైనా కలిసి ఉంటామని ప్రకటించారు. శుక్రవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకపోతే రాజీనామా చేస్తామని స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా కోసం కేంద్రంపై ఎంపీలందరూ ఒత్తిడి తేవాలన్నారు. 14వ ఆర్థిక సంఘం ప్రత్యేక హోదా ఇవ్వొద్దని చెప్పిందనడం హాస్యాస్పదమని ఎంపీ వరప్రసాద్ మండిపడ్డారు

13న యథావిధిగా ఇంటర్ పరీక్ష

ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : ఈ నెల 13న ఇంటర్ పరీక్ష యథాతథంగా నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్ తెలిపారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర బంద్ పిలుపు నేపథ్యంలో పరీక్ష వాయిదా వేయనున్నట్లుగా పుకార్లు షికార్లు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే బంద్ నిర్వాహకులు విద్యార్థి సంఘాలు, ఇంటర్ పరీక్షల నిర్వాహణకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బంద్ రోజున పరీక్ష యథావిధిగానిర్వహిస్తామని, ఈవిషయాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గమనించాలన్నారు. . ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13న తెలంగాణ బంద్‌కు ఎమ్మార్పీఎస్ పిలునిచ్చింది. అయితే ముందస్తుగా ఖరారు చేసిన ఇంటర్ షెడ్యూల్‌లో ఎలాంటి మార్పు చేయడం కుదరని ఇంటర్‌బోర్డు అధికారులు స్పష్టం చేశారు.

ప్రభుత్వ బడ్జెట్‌లో రూ.1102 కోట్లు కేటాయింపు హర్షణీయం

మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.డీ హిదాయత్



విజయవాడ, సూర్య బ్యూరో : ముస్లీం సమాజంలో నెకొన్న పేదరికాన్ని, అవిద్యను దూరం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో గతంలో ఎన్నడూ లేనంతగా రూ.1102 కోట్లను కేటాయించడం హర్షణీయమని మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.డీ హిదాయత్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.డీ హిదాయత్ మాట్లాడుతూ మంత్రి లేకపోయినా ముస్లిలంకు ముఖ్యమంత్రి వేల కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయిస్తూ వారి సంక్షేమానికి, అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నారన్నారు. గతంలో మైనారీటీలను ఓటు బ్యాంక్‌గా ఉపయోగించుకుని నిర్లక్ష్యం చేశారన్నారు. గతంలో ఆదాయం లేని మసీదులకు అపలు ఉండేయని తెలిపారు. ఇమామ్‌కు రూ.5 వేలు, మౌజమ్‌లకు రూ.7 వేలు ప్రభుత్వం ప్రతి నెలా జీతాలు ఇస్తుందన్నారు. ముస్లీం యువతకు స్వయం ఉపాధికి గత ఏడాది రూ.100 కోట్లు ఉంటే నేడు రూ.150 కోట్లకు పెంచారన్నారు. ముస్లీంలలోని నూర్‌బాషా సామాజిక వర్గానికి గతంలో రూ.2 కోట్లు కేటాయించగా నేడు రూ.40 కోట్లకు పెంచారన్నారు.

ధర్నాచౌక్‌ను ఎత్తేసిన కేసీఆర్ ఢిల్లీలో ధర్నా చేస్తాననడం హాస్యాస్పదం

- దేశంలో ప్రజాస్వామ్యాన్ని హత్య చేస్తున్న కేంద్ర ప్రభుత్వం
- సిపిఐ జిల్లా కార్యదర్శి చాడ

గోదావరిఖని, మేజర్‌న్యూస్: రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ఉద్యమాలను, ధర్నాలను అణచివేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలో మూడవ ఫ్రంట్ పెట్టి ఢిల్లీలో ధర్నా చేస్తాననడం హాస్యాస్పదంగా ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఇక్కడ జరిగిన సిపిఐ పార్టీ పెద్దపల్లి జిల్లా రెండవ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. ఉద్యమాల నుంచి పుట్టిన పార్టీ టిఆర్ఎస్ పార్టీని చెప్పుకునే కేసీఆర్ రాష్ట్రంలో ఆ ఉద్యమాలు చేసేవారి పట్ల కఠినంగా వ్యవహరించడమే కాకుండా ధర్నా చౌక్‌ను ఎత్తివేయడం పట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో అత్యంత కీలక ఘట్టమైన మిలీనియం మార్చ్‌ను గుర్తు చేస్తూ ఈ నెల 11న సభ ఏర్పాటు చేస్తే ఆ సభను విచ్ఛిన్నం చేసేందుకు కేసీఆర్ కుట్రలు పన్నడం గర్హనీయమని అన్నారు. వాస్తవంగా ప్రభుత్వమే అధికారికంగా సభను నిర్వహించాల్సి ఉండగా, నిర్వహించ తలపెట్టిన సిపిఐ, టి.జెఎసికి చెందిన వేలాది మంది కార్యకర్తలను ముందస్తు అరెస్టులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని చాడ హితవు పలికారు. ఈశాన్య రాష్ట్రాల్లో బిజెపి గెలిచిన దురహంకారంతో త్రిపురలో లెనిన్, తమిళనాడులో పెరియార్, మరికొన్ని చోట్ల రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, ఇందిరాగాంధీ విగ్రహాలను ధ్వంసం చేయడం ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడమే అవుతుందని అన్నారు. సంఘ్ పరివార్ దేశంలో మత తీవ్రవాదాన్ని రెచ్చగొడుతూ హిందూయేతర ప్రజలు, వారితో




ఏకీభవించని లౌకిక శక్తులను అంతం చేసేందుకు ప్రయత్నిస్తోందని, దీనిని ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. పది లక్షల కోట్ల రూపాయల మొండి బకాయిలు, బ్యాంకు కుంభకోణాలకు పాల్పడిన పారిశ్రామిక వేత్తలను, కార్పోరేట్ శక్తులను రక్షించే చర్యలను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఆపివేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, అభివృద్ధి నిరోధక విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య లౌకిక వామపక్ష విశాల సంఘటన అవసరమని గుర్తించి ఆ దిశగా సిపిఐ పార్టీ అడుగులు వేస్తుందని వెంకట్‌రెడ్డి వివరించారు. ఈ మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండా మల్లేశ్, నాయకులు ఎం.నారాయణ, వై.గట్టయ్య, గౌతం గోవర్ధన్, వేల్పుల నారాయణ, జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవులు కోసం నిరీక్షణ

- సంక్రాంతి తరువాత ఉగాది వస్తుంది అన్నారు
- ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకోలేదని విమర్శలు
- ఆశావహుల్లో నిరాశ
- మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారిన వైనం
- సుడా పాలక వర్గం ఏర్పాటులోనూ జాప్యం
- భద్రాచలం టెంపుల్ కమిటీ నియామకంపై తాత్సారం
- ఉద్యమకారుల్లో ఆవేదన
- టిఆర్‌యస్‌లో తీవ్ర అంసంతృప్తి

(ఖమ్మం-సూర్యబ్యూరో): తెలంగాణ రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టులు భర్తీకోసం టిఆర్‌యస్ శ్రేణులు నిరీక్షణలో ఉన్నాయి. అధిగో పోస్టుల భర్తీ ఇదిగో భర్తీ అంటు నాలుగు సంవత్సరాలు గడిచింది. ప్రభుత్వ పదవీ కాలం కూడా మరో యేడాదితో ముగుస్తుంది. దీంతో పదవుల పందెరాం ప్రకటనలకే పరిమితమైందనే విమర్శలు ఉన్నాయి. ఉగాది, దసరా, దీపావళి సంక్రాంతికి భర్తీచేస్తామని చెప్పినప్పటికి పండగలు పోయి మరలా తిరిగి వస్తున్నాయోతప్ప పదవలు మాత్ర రావటం లేదు. కనీసం వాటి జాడ కూడ లేకపోవటంపై టిఆర్‌యస్ కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నది. స్వయంగా ముఖ్యమంత్రి సంక్రాంతి తరువాత నామినేటెడ్ పదవులు ఇస్తామని చెప్పి మాటనిలబెట్టుకోలేదని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. వాటి కోసం ఆశావాహులు కళ్ళు కాయలు కాచేలా ఎదరుచూస్తు న్నారు. పదవులు, ఉద్యమకారులకా? ఇతర పార్టీల నుంచి వచ్చిన వారీకా అనే చర్చ జరుగుతుంది. ఇంతకాల ఓపికతో కేసీఆర్ మీద ఉన్న నమ్మకంతో ఉన్న ఉద్యమకారులు తమ గళాలు విప్పుతున్నారు. పదవుల భర్తీ వ్యవహారం మంత్రులకు, ఎంపిలకు, ఎమ్మెల్యేలకు తలనొప్పిగా తయూరైంది. పంచాయతీ ఎన్నికలు నెత్తిమీదకి వస్తుండటంతో టెన్షన్‌పెరిగింది. రాష్ట్రం ఏర్పడి నాలుగుసంవత్సరాలు అయింది. ప్రభుత్వం నాలుగు సంవత్సరాలుగా పారిపాలన సాగిస్తుంది. పరిపాలన మరింత వేగవంత చేసేందుకు ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ప్రభుత్వం ఆయా మంత్రిత్వశాఖలకు సహయపడేం దుకు కార్పొరేస్లను ఏర్పాటు చేస్తుంది. ఆపదవుల భర్తీపై తాత్సారం జరగటంతో అసంతృప్తి పెరుగుతుంది. తెలంగాణ రాష్ట్రం వస్తే పదవులు వస్తాయని ఎంతో ఆశతో ఎదురు చూసిన ఉద్యమకారులకు ఇప్పటి వరకు పదవులు రాకపోవటంతో నిరాశే మిగిలింది. రాష్ట్రంలో 50 కార్పొరేషన్లు ఉన్నాయి. ఈ కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించి సంవత్సరం గడిచింది. కాని ఆకార్పొరేషన్లకు డైకర్టర్లను నియమించలేదు. 50 కార్పొరేషన్లకు 31 జిల్లాల నుంచి జాబితా ముఖ్యమంత్రి వద్దకు వెళ్లింది. 50 కార్పొరేషన్లకు సుమారు 400 మందికి పైగా డైరక్టర్లను నియమించాల్సి ఉంది. ఈ రకంగా రాష్ట్రంలోని 31 జిల్లాలకు , జిల్లాకు 15 డైరక్టర్లు చొప్పున వచ్చే ఆవకాశం ఉంది. ఇవి కాక ప్రతిజిల్లాలో వక్ఫ్‌బోర్డు, వినియోగ దారుల ఫోరం, ట్రాన్సుపోర్టు కమిటి, వరకట్న వ్యతిరేక కమిటీ, బాల్య వివాహల నిరోదక కమిటీలలో చైర్మన్, డైరక్టర్లను జిల్లా స్థాయి పదవులకోసం నియమించాల్సి ఉంది. ఇవే కాక చిన్నా చితకా మరో పదికమిటీలు కూడా స్థానికంగా ఎర్పాటు చేసుకునేందుకు ఆవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 500 మందికి పైగా నామినేటేడ్ పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. దేవాలయాల లాంటి కొన్ని పదవులు భర్తిచేసినా ఇంకా భర్తీచేయాల్సిన పదవులు అనేకం ఉన్నాయి. కీలకంగా ఉన్న భద్రాచలం ట్రస్టుబోర్డు చైర్మన్‌గా ఎవరిని



నియమించలేదు. దాన్ని యదాద్రి తరహలో అభివృద్ధి చేయాలనే యోచన లో ఉన్న ముఖ్యమంత్రి కమిటీని ఇప్పట్లో వేసేందుకు సుముఖంగా లేరని తెలుస్తుంది. ప్రభుత్వం ఏర్పడిన తరువాత మూడ వసంవత్సరంలో గాని పదవుల భర్తీగూరించి ఆలోచన రాలేదు. వచ్చినా వాటికి పెద్ద ప్రాధాన్యత ఇవ్వలేదు. భర్తీ చేసిన పోస్టుల్లో కూడా ఉద్యమానికి సంబంధంలేని వారికి ఇచ్చారనే విమర్శలు వెల్లు ఎత్తుతున్నాయి. మంత్రి పదవులు, ఎమ్మెల్సీల పదవులు వారికే ఇవ్వటంపై ఇప్పటికే పెద్ద దుమారమే నడుస్తుంది. తెలుగుదేశం నుంచి వచ్చిన వాళ్లకు, తెలంగాణను వ్యతిరేకించిన వాళ్లకు పదవులు ఇవ్వటంపై కేసీఆర్ తీవ్ర విమర్శలనే ఎదుర్కొన్నారు. ఉద్యమంలో పనిచేసిన వాళ్లకు పదవులు ఇవ్వాలనే డిమాండ్ పెరుగుతున్నది. జనవరి 1 వతేదీన ఖమ్మం జిల్లా టిఆర్‌యస్ పార్టీ కార్యాలయం ప్రారంభం రోజున ఉద్యమకారులు ఈ విషయాన్ని జిల్లా మంత్రి తుమ్మల నాగే శ్వరరావు దృష్టికి తెచ్చారు. త్వరలో నామినేటేడ్ పదవులు భర్తీ చేసేందుకు ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నారని అంటునే ఆయా నియోజకవర్గాల్లో ఉన్న ఎమ్మెల్యేలు ఉద్యమకారు లను గుర్తించి వారికి ప్రాధాన్యత నిస్తూ జాబితా అందజేయాలని తెలిపారు. ఇదే సభలో పాల్గొన్న ఎమ్మెల్సీ మండలిలో ప్రభుత్వ విఫ్ పల్లా రాజేశ్వరరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి 2018 సంవత్సరాన్ని నామినేటేడ్ పదవులు భర్తీచేసే సంవత్సరంగా పెట్టకు న్నారని , సంక్రాంతి వెళ్ళిన మరుసటి రోజునే పదవుల భర్తీ జరుగుతుందని చెప్పారు. ఈ సందర్బంగా అక్కడకు వచ్చిన కార్యకర్తలు కరతాళ ధ్వనులు చేశారు. అయితే సంక్రాంతి పోయింది. శివరాత్రి పోయింది. హోళిపోయింది. ఉగాధిపోతుంది. నవమి వచ్చింది. పార్టీని నమ్ముకున్న వాళ్ళకు నామినేటేడ్ పదవుల రాలేదనే అసంతృప్తి నెలకొన్నది. పంచాయతీ ఎన్నికల తీరు అదే విధంగా ఉంది. ఇప్పుడున్న పంచాయతీలే కాకుండా రాష్ట్రంలో మరో 4వేలకు పైగా పంచాయతీలను ఏర్పాటుచేయటంతో పాటు పిబ్రవరిలో ఎన్నికలు జరుపుతామని కూడా స్వయంగా ముఖ్యమంత్రి చెప్పారు.కాని ఫిబ్రవరి పోయింది. మార్చి వచ్చింది. కాని పంచాయతీ ఎన్నికల ఊసే లేదు. ఒక వేళ ఎన్నికల వస్తే కోడ్ అమలు సాకుతో మరికొన్ని నెలలు నామినేటేడ్ పదవులు వాయిదా పడే ఆవకాశం ఉంది. తరువాత జనరల్ ఎన్నికల వాతావరణం ఎలాగు వస్తుంది. ఎన్నికలకు ఆరునెలల ముందు నామినేటేడ్ పదవులు వస్తే ఎంత రాకపోతే ఎంత అనే ఉద్దేశ్యంతో కార్యకర్తలు ఉన్నారు. ఇక ఖమ్మం నగరాన్ని మరింత అభివృద్ధి గావించేందుకు చుట్టుపక్కల 20 కి.మీ వరకు గ్రామాలను కలుపుతూ స్థంభాద్రి అర్బన్ దవలప్ మెంట్ ఆథారిటిని ఏర్పాటు చే శారు. దీనికి కమిటీ వేయాల్సి ఉన్నప్పటికి అధికారులతో మాత్రమే కమిటీ వేశారు. దీనిపై ఆశలు సెట్టుకున్నకొందరు ఇక ఇంతే సంగతలు అనే నిరాశతో ఉన్నారు. అయితే దీనికి జి.ఓ రావల్సి ఉందని అది వచ్చిన తరువాతనే కమిటీ ఏర్పాటుకు ఆవకాశం ఉంటుందని తెలుస్తుంది. దీని పరిధి నాలుగు నియోజకవర్గాలకు విస్తరించి ఉన్నందున ఇందులో సభ్యులు ఎమ్మెల్యేలతో పాటు, ఎంపి కూడా ఉండే ఆవకాశం ఉంది. అందువల్ల కూడాకు పాలక వర్గాన్ని ప్రకటిస్తే ఎమ్మెల్యేలలో ఒకరికి చైర్మన్ గిరి దక్కేఆవకాశం ఉంటుంది. అసలు నామి నేటేడ్ పదవుల భర్తీపై ముఖ్యమంత్రి ఏం ఆలోచిస్తున్నారు? ఖమ్మం సుడా పై ఏలాంటి నిర్ణయం తీసుకుంటారనే అభిప్రాయాలు పటాపంచలు కావాలంటే పదవుల భర్తీ జరగాల్సిందే .

పారాణి ఆరకముందే వరుడి దుర్మరణం

- డ్రైవరుతో సహా ఐదుగురి దుర్మరణం
- ఒకే కుటుంబంలో 4నలుగురు దుర్మరణం
- ప్రమాదానికి గురైన పెండ్లికారు



ఖమ్మం, మార్చి9, సూర్య ప్రతినిధి: పెండ్లై పూర్తిగా ఒక్కరోజు గడవకముందే ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. కాళ్ళపారాణి ఆరకముందే కొత్తదంప తులలో వరుడు రోడ్డు ప్రమాదంలో మరణించడం, అతనితోపాటు మరో ముగ్గరు కుటుం బసభ్యులు, డ్రైవరు మృతిచెందిన దారుణ సంఘటన ఖమ్మం జిల్లా కొణిజెర్ల మండల పరిధిలోని పల్లిపాడు వద్ద జరిగింది. శుక్రవారం ఉదయం జరిగిన ఈ ఘోరసంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వరంగల్ రూరల్ జిల్లా వర్ధన్నపేటకు చెందిన అచ్చి రామకృష్ణప్రసాద్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన భావనదుర్గ తో నెలరోజుల క్రితం వివాహం నిశ్చయంకాగా గురువారం రాత్రి 10.26 నిమిషాల శుభ ముహూర్తానికి తణుకులోని కేశవస్వామి ఆలయంలో శాస్త్రోక్తంగా జరిగింది. రాత్రి వివాహం పూర్తయ్యాక వరుని ఇంటివద్ద శుక్రవారంనాడు ఏర్పాటుచేసిన రిసెప్షన్‌కు హాజరుకావడానికోసం వెంటనే నూతన దంపతులతో పాటు మరో 8మంది కలిపి మొత్తం పదిమంది ఇన్నోవా కారులో నూ, మిగతా బంధువులు వెనుక బస్సులోనూ బయలుదేరారు. హనుమాన్ జంక్షన్ నుండి సత్తుపల్లి మీదుగా తల్లాడ చేరుకున్న వీరు తల్లాడలో టీత్రాగి కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. అప్పటిదాకా వాహనాన్ని డ్రైవరు వేణు వాహనాన్ని నడుపగా అక్కడనుండి వరుడు రామకృష్ణప్రసాద్ నడపడం ప్రారంభించాడు. వరుడు రామకృష్ణ, డ్రైవరు వేణు స్నేహితులు కావడంతో నిద్రమత్తు రాకుండా ముందుసీట్లో కూర్చుని మాట్లాడుకుంటూ వస్తున్నారు. తల్లాడ నుండి 10 కిలోమీటర్లు దాటాక చల్లగాలి రావడంతో నిద్రమత్తు కమ్మింది. దీనికి తోడు మంచుతెరలు కప్పడంతో దారి సరిగా కనిపించక కారు ఒక్కసారిగా ఎడమవైపు నుండి కుడివైపుకు వెళ్ళి పెద్దచెట్టును ఢీకొట్టింది.


మాజీ నేత డా.జి.గంగాధర్ తిరిగి కాంగ్రెస్‌లో చేరిక



విజయవాడ, సూర్య బ్యూరో : "మళ్లీ కాంగ్రెస్" అనే నినాదంతో సహచరులతో డా.గంగాధర్ కాంగ్రెస్ పార్టీలోకి వునః ప్రవేశం చేస్తున్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ఈయన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీలో డాక్టర్స్ సెల్ రాష్ట్ర చైర్మన్‌గా, రాష్ట్ర అధికార ప్రతినిధిగా పార్టీకి సేవలందించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఆరెస్సెస్, బీజేపీ, మోడీ, రాష్ట్రంలో టీడీపీ చంద్రబాబు సాగిస్తున్న ప్రజా వ్యతిరేక దుష్పరిపాలనను అంతమొందించటానికి కాంగ్రెస్ పార్టీని తిరిగి బలోపేతం చేయవలసిన ఆవశ్యకతను గ్రహించి "మళ్లీ కాంగ్రెస్" అనే నినాదంతో ఒక ఉద్యమంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలన్న దఢ సంకల్పంతో ఈనెల 11 ఆదివారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎపిసిసి అధ్యక్షులు రఘువీరారెడ్డి, కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి వునః ప్రవేశిస్తున్నానని తెలిపారు. ఆర్థిక విధ్వంసం, సామాజిక విధ్వంసం, సాంస్క తిక విధ్వంసం, విదేశీ విధాన విధ్వంసం చేస్తూ దేశంలో సామాజికంగా, ఆర్థికంగా విపత్కర పరిస్థితులు సష్టిస్తున్న మోడీని తక్షణం సాగనంపవలసి ఉందన్నారు. దేశంలో అన్నీ వ్యవస్థలను ధ్వంసం చేస్తూ, ప్రజాస్వామ్యాన్ని ప్రశ్నార్థకం చేసి ఏక వ్యక్తి నియంతత్వ పాలన సాగిస్తున్న మోడీని ఓడించి ఇంటికి పంపకపోతే దేశ అస్తిత్వమే ప్రమాదంలో పడుతుందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని నమ్మించి మోసం చేసిన బీజేపీకి, మోడీకి రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెప్పాలి. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా వ్యవహరిస్తున్న బీజేపీకి గుణపాఠం నేర్పాలన్నారు. తన స్వప్రయోజనాల కోసం, రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టిన, తప్పుడు విధానాలతో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్న చంద్రబాబు నాయుడి ప్రజావ్యతిరేక దుష్పరిపాలనకు చరమగీతం పాడాలనే ఏకైక లక్ష్యంతోనే మేమంతా కాంగ్రెస్ పార్టీలోకి వునః ప్రవేశం చేస్తున్నామని తెలిపారు.

పరుగుపెడుతున్న రహదారులు

- రోడ్ల నిర్మాణంతోపాటే ప్రపంచస్థాయి మౌలిక వసతులు
- స్పీడ్ యాక్సెస్ సహా మొత్తం 8 రహదారులు
- పొడవు 85.17 కి.మీ., వ్యయం రూ.1306 కోట్లు
- ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్న ఏడీసీ
- నిరంతరం పర్యవేక్షిస్తున్న అధికారులు




విజయవాడ, సూర్య బ్యూరో : అమరావతి అభివ ద్ధి సంస్థ (ఏడీసీ) ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న స్పీడ్ యాక్సెస్ రోడ్డు సహా మొత్తం 8 ప్రాధాన్య రహదారులు త్వరితగతిన పూర్తయ్యేందుకు సన్నద్ధమవుతున్నాయి. ఇందుకోసం ఆ శాఖ అధికారులు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు ముమ్మరంగా క షి చేస్తున్నారు. ఈ రహదారులు ఎక్కడా మలువులు లేకుండా సువిశాలంగా నిర్మితమవుతుండడం విశేషం. రాజధానిలో నిర్మితమవుతున్న స్పీడ్ యాక్సెస్ రోడ్డు సహా మొత్తం 8 ప్రాధాన్య రహదారులు వచ్చే ఏడాది జనవరి ఆఖరుకల్లా పూర్తి కానున్నాయి. ఈ రోడ్లను అత్యుత్తమ ప్రమాణాలతో నిర్మిస్తుండడంతోపాటు ఇప్పటి వరకూ దేశంలో ఎక్కడా లేని విధంగా, నిర్మాణ సమయంలోనే వాటి వెంబడి ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ రోడ్ల పక్కన పలు రకాలకు చెందిన వేలాది మొక్కలను పెంచనుండడం ఓ ప్రత్యేకత. దాదావు ఎక్కడా మలువుల్లేకుండా, సువిశా లంగా రూవుదాల్చుతుండడం ఇంకో విశేషం. జనవరి ఆఖరుకల్లా పూర్తి చేయడం ద్వారా అమరావతి నిర్మాణానికి మేలుబాటలు పరవాలన్న లక్ష్యంతో ఏడీసీ సీఎండీ డి.లక్ష్మీ పార్థసారధి ఆధ్వర్యంలో ఆ సంస్థ అధికారులు, కాంట్రాక్టు సంస్థలు ముమ్మరంగా కషి చేస్తున్నాయి. ప్రాధాన్య రహదారులుగా వ్యవహరిస్తున్న ఈ 8 రోడ్లలో రాజధానికి జీవరేఖగా అభివ ర్ణితమవుతున్న సీడ్గ యాక్సెస్ రోడ్డుతోపాటు మరో 7 రహదా రులున్నాయి. వీటిల్లో స్పీడ్ యాక్సెస్ రహదారి అమరావతిలోని తూర్పు-పడమర దిక్కులను కలు వుత న్నండగా, మిగిలిన వాటిల్లో 4 ఉత్తరం నుంచి దక్షిణ దిశలను, 3 తూర్పు-పశ్చిమ ప్రాంతాలను అనుసం ధానిస్తున్నాయి. ఈ రోడ్లన్నింటి పొడవు మొత్తం 85.17 కిలో మీటర్లు కాగా, వీటి మొత్తం నిర్మాణ వ్యయం రూ.1,306 కోట్లు. ఈ రోడ్లన్నింటినీ అభివద్ధి చెందిన దేశాల్లో కనిపించే రహదారుల మాదిరిగా నిర్మిస్తున్నారు. వర్షపు నీరు నిలిచి, రోడ్లు పాడవడాన్ని నిరోధించేందుకు స్మార్ట్ వాటర్ డ్రెయిన్లను ఏర్పాటు చేస్తున్నారు. దాని పక్కనే లీకులకు తద్వారా కలుషిత మయ్యేందుకు ఆస్కారం లేని విధంగా తాగునీటి పారుదల వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్తు, ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ) కోసం యుటిలిటీ డక్టులను నిర్మించనున్నారు. వాడిన జలాలను రీసైక్లింగ్ చేసి టాయ్ లెట్ ఫ్లషింగ్, గార్డెనింగ్, ల్యాండ్ స్కేపింగ్ తదితర అవసరాలకు ఉప యో గించుకు నేందుకు వీలు కల్పించే రీయూజ్డ్ వాటర్ పైవులైన్లనూ నిర్మించనున్నారు. పాదచారులు, సైక్లిస్టుల కోసం వేర్వేరు మార్గాలు, నీడనిచ్చే అవెన్యూ ప్లాంటేషన్, నాణ్యమైన స్ట్రీట్ ఫర్నిచర్ తదితరాలూ ఈ రోడ్ల పక్కన కొలువు దీరనున్నాయి. భూఉపరితలంపై ఎక్కడా కనిపించకుండా, భూగర్భంగుండానే సాగే విద్యుత్తు సరఫరా వ్యవస్థను కల్పించనున్నారు. ఇందుకోసం ఎన్-4, ఎన్-14 రహదారుల మధ్య ప్రస్తుతమున్న విద్యుత్తు స్తంభాల తొలగింవునకు ఏపీ ట్రాన్స్‌కోకు ఇప్పటి వరకు రూ.4.90 కోట్లను చెల్లించారు. ఇతర ప్రదేశాల్లోనూ అక్కడక్కడ ఉన్న ఎలక్ట్రిక్ పోల్స్ తొలగింవునకు ఏడీసీ చర్యలు గైకొంటోంది.

రహదారుల వివరాలు ఇవి

ఉండవల్లి నుంచి దొండపాడుల మధ్య నిర్మిస్తున్న 18.4 కిలోమీటర్ల పొడవైన సీడ్గ యాక్సెస్ రోడ్డు (ఈ-3) నిర్మాణ వ్యయం రూ.215 కోట్లు. 8 వరుసల ఈ రహదారి పనులు వేగంగా సాగుతున్నాయి. 14 నుంచి 18 కిలోమీటర్ల మధ్య అక్కడక్కడ భూసేకరణలో సమస్యల కారణంగా పనులు ఆగడం (ఈ సమస్యను పరిష్కరిం చేందుకు ఏపీసీఆర్డీయే, గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ కతికా శుక్లా ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు) మినహా మిగిలిన చోటంతా ఈ రోడ్డు నిర్మాణం పూర్తయింది. రాయపూడి, అబ్బరాజు పాలెంల వద్ద ఈ రహదారిలో భాగంగా వంతెనల నిర్మాణం జరుగుతోంది. కొద్ది వారాల్లోనే ఈ రోడ్డుతోపాటు మిగిలిన 7 ప్రయారిటీ రోడ్ల పక్కన కూడా భారీ సంఖ్యలో పలు వ క్షజాతులకు చెందిన మొక్కలను నాటేందుకు ఏడీసీ సమాయత్తమవుతోంది. 8.27 కిలోమీటర్ల పొడవున బోరుపాలెం- శాఖమూరుల మధ్య నిర్మిస్తున్న ఎన్-14, 7.17 కిలోమీటర్ల పొడవుతో వెంకటపాలెం- నవులూరుల మధ్య వేస్తున్న ఎన్-4 రోడ్ల మొత్తం అంచనా వ్యయం రూ.266 కోట్లు. 14.95 కిలోమీటర్ల పొడవుతో క ష్ణాయపాలెం- నెక్కల్లు మధ్య నిర్మిస్తున్న ఈ-8 రోడ్డు నిర్మాణ వ్యయం రూ.272 కోట్లు. ఇందులో భాగంగా శాఖమూరు, నెక్కల్లుల వద్ద వంతెనలను నిర్మిస్తున్నారు. 12.5 కి.మీ.ల ఎన్-9 రహదారి ఉద్దండరాయునిపాలెం- నిడమర్రుల మధ్య నిర్మితమవుతోంది. దీని వ్యయం రూ.215 కోట్లు. దీని మార్గమధ్యంలో 2 వంతెనల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. 7.81 కి.మీ.ల ఈ-10 పెనుమాక నుంచి ఐనవోలు వరకు, 7.3 కి.మీ. ఈ-14 మంగళగిరి- నీరుకొండల మధ్య, 8.77 కి.మీ. ఎన్-16ను అబ్బరాజుపాలెం- నెక్కల్లుల మధ్య నిర్మిస్తున్నారు. ఈ-10 రోడ్డులో క ష్ణాయపాలెం వద్ద, ఎన్-16లో నెక్కల్లు వద్ద నిర్మించాల్సిన వంతెనల పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ 3 రహ దారుల మొత్తం నిర్మాణ వ్యయం రూ.338 కోట్లుగా వుంది.

వెనక్కి తగ్గలేమని మోడీకి చెప్పా

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్రంలో రాజకీయ పరిణామాల నేపథ్యంలో అందుబాటులో ఉన్న మంత్రులతో అత్యవసరంగా సమావేశమైన ఏపీ సీఎం చంద్రబాబు ప్రధానితో జరిగిన ఫోన్ సంభాషణను వారికి వివరించారు. కూర్చొని మాట్లాడుకుంటే పరిష్కారం అయ్యేదని ప్రధాని తనతో అన్నట్టు సీఎం వెల్లడించారు. నాలుగేళ్లు ఓపికతో ఉన్నామని ప్రధానితో చెప్పానన్నారు. ప్రధాని పిలిచినప్పటికీ ఇప్పుడు వెనక్కి తగ్గే పరిస్థితి లేదని మంత్రులతో సీఎం అన్నారు. మనం తీసుకున్నది సొంత నిర్ణయం కాదని, ప్రజల సెంటిమెంట్‌ను గౌరవించి తీసుకున్న నిర్ణయమని ప్రధానితో చెప్పానని వివరించారు. అన్ని విషయాలూ మాట్లాడుదాం. ఢిల్లీకి రావాలని ప్రధాని తనను ఆహ్వానించారని సీఎం తెలిపారు. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా వెనక్కి తగ్గలేం. ఆ స్థాయి దాటిపోయిందని చెప్పినట్టు వివరించారు. రాష్ట్రానికి ఏదైనా చేయాలనుకుంటే మీకు అవకాశం ఉంది. చేయండి అని ప్రధానిని కోరానని చంద్రబాబు అన్నారు. ముఖ్యమంత్రితో జరిగిన సమావేశంలో మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ప్రత్తిపాటి పుల్లారావు, దేవినేని ఉమ, నారాయణ, నక్కా ఆనంద్ బాబు, రాష్ట్ర ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడు కుటుంబరావు,పాల్గొన్నారు.

రాజీనామాకు నేను సిద్ధం

టీడీపీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి



అమరావతి, సూర్య ప్రతినిధి : రాజీనామాకు నేను సిద్ధమని ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. వైసీపీ ఎంపీలు రాజీనామాలు చేసి రావాలని, ప్రజల్లోకి వెళదామని పిలుపునిచ్చారు. మొదట వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఏ ఫ్రంట్ వైపు వెళ్లాల్సిన అవసరం తమకు లేదన్నారు. ఇక ప్రధాని మోదీని కలిసి ప్రయోజనం లేదని, కేంద్రంతో త్రిపుల్ తలాక్ అయిపోయిందని జేసీ దివాకర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్పటికే కేంద్ర మంత్రి పదవులకు అశోక్‌గజపతి రాజు, సుజనాచౌదరి చేసిన రాజీనామా చేసిన విషయం తెలిసిందే. వీరి రాజీనామాలను రాష్ట్రపతి రాంనాథ్‌కోవింద్ ఆమోదించారు. టీడీపీ తరపున కేంద్ర మంత్రి వర్గంలో పౌరవిమానయాన శాఖ మంత్రిగా అశోక్‌గజపతిరాజు, శాస్త్రిసాంకేతిక శాఖ సహాయ మంత్రిగా సుజనాచౌదరి ప్రాతనిధ్యం వహించారు. గురువారం ప్రధానిని కలిసి రాజీనామా లేఖలను సమర్పించారు. ప్రజా సెంటిమెంట్‌ను గౌరవించి కేంద్రం నుంచి వైదొలగాలని తమ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఆదేశాలతోనే రాజీనామాలు చేసినట్లు ప్రకటించారు. ప్రస్తుత పరిస్థితులకు దారి తీసిన కారణాలను వివరించారు.


అప్పుడు యూపీఏ.. ఇప్పుడు ఎన్డీఏ

ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



వెలగపూడి, సూర్య ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చటంలో అప్పుడు యూపీఏ, ఇప్పుడు ఎన్డీఏ మోసం చేసిందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి విమర్శించారు. ఏపీకి ప్రత్యేక హోదా యూపీఏ అయిదేళ్లంటే కాదు, పదేళ్లు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టిన ఎన్డీఏ అధికారంలోకి వచ్చాక మాట తప్పిందని సోమిరెడ్డి ఆరోపించారు. 14వ ఆర్థిక సంఘం ప్రత్యేక హోదా ఇవ్వాల్సిన అవసరం లేదని చెప్పిందని పేర్కొనడం విడ్డూరమని మంత్రి ఆరోపించారు. దేశాన్ని మోదీ పాలిస్తున్నారా లేక 14వ ఆర్థిక సంఘం పాలిస్తుందో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

పైసా లంచం తీసుకోలేదని ప్రమాణం చేసిన కామినేని



చిత్తూరు, సూర్య ప్రతినిధి : సీఎం చంద్రబాబు నాయుడు కేబినెట్‌లో వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా కామినేని శ్రీనివాస్ (బీజేపీ) పనిచేసిన సంగతి తెలిసిందే. అధిష్టానం నిర్ణయం మేరకు ఇటీవల రాజీనామా చేశారు. అయితే మంత్రిగా పనిచేసినంత కాలం ఒక్కపైసా కూడా తాను లంచం తీసుకోలేదని గతంలో కామినేని చెప్పారు. ఎలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడలేదని మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లా కాణిపాకం వరసిద్ధి వినాయక ఆలయంలో కామినేని ప్రమాణం చేశారు. అవినీతికి పాల్పడలేదని ప్రమాణం చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని చెప్పడానికే కాణిపాకం వచ్చానన్నారు. ప్రమాణం చేయడంతో తన అత్మస్థైర్యం మరింత పెరిగిందన్నారు. అధిష్టానం నిర్ణయం మేరకే రాజీనామాలు చేశామన్నారు. టీడీపీ ఇంకా ఎన్డీఏలోనే కొనసాగుతోందని ఆయన చెప్పారు. కాగా ఎన్డీఏలో తాము కొనసాగుతున్నామని గురువారం తమ మంత్రి పదవులకు రాజీనామా చేసిన సుజనాచౌదరి, అశోక్ గజపతిరాజు సైతం స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

గుంటూరులో జనసేన ఆవిర్భావ దినోత్సవం

తరలి రావాలని కోరిన పవన్ కళ్యాణ్



వెలగపూడి, సూర్య ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం సినీనటుడు పవన్ కళ్యాణ్ స్థాపించిన జనసేన పార్టీ ఆవిర్భావదినోత్సవ మహాసభ వేడుకను గుంటూరులో నిర్వహించనున్నారు. మార్చి 14న గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీకి ఎదురుగా, కాజా టోల్ ప్లాజా సమీపంలో ఉన్న ప్రాంగణంలో ఈ మహాసభ జరగనుంది. మధ్యాహ్నం మూడు గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని జనసేన వర్గాలు పేర్కొన్నాయి. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి జనసేన కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. జనసేన స్థాపించి నాలుగేళ్లు పూర్తవుతున్నా తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ ఎన్నికలు జరిగినా ప్రత్యక్షంగా బరిలోకి దిగిన దాఖలాలు లేవు. మరో ఏడాదిలో సాధారణ ఎన్నికలు సమీపిస్తుండటంతో పార్టీ విధి, విధానాలు, భవిష్యత్తు కార్యాచరణపై అధినేత కీలక ప్రకటనలు చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

అన్ని పక్షాలు కలసి పోరాడాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ




న్యూఢిల్లీ, సూర్య ప్రతినిధి : అన్ని పార్టీలు ఢిల్లీ వేదికగానే పోరాడితేనే కేంద్రం దిగి వస్తోందని సీపీఐ అభిప్రాయపడిం ది. ప్రత్యేక హోదా సాధన సమితితో కలిసి ఢిల్లీలో ఇన్నాళ్లుగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి స్వయంగా దిల్లీకి వచ్చి ఆందోళనలకు నేతృత్వం వహించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామ కృష్ణ కోరారు. అన్ని పక్షాలు కలిసికట్టుగా ఉద్యమం చేస్తేనే న్యాయం చేస్తుందన్నారు.

టీబీజీకేఎస్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక

హైదరాబాద్, మేజర్‌న్యూస్ : తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నికైంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ప్రకటించారు. టీబీజీకేఎస్ అధ్యక్షుడిగా బి. వెంకట్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఎం. రాజిరెడ్డి, ఉపాధ్యక్షులుగా బి. సంపత్ కుమార్, ఎ. శ్రీనివాస్, కోశాధికారిగా ఎల్. వెంకటేశ్ ఎన్నికయ్యారు.

ముక్త్యాల సంస్థానం చివరి రాణి కన్నుమూత



విజయవాడ, సూర్య ప్రతినిధి: కృష్ణాజిల్లా ముక్త్యాల సంస్థానం చివరి రాణి అయిన వాసిరెడ్డి రాజ్యలక్ష్మమ్మ గురువారం రాత్రి చెన్నైలో కన్నుమూశారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. గతం లో ఆమె జగ్గయ్యపేట శాసనసభ్యురాలిగా సేవలందించారు. కేసీపీ సిమెంట్స్ ఎండీ ఇందిరాదత్‌కు ఆమె తల్లి. జగ్గయ్యపేట ప్రాంత అభివృద్ధికి ముక్త్యాల రాజా దంపతులు విశేష కృషిచేశారు. ఆమె భౌతికకాయాన్ని శనివారం ముక్త్యాలకోటకు తీసుకురానున్నట్లు సమాచారం. వాసిరెడ్డి రాజ్య లక్ష్మమ్మ మృతి పట్ల జగ్గయ్యపేట ప్రాంత వాసులు సంతాపం తెలిపారు.

రాజ్యలక్ష్మమ్మ మృతి పట్ల చంద్రబాబు సంతాపం

కృష్ణా జిల్లా ముక్త్యాల సంస్థానం చివరి రాణి వాసిరెడ్డి రాజ్యలక్ష్మమ్మ మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు సంతాపం వ్యక్తం చేశారు. జగ్గయ్యపేట శాసనసభ్యురాలిగా రాజ్యలక్ష్మమ్మ సేవలందించారు. జగ్గయ్యపేట ప్రాంత అభివృద్ధికి తన భర్తతో కలిసి రాజ్యలక్ష్మమ్మ విశేష కృషిచేశారని రాజకీయ నాయకులు కొనియాడారు.

జూలై 1న ఏపీ సెట్ పరీక్ష

షెడ్యూల్ విడుదల చేసిన ఏయూ వీసీ ఆచార్య నాగేశ్వరరావు

విశాఖపట్నం, సూర్య ప్రతినిధి : వరుసగా మూడోసారి ఏపీ సెట్ పరీక్ష నిర్వహణను ఆంధ్ర విశ్వవిద్యాలయం చేపట్టింది. జూలై ఒకటో తేదీన ఈ పరీక్ష రాష్ట్ర వ్యాప్తంగా ఆరు కేంద్రాలలో జరుగుతుందని ఏయూ ఉపకులపతి ఆచార్య నాగేశ్వరరావు వెల్లడించారు. విశాఖలో ఆయన ఏపీ సెట్ షెడ్యూల్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ఈనెల 18న ఏపీ సెట్ నోటిఫికేషన్ విడుదల వుతుందని, 26 నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్లో స్వీకరిస్తామని తెలిపారు. గతంలో ప్రతి సబ్జెక్టులో మూడు పేపర్లు ఉండేవని, యూజీసీ నిబంధనల ప్రకారం ఈ యేడాది నుంచి రెండు పేపర్లు మాత్రమే ఉంటాయని వివరించారు. మొత్తం 31 సబ్జెక్టులలో పరీక్షలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో డిగ్రీ కళాశాలలు, వివిధ విశ్వవిద్యాలయాల్లో ఆధ్యాపక పోస్టుల నియామకం కోసం దరఖాస్తు చేయాలంటే యూజీసీ నెట్, లేదా ఏపీ సెట్‌లో అర్హులై ఉండాలన్నారు. ఈసారి నెగిటివ్ మార్కులు లేవని స్పష్టం చేశారు. మొత్తం రాసిన వారిలో ఆరుశాతం మందిని మాత్రమే అర్హులుగా చేయాలని యూజీసీ నిబంధన ఉందన్నారు.

దాతలకు, శ్రీవారి సేవకులకు శ్రీ విళంబినామ ఉగాది శుభాకాంక్షల పత్రికలు పంపనున్న టిటిడి

తిరుమల, సూర్య ప్రతినిధి : ఈ నెల 18వ తేదీన శ్రీ విళంబినామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని టిటిడి వివిధ పథకాలకు విరాళాలు అందించిన దాతలకు, తిరుమల శ్రీవారిదర్శనార్థం విచ్చేసే లక్షలాదిమంది భక్తులకు విశేష సేవలందించే శ్రీవారి సేవకులకు ఉగాది శుభాకాంక్షల పత్రికలను (గ్రీటింగ్ కార్డులు) టిటిడి పంపనుంది.

ఎపి అభివృద్ధికి బిజెపి కట్టుబడి ఉంది

బిజెపి మహిళా మోర్చా జాతీయ ఇన్‌ఛార్జి దగ్గుబాటి పురందేశ్వరి



విజయవాడ, సూర్య బ్యూరో : ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి భారతీయ జనతా పార్టీ కట్టుబడి ఉందని బిజెపి మహిళా మోర్చా జాతీయ ఇన్‌ఛార్జి దుగ్గబాటి పురందేశ్వరి స్పష్టం చేశారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి వునర్విభజన చట్టంలో పేర్కొన్న అంశాలన్నీ అమలుచేస్తామని చెప్పారు. అయితే రాష్ట్రాభివృద్ధికి కేంద్రం ఇస్తున్న సహకారంపై దుష్ప్రచారం జరుగుతుందన్నారు. ప్రత్యేకహోదాకు, లేని వాటికి గల తేడా 30 శాతాన్ని లెక్కించి రాష్ట్రానికి అందించేలా చర్యలు తీసుకుందన్నారు. హోదాను పొడిగించారనడం వాస్తవం కాదని, ఇప్పటికే ఇస్తున్న పన్నురాయితీలు కొన్నేళ్లపాటు కొనసాగించాలని ఇప్పటికే హోదా పొందుతున్న రాష్ట్రాలు కోరిన మీదట వాటిని కొనసాగిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని వెనుకబడిన జిల్లాల్లో ఏర్పాటుచేయనున్న పరిశ్రమలకు రాయితీలు, ప్రోత్సాహకాలు ఇచ్చామన్నారు. దానిని పారిశ్రామికవేత్తలు అందివుచ్చుకోవాలని సూచించారు. రాష్ట్ర సమస్యను అర్థం చేసుకున్న ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ 2014 ఏడాదికి గాను ఇప్పటికే లెక్కించిన 10 నెలలకు అదనంగా మరో రెండు నెలల లోటు బడ్జెట్‌ను రూ.1,600 కోట్లుగా లెక్కించి ఇచ్చేందుకు కూడా ముందుకు వచ్చారన్నారు. అన్నీ ఇస్తున్నా ఏమీ ఇవ్వడం లేదని రాజకీయ పక్షాలు అసత్య ప్రచారం చేయడం సరికాదని చెప్పారు. ఎపీ అభివృద్ధికి బిజెపి కట్టుబడి ఉందని, విభజన చట్టంలోని అన్ని అంశాలను సంపూర్ణంగా అమలుచేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బిజెపి ఎస్.సి.మోర్చా రాష్ట్ర అధ్యక్షులు దారా సాంబయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామినేని వెంకటకృష్ణ, రాష్ట్ర మీడియా ఇన్‌ఛార్జి పి.దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

మణిపాల్‌లో ప్రపంచ కిడ్నీ దినోత్సవ ప్రచార కార్యక్రమం


మహిళల కోసం ప్రత్యేకంగా కిడ్నీ స్క్రీనింగ్ ప్యాకేజ్ ప్రారంభం



విజయవాడ, సూర్య బ్యూరో : మార్చి 8న వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా మణిపాల్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో కిడ్నీ సంబంధిత జబ్బుల గురించి అవగాహనను పెంచడంకోసం, ముందస్తుగా కనుగొనడం ప్రాముఖ్యతను తెలిపేందుకు అవగాహన ప్రచార కార్యక్రమాన్ని ఆవిష్కరించారు. ముఖ్యంగా మహిళలకు మెరుగైన జీవనవిధానం కోసం ఆరోగ్యకరమైన జీవనసరళిని పాటించాలనే ఉద్దేశ్యంతో ప్రారంభించిన ఈ ప్రచార కార్యక్రమం మణిపాల్ హాస్పిటల్స్ విజయవాడ, యూనిట్‌హెడ్గ, డా॥సుధాకర్ కంటివూడి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డా॥మనోజ్ కుమార్, చీఫ్ ఆఫ్ క్లినికల్ సర్వీసెస్, డా॥శ్రీధర్, కన్సల్టెంట్ నెఫ్రాలజీ మరియు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ మరియు డా॥రవిశంకర్ గంజి, కన్సల్టెంట్ యూరాలజీ మరియు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ పాల్గొన్నారు. ఈ సందర్భాన్ని వురస్కరించుకొని మహిళలకు ప్రత్యేకంగా ఒక కిడ్నీ స్క్రీనింగ్ ప్యాకేజ్‌ను ప్రారంభించారు. ముందస్తుగా కనుగొనేందుకు వీలుగా అనేక టెస్టులుగల ఈ ప్యాకేజ్ ధర రూ.699లు ఈ ప్యాకేజ్‌లో ర్యాండమ్ బ్లడ్గ షుగర్ చెక్, హిమోగ్లోబిన్ కౌంట్, సిరం క్రియాటినైన్, మూత్రపరీక్ష, అల్ట్రాసౌండ్గ కెయుబి, తయూరిన్ ప్రొటీన్ క్రియాటినైన్ రేషన్ మరియు నెఫ్రాలజీ కన్సల్టేషన్ వున్నాయి. ఈ సందర్భంగా డా॥ సుధాకర్ కంటివూడి, యూనిట్‌హెడ్గ, మణిపాల్ హాస్పిటల్స్ విజయవాడ మాట్టాడుతూ ఆరోగ్యకరమైన జీవనసరళిని అందరూ అలవరచుకోవడానికి వీలుగా ప్రజలలో అవగాహనను పెంచడానికి మణిపాల్ హాస్పిటల్స్ విజయవాడ ఎల్లపడూ ముందంజులో వుంటుందని తెలిపారు. డా॥ రవిశంకర్ గంజి కన్సల్టెంట్ యూరాలజీ, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ మాట్లాడుతూ మనదేశంలో మహిళల కిడ్నీవ్యాధులకు సంబంధించి అందరికీ అందుబాటులో మరియు సమాన ఆరోగ్యసంరక్షణ సౌకర్యాలను అందజేయగలమని మన మందరం కలిసి ప్రమాణం చెయ్యాలన్నారు. ఒక అంచనా ప్రకారం భారతదేశంలో ఆఖరిదశలో వున్న కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న వారిలో కేవలం 30 శాతం కన్నా తక్కువమంది దయాలసిస్ పొందుతున్నారని, ప్రతి సంవత్సరం మనదేశంలో దాదావు 2,60,000 కు పైగా క్రొత్త రోగులకు దయాలసిస్ అవసరముంది.

ఎస్వీ సంగీత కళాశాలలో సంగీత త్రిమూర్తుల ఆరాధనోత్సవాలు

12 నుండి 14 తేదీ వరకు





తిరుపతి, సూర్య ప్రతినిధి : కర్ణాటక సంగీతంలో త్రిమూర్తులుగా ప్రసిద్ధిగాంచిన శ్రీ శ్యామశాస్త్రులు, శ్రీ త్యాగరాజస్వామి, శ్రీ ముత్తుస్వామి దీక్షితుల ఆరాధనోత్సవాలు తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర సంగీత, నృత్య కళాశాలలో మార్చి 12 నుండి 14వరకు ఘనంగా జరగనున్నాయి. రోజూ ఉదయం 9నుండి రాత్రి 9.25 గంటల వరకు ఈ కార్యక్రమాలు జరుగనున్నాయి. సంగీత కళాశాల, నాదస్వర పాఠశాల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు, స్థానిక కళాకారులు సంగీత త్రిమూర్తుల అపురూప కృతులు, కీర్తనలను రోజుకు 90 చొప్పున 3 రోజుల పాటు ఆలపిస్తారు. ఆరాధనోత్సవం సోమవారం ఉదయం 9గంటలకు సంగీత త్రిమూర్తులకు వూజతో ప్రారంభమవుతుంది. అరగంట కాలవ్యవధితో రాత్రి 9.30 గంటల వరకు సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శ్రీ త్యాగరాజస్వామివారి 'ఘనరాగ పంచరత్న క తులు, ఉత్సవ సంప్రదాయ, దివ్యనామ సంకీర్తనల' బృందగానం జరుగనుంది.

శ్రీశ్యామశాస్త్రి (1762-1827)

సంగీత త్రిమూర్తులలో ఒకరైన శ్రీ శ్యామశాస్త్రి తిరువారూరులో జన్మించారు. తంజావూరులో స్థిరపడ్డారు. తరతరాలుగా బంగారు కామాక్షిని పూజించిన కుటుంబ వీరిది. వీరికి వేంకటసుబ్రమణ్యం అనే పేరుంది. తెలుగు, తమిళ, సంస్కృత భాషల్లో విశేష ప్రావీణ్యం సంపాదించారు. వీరికి శ్రీత్యాగరాజస్వామి, శ్రీ ముత్తుస్వామి దీక్షితులు సమకాలికులు. వీరి భైరవి, తోడి, యదుకుల కాంభోజి రాగాల్లోని స్వరజతులు గొప్ప ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. తాళంలో వీరు చూపిన కొత్త పోకడ ప్రశంసనీయం. వీరి కృతులు శ్యామకృష్ణ ముద్రతో ఉంటాయి. వీరి నవరత్నమాలిక కృతులు చాలా ప్రసిద్ధి పొందాయి. కీర్తనలకు చిట్ట స్వరాలు, వాటికి సాహిత్యం వీరి నుండే ప్రారంభమైంది.

శ్రీ త్యాగరాజస్వామి (1767-1847)

శ్రీ త్యాగరాజస్వామివారు తంజావూరు జిల్లాలోని తిరువారూరు క్షేత్రంలో శ్రీమతి సీతమ్మ, శ్రీరామబ్రహ్మం దంపతులకు జన్మించారు. కర్ణాటక సంగీత త్రిమూర్తులలో రెండోవారుగా ప్రసిద్ధిచెందారు. నాదోపాసనే మోక్షహేతువని నమ్మి తరించిన నాదయోగి త్యాగయ్య చిన్నతనం నుండే భక్తి వాతావరణంలో పెరిగారు. 24 వేల కృతులు ఆలపించారని ప్రచారంలో ఉన్నా ప్రస్తుతం 750 కృతులు మాత్రమే లభ్యమవుతున్నాయి. శ్రీ రామకృష్ణానంద యతీశ్వరుల ఉపదేశంతో 96 కోట్ల సార్లు రామనామాన్ని జపించి రామ సాక్షాత్కారం పొందిన భాగవత శిరోమణి ఈయన.

శ్రీ ముత్తుస్వామి దీక్షితులు (1775-1835)

శ్రీ ముత్తుస్వామి దీక్షితులు తిరువారూరులో రామస్వామి దీక్షితులు, సుబ్బలక్ష్మి అమ్మాళ్ దంపతులకు జన్మించారు. చిన్నతనం నుండి భగవధ్యానపరులు. వీరు కాశీ క్షేత్రానికి వెళ్లి చిదంబరనాదయోగి వద్ద శ్రీవిద్యా ఉపదేశం చేశారు. గురువుల ఆశీస్సులు వారి ఆజ్ఞానుసారం తిరుత్తణి క్షేత్రంలో 45 రోజులుండి శ్రీ సుబ్రమణ్యస్వామిని ఉపాసించారు. వీరి కృతులు చాలావరకు సంస్కృతంలో ఉంటాయి. వీరి కమలాంబ నవార్ణకృతులు, నవగ్రహకృతులు, విభక్తి కృతులు, పంచలింగస్థల కృతులు, షోడశగణపతి కృతులు ప్రసిద్ధి పొందాయి.



ఇండో టిబెట్ దళంలో 'ప్రకృతి' పరవశించే..

25 ఏళ్లకే పదాతి దళంలో ప్రథమ మహిళా అధికారిణి





పురుషులతో కలిసి సమానంగా శిక్షణ పొందటంతో పాటు అమోఘంగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగినులు ఎందరో ఉన్నారు. మహిళా పైలట్లుగా రణరంగంలో సేవలందిస్తున్న వీరవనితలుగా సేవలందిస్తున్నవారికీ కొదువలేదు. అందునా భారతీయ వైమానిక దళంలో ఫ్లైయింగ్ ఆఫీసర్లుగా వెలుగొందుతున్న అవని చతుర్వేది, భావన కాంత్, మోహన సింగ్ ఇలా చాలా మంది మహిళలు ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తుంటే... తాజాగా టిబెట్-భారత్ సరిహద్దులలో పదాతి దళంలో కీలక అధికారిణిగా పనిచేసే అవకాశాన్ని తొలిసారిగా బీహార్‌కు చెందిన పాతికేళ్ల ప్రకృతి దక్కించుకుని అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. దేశ సేవలో తరించాలన్న తపనతో ఆమె చేసిన ప్రయత్నాలు ఫలించడంతో పూర్తి శిక్షణ అనంతరం ఐటిబిపిలో చేరనుంది ఆమె.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున బిహార్‌కు [illegible] చరిత్ర సృష్టించింది. పదాతి దళంలో చేరాలన్న కాం[illegible] చూస్తున్న ఆమె ఎన్నడూ ఊహించిన విధంగా ఇండో[illegible] పోలీసు దళం (ఐటీబీపీ) తొలి మహిళా అధికారిగా [illegible] సృష్టించింది. పాతికేళ్లు నిండిన మహిళ ప్రకృతిని నేరు[illegible] హోదాలో నియమిస్తూ అధికారులు నిర్ణయం తీసుకుని [illegible] జారీ చేయటంతో సదరు హోదాలో ఆమె చేరుతుండటం [illegible] 2016లో భద్రతా దళాల్లో మహిళా అధికారులను [illegible] అవకాశం కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇదే ప్రకృతి పాలిట వరమైంది. ఇందుకు సంబంధించి పరీక్షలలో ఆమె కనబరచిన ప్రతిభపాటవాలు, తొలి ప్రయత్నంలోనే ఆమెకు విజయం సాధించేలా చేసాయి. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ బీటెక్ పూర్తి చేసిన ఆమె... త్వరలోనే డెహ్రాడూన్‌లోని ఐటీబీపీకి చెందిన ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో చేరనుంది. శిక్షణ అనంతరం ఆమె అసిస్టెంట్ కమాండెంట్ హోదాలో విధులు నిర్వర్తించేందుకు చేర నుంది.

[illegible]

2016 మార్చిలో తను ఓ వార్తాపత్రికను చదివుతున్నపుడు మొదటిసారి గా మహిళలకు ఐటిబిపిలో స్దానం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు వచ్చిన కథనం తనని ఎంతగానో ఆకర్షించిందని చెప్పింది. ఈ ఉత్తర్వులతో ఐదు సెంట్రల్ ఆర్మ్డ పోలీస్ ఫోర్సెస్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ మరి యు సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరి టీ ఫోర్సు మహిళలకు ప్రత్యక్ష-ఎంట్రీ ఆఫీసర్లుగా యుపిఎస్సి ద్వారా దరఖాస్తు చేసుకోవటానికి అనుమతించడంతో అదే ఏడాది యూపీఎస్సీ నిర్వహించిన కేంద్ర సాయుధ పోలీ సు దళాల (సీఏపీఎఫ్) పరీక్ష లకు హాజరైనట్లు చెప్పారామె. ఈ దేశ సరిహ ద్దులలో పోరాట అధికారులకు సేవ చేయాలంటే ఇది అనూహ్యమైన మార్గమని అని పించడంతో ఈ సేనలలో చేరేం దుకు మానసికంగా ముందు సిద్ధమై, ఆపై పరీక్షలకు అవసరమైన సమాచారం అంతా సేకరించి, విజయమే లక్ష్యంగా ముందుకు సాగాను. నా తపన చూసిన తండ్రి ఇచ్చిన ప్రోత్సాహం తను ఖచ్చితంగా ఎంపిక కాగలనని ఊహించుకున్నానని, నా కలలు నిజం కావటం ఆనందంగా ఉందని చెప్పారామె.

ప్రస్తుతం టిబెట్-భారత్ సరిహద్దు సేనలలో 83,000 మందికి పైగా సైనికులు పనిచేస్తుండగా వీరిలో ప్రస్తుతం 1,500 మంది మహిళలు (సుమారు 1.75 శాతం) ఉన్నారు. నిజానికి ఈ విభాగంలో అనేక మంది సీనియర్ మహిళా అధికారులు ఉన్నారు, కానీ వీరంతా సైనికులకు వైద్య సేవలందించేందుకు అనువైన ముఖ్య ఇతర సేవా రంగాలలో అధికారులుగా పనిచేస్తున్నారు. కానీ నేరుగా శత్రువులతో పోరాటం చేసే పాత్రను వారెవ్వరూ పోషించడంలేదు. అయితే ఇప్పటికీ పోరాట పాత్రలో మహిళలు ఇక్కడ పనిచేస్తున్నప్పటికీ వీరంతా కేవలం కానిస్టేబుల్ ర్యాంకులలో మాత్రమే బాధ్యతలు నిర్వహిస్తుండగా... ఐటిబిపిలో తొలిసారిగా సైనిక అధికారిగా అవకాశం తనకు దక్కడం పట్ల ప్రకృతి ఆనందం అంతా ఇంతా కాదు. [illegible] చైనా గోడతో 3,488 కిలోమీటర్ల పొడవున ఉన్న సరిహద్దు ప్రాంతాలలో పని చేయ నుండటం మాటలకు అందటంలేదని, 1962 లో చైనీయుల దౌర్జన్యా లనుంచి ఈ దేశాన్ని కాపాడిన ఎందరో మహోన్నతుల సేవలను గుర్తు చేసుకుంటూ నిత్యం విధులు నిర్వహిస్తానని, అధికారులు ప్రబుత్వం మెచ్చుకోలుగా చేసుకుంటానంటూ హర్షాతిరేకాలు వ్యక్తం చేసింది. ఉత్తరాఖండ్‌లోని పిథోరాగఢ్ లో ఉన్న ఐటీబీపీ యూనిట్‌లో విధుల్లో చేరిన ప్రకృతి త్వరలోనే డెహ్రాడూన్‌లో పూర్తిస్థాయి అధికారుల శిక్షణను తీసుకోనున్నారు.

ప్రకృతి తన శిక్షణను పూర్తి చేసుకుని వచ్చాక సహాయక కమాండెంట్ (ఎసి)గా తన పనిని ప్రారంభించి, ఆపై సరిహద్దు పోస్టులో విధుల నిర్వహించేందుకు అనుమతించబడతారు అని సీనియర్ ఐటిబిపి అధికారి ఒకరు మీడియాకు తెలిపారు.

తల్లిదండ్రులు పిల్లల ఆసక్తులను గమనించి ఆదిశగా వారి ఎదుగుదలకు సహాయ సహకారుల అందిస్తే ఖచ్చితంగా వారు నిర్దేశించుకున్న లక్ష్యాలను అందుకుంటారని ఇదే తన విషయంలో జరిగిందని చెప్పారు ప్రకృతి ఈ సందర్భంగా. నిజమే నేటి తరం యువతకు ప్రకృతి లాంటి మహిళల ప్రేరణ ఎంతైనా అవసరం ఉంది. ఈ దేశానికి సైనిక విబాగాలలో సేవలందించాలనుకునే మహిళలు చాలా మంది అవకాశాల కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. చిన్నతనం నుంచి దేశభక్తివారిలోపెంపొందించడం ద్వారా దేశసేవకు వారిని భాగస్వామ్యం చేసే అవకాశం ఉంటుందన్న ప్రకృతి మాటలు వాస్తవం కావాలి.

- సత్యగోపాల్, హైదరాబాద్

ఏపిలో భారీ పెట్టుబడులు

[illegible]









చెక్కలు తయారీ ఇలా..

కావలసిన పదార్థాలు :

వరిపిండి : అర కిలో
నీరు : అర లీటరు
శనగపప్పు : యాభై గ్రాములు (రెండు గుప్పెళ్ళు సుమారు), రెండు గంటలు ముందుగా నానబెట్టుకోవాలి
కారం : రెండు స్పూన్లు లేదా పచ్చిమిర్చి పేస్టు : రెండు స్పూన్లు
కరివేపాకు: రెండు మూడు రెబ్బలు
ఉప్పు : రుచికి తగినంత
నూనె : వేయించడానికి సరిపడా

తయారు చేసే విధానం:

ముందుగా గ్యాసు మీద ఒక బాణీ పెట్టుకొని అందులో నీరు పోసుకోవాలి. నీరు బాగా మరిగాక అందులో సెనగపప్పు, కారం, ఉప్పు, చిన్న చిన్నగా తుంపిన కరివేపాకు మరియు వరిపిండి వేసి బాగా కలువుకోవాలి. గ్యాసు ఆపేసి తయారైన మిశ్రమాన్ని బాగా చల్లారానివ్వాలి. ఇప్పుడు ఆ మిశ్రమాన్ని చిన్న ఉండలాగా చేసి ఒక ప్లాస్టిక్ కవర్ మీద కానీ అరిటాకు మీద కాని పల్చగా వత్తుకోవాలి. అలా వత్తిన వాటిని బాగా కాగిన నూనెలో వేసి దోరగా వేయించుకోవాలి . ఇలాగే మిగిలిన పిండితో కూడా చెక్కలు వత్తుకొని వేయించుకోవాలి. చల్లారిన చక్కలను ఒక గట్టి మూత ఉన్న డబ్బాలో పెట్టి నిలువ ఉంచుకోవచ్చు.



రోజుకో లవంగం...

మన దేశంలోనే కాదు అనేక దేశాల్లోనూ లవంగాలను మసాలా దినుసుగా వాడుతారు. వీటిని వంటల్లో వేస్తే వంటలకు చక్కని రుచి, వాసన వస్తాయి. ఇక లవంగాలు వేయకుండా నాన్ వెజ్ వంటలను వండరు. ఇవి అంతలా ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. అయితే కేవలం వంటలకే కాక ఇవి మనకు పలు ఆరోగ్యకర ప్రయోజనాలను ఇచ్చే అద్భుతమైన ఔషధంగా కూడా పనిచేస్తాయి. ఈ క్రమంలోనే రోజూ 3 పూటలా భోజనం తరువాత ఒక లవంగాన్ని నమిలి తింటే ఎలాంటి లాభాలు కలుగుతాయో ఇప్పుడు తెలుసుకుందాం.

1. లవంగాలను తినడం వల్ల జీర్ణవ్యవస్థ సరిగ్గా పనిచేస్తుంది. జీర్ణాశయం, పేగులు శుభ్రమవుతాయి. గ్యాస్, అసిడిటీ, వికారం, అజీర్ణం తగ్గిపోతాయి. మలబద్దకం పోతుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది.
2. లవంగాల్లో యాంటీ బాక్టీరియల్ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి అనేక రకాల సూక్ష్మ క్రిముల నుంచి, ఇన్ఫెక్షన్ల నుంచి మనల్ని రక్షిస్తాయి. శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. ఫ్లూ, దగ్గు, జలుబు, జ్వరం వంటి వ్యాధులను నయం చేస్తాయి.
3. ఊపిరితిత్తుల క్యాన్సర్ మొదటి దశలో ఉంటే అలాంటి వారు లవంగాలను రోజూ తింటే క్యాన్సర్ బారి నుంచి తప్పించుకోవచ్చని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. లవంగాల్లో ఉండే యాంటీ కార్సినోజెనిక్ గుణాలు క్యాన్సర్ కణాలతో పోరాడి వాటిని నాశనం చేస్తాయి.
4. లవంగాలను రోజూ తినడం వల్ల వాటిల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు లివర్ను శుద్ధి చేస్తాయి. మెటబాలిజంను మెరుగు పరుస్తాయి. దీంతో కొవ్వు కరుగుతుంది. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పోయి మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. గుండె జబ్బులు రాకుండా ఉంటాయి.
5. డయాబెటిస్ సమస్యతో బాధపడుతున్నవారు నిత్యం తమ ఆహారంలో లవంగాలను చేర్చుకుంటే దాంతో అద్భుతమైన ఫలితం ఉంటుందని సాక్షాత్తూ వైద్యులే చెబుతున్నారు. లవంగాల్లో ఉండే ఇన్సులిన్ వంటి గుణాలు రక్తంలో ఉండే గ్లూకోజ్ స్థాయిలను క్రమబద్దీకరిస్తాయి. దీంతో డయాబెటిస్ అదుపులో ఉంటుంది.
6. లవంగాల్లో యుజెనాల్, ఫ్లేవోన్స్, ఐసో ఫ్లేవోన్స్, ఫ్లేవనాయిడ్స్ అని పిలవబడే ఫీనోలిక్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి ఎముకలను రక్షిస్తాయి. దీంతో వయస్సు మీద పడడకం కారణంగా వచ్చే ఆస్టియో పోరోసిస్ (ఎముకలు గుల్లబారిపోవడం)ను తగ్గిస్తాయి.
7. లవంగాల్లో యాంటీ ఇన్ఫ్లామేటరీ గుణాలు కూడా పుష్కలంగానే ఉంటాయి. ఇవి నొప్పులు, వాపులను తగ్గిస్తాయి. శరీరంలో నీరు ఎక్కువగా చేరకుండా చూస్తాయి.
8. లవంగాలను తినడం వల్ల దంతాలు, చిగుళ్ల సమస్యలు పోతాయి. దంతాలు ధృఢంగా మారుతాయి. నోటి దుర్వాసన పోతుంది.
9. లవంగాలను తినడం వల్ల తలనొప్పి తగ్గుతుంది. పాలలో చిటికెడు లవంగాల పొడిని కలువుకుని తాగితే తలనొప్పి ఇట్టే తగ్గిపోతుంది.



సూర్య సినిమా

హాస్యనట బ్రహ్మానందం



పద్మశ్రీ అవార్డు గ్రహీత, డా. బ్రహ్మానందంకు హాస్యనట బ్రహ్మ అనే బిరుదును కాకతీయ కళావైభవ మహోత్సవంలో ప్రదానం చేయనున్నారు. టి.సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ "కాకతీయ లలిత కళాపరిషత్తు తెలంగాణలోని అన్ని జిల్లాల్లో వైభవంగా అప్పటి కాకతీయుల ఖ్యాతిని తెలియజేయాలనే ఉద్దేశంతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర సభాపతి సిరికొండ మధుసూదనాచారి, ఎస్.జైపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతుంటే.. జూపల్లి కృష్ణారావు, డా.సి.లక్ష్మారెడ్డి తదితరులు గౌరవ అతిథులుగా హాజరు కానున్నారు. చలన చిత్ర పరిశ్రమకు చెందిన జయప్రద, డా.రాజశేఖర్, జీవిత, బాబూమోహన్, పరుచూరి గోపాలకృష్ణ, అలీ, కవిత, కేథరిన్ థ్రెసా, హంసానందిని, శ్రద్ధాదాస్, పృథ్వీ, రఘుబాబు, శ్రీనివాసరెడ్డి తదితరులను కాకతీయ పురస్కారాలతో సత్కరిస్తాం. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ "బ్రహ్మానందం గొప్ప నటుడు. తెలుగు రాష్ట్రాల్లో మరచిపోలేని నటుడు. కళాకారులకు, కవులకు, నటులకు కుల, మత, ప్రాంతీయ బేదాలుండవు. కని వినీ ఎరుగని రీతిలో ఈ కార్యక్రమాన్ని సక్సెస్ చేస్తాం" అన్నారు. అలీ మాట్లాడుతూ "కళాకారులంటే నటరాజుకి చాలా ఇష్టం. ఆ నటరాజు సుబ్బరామిరెడ్డిగారి రూపంలో వచ్చారు. ఎందుకంటే 1100 సినిమాలు పూర్తి చేసుక్న మా అన్న బ్రహ్మానందంకు బిరుదునిచ్చి సత్కరించడం గొప్ప విషయం. మాకెంతో ఆనందాన్ని ఇస్తుంది. తెలుగు, తమిళం, కన్నడం, హిందీ భాషల్లో 1100 సినిమాలు చేయడం గొప్ప విషయం" అన్నారు.

డా.బ్రహ్మానందం మాట్లాడుతూ "కళలకు ఎల్లలు లేవు. కళల్లో ఈశ్వరత్వం ఉంటుంది. అలాంటి ఈశ్వరుడ్ని పూజించే సుబ్బరామిరెడ్డిగారు ఈ అవార్డు వేడుకలు నిర్వహిస్తుండటం గొప్ప విషయం. ఆ దేవుడి దయ వల్ల ఎన్నో అవార్డులను స్వీకరించినప్పటికీ.. రేవు నేను తీసుకోబోయే అవార్డు విశిష్టమైందని భావిస్తున్నాను. అది నా పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నాను" అన్నారు!!

మరో తమిళ సినిమాలో.. మంచు లక్ష్మి



మంచు లక్ష్మి మరో తమిళ సినిమా చేయబోతోంది. మంచి కథలకే నా ఓటు అని ముందు నుంచీ చెబుతోన్న లక్ష్మి అందుకు తగ్గట్టే కంటెంట్ ఉన్న కథలనే సెలెక్ట్ చేసుకుంటోంది. ప్రస్తుతం 'వైఫ్ ఆఫ్ రామ్' అనే ఓ కొత్తతరహా కథతో రాబోతోన్న లక్ష్మికి మరో మంచి ఆఫర్ వచ్చింది. అది కూడా తమిళ్ లో. బాలీవుడ్ లో సూపర్ హిట్ అయిన తుమ్హారీ సులు అనే చిత్రాన్ని తమిళంలో రీమేక్ చేస్తున్నారు. బాలీవుడ్ లో విద్యాబాలన్ పోషించిన పాత్రను తమిళంలో జ్యోతిక చేస్తోంది. ఇదే సినిమాలో నేహాధూపియా క్యారెక్టర్ కు మంచు లక్ష్మిని అప్రోచ్ అయ్యారు. గతంలో ఒకట్రెండు తమిళ సినిమాలు చేసినా, ఈ పాత్ర తనకు ఖచ్చితంగా గుర్తింపు తెస్తుందనే వెంటనే ఈ ప్రాజెక్ట్ ఒప్పుకున్నానంటోంది లక్ష్మి. ఈ విషయాన్ని స్వయంగా పంచుకుని ఆనందాన్ని వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ.. "బాలీవుడ్ లో వచ్చిన తుమ్హారీ సులు నేను చూడలేదు. కానీ నేహా ధూపియా పాత్ర గురించి తెలుసు. ఆమె పాత్ర సినిమాలో చాలా స్టైలిష్ గా ఉంటుంది. అలా ఉండటానికి నాకూ ఏ ఇబ్బంది లేదు. ఇప్పటికే చాలా డీ గ్లామర్ పాత్రలు చేసి బోర్ కొట్టేసింది. అందుకే ఈ పాత్ర కోసం చాలా ఎగ్జైటింగ్ గా ఉన్నాను. ఎప్పుడెప్పుడు సెట్స్ లోకి వెళతానా అన్నంత ఆసక్తిగా ఉంది. అసలు ఈ ప్రాజెక్ట్ లో నన్ను అనుకున్నందుకు సూర్య, జ్యోతికలకు థాంక్స్. నా గురించి తెలుసు, నేనెంత కమాండింగ్ గా ఉంటానో అనేది. ఒక రకంగా చెప్పాలంటే తుమ్హారీ సులు లో నేహాధూపియా పాత్రలా నా మైండ్ కమాండింగ్ గా ఉంటుంది. ఇవన్నీ తెలిసే నేనైతేనే ఈ పాత్రకు కరెక్ట్ అనుకున్నారట"అని చాలా ఎగ్జైటింగ్ గా చెప్పింది మంచు లక్ష్మి. ఈ చిత్రం మే నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ కు వెళ్లబోతోంది. ఇక ప్రస్తుతం వైఫ్ ఆఫ్ రామ్ అనే మరో డిఫరెంట్ మూవీలో నటిస్తోంది లక్ష్మి. నిజాన్ని అబద్ధంగా, అబద్ధాన్ని నిజంగా నమ్మే ఒక విచిత్రమైన పాత్రలో తను కనిపిస్తుంది.. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుపుకుంటోన్న వైఫ్ ఆఫ్ రామ్ త్వరలోనే విడుదల కు సిద్ధమవుతోంది!!

డిజిటల్ చార్జీల తగ్గింపుపై ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలి



చిత్ర పరిశ్రమలో బంద్ అనేది బ్రహ్మాస్త్రం లాంటిది. అలాంటి బ్రహ్మాస్త్రాన్ని ఉపయోగించి తెలుగు ఫిలిం చాంబర్ వారు ఏం సాధించారో అర్థం కావడంలేదు. కొండను తవ్వి కనీసం ఎలుకను కూడా పట్టలేదు అంటూ తెలుగు ఫిలిం ఛాంబర్ పై విరుచుకుపడ్డారు ఆర్. నారాయణమూర్తి . డిజిటల్ సర్వెస్ రేట్లు తగ్గించాలంటూ సౌతిండియన్ ఫిలిం ఇండస్ట్రీ అంతా ఒక తాటిమీదకొచ్చి మార్చి 2వ తేదీ నుండి థియేటర్స్ బంద్ చేసిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో నటు డు -నిర్మా త-దర్శకుడు ఆర్.నారా యణమూ ర్తి మాట్లాడుతూ పై విధంగా స్పందించారు. ఇంకా ఆయన మాట్లాడుతూ...తమిళం, మల యాళం, కన్నడ భాషల చిత్ర పరిశ్రమల్లో ఇంకా థియేటర్స్ బంద్ కొనసాగుతుంటే మన తెలుగు ఫిలించాంబర్ వారు అప్పుడే థియేటర్స్ బంద్ ను ఎందుకు ఆపాల్సి వచ్చింది. ఐదేళ్ల తర్వాత ఫ్రీగా ఇస్తామంటూ డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ ఇచ్చిన హామీలు అమలు కాకముందే ఎందుకు హఠాత్తుగా బంద్ విరమించుకున్నారు. కానీ, ఇలా మీ ప్రయోజనాలకోసం, మీ స్వార్థం కోసం బంద్ ని హఠాత్తుగా ఆపేస్తారా? ఈ బంద్ వల్ల సాధించింది ఏంటి? దీనికోసమైతే సురేష్ బాబు, జెమిని కిరణ్ , అల్లు అరవింద్ లాంటి పెద్దలు బంద్ వరకు వెళ్లకుండా ముందే మాట్లాడి సెటిల్ చేస్తే సరిపోయేది కదా? థియేటర్స్ బంద్ దాకా వెళ్లాల్సిన పనేంటి? గతంలో డా.రామానా యుడుగారు, దాసరి నారాయణ రావుగార్లలాంటి పెద్దలు పదిమంది నిర్మాతల మంచి కోరేవారు తప్ప ఎప్పుడూ తామే బతకాలనీ, తమ స్వార్థం కోసం ఎప్పుడూ ఆలోచించలేదు. రెండు వేలు , రెండువేల ఐదువందలకు మేం డిజిటల్ సర్వీస్ లు ప్రొవైడ్ చేస్తామంటూ నూతన కంపెనీలు వస్తున్నా... వారిని ఎందుకు రానీయడం లేదు. కొత్త వారికి అవకాశం ఇస్తే కచ్చితంగా క్యూబ్, యుఎఫ్ ఓ వాళ్లు దిగిరాక మానరు. ఈ విషయంలో ఇకనైనా ప్రభుత్వం జోక్యం చేసుకోని ప్రతి ఒక్కరికీ మంచి జరిగేలా చూడాలని కోరుకుంటున్నా అన్నారు. తెలం గాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ ప్రతాని రామకృష్ణ మాట్లాడుతూ..పదేళ్లుగా డిజిటల్ వ్యవస్థ మీద పోరాడుతున్నాం. పెద్దల సపోర్ట్ లేక మేము సక్సెస్ కాలేకపోయాం. ఫ్రీగా ఇచ్చే దాకా థియేటర్స్ బంద్ ఆపబోమని చెప్పి ఇలా ఇది కాదు మేము కోరు కున్నది. మొత్తం ఫ్రీగా ఇవ్వాలి లేదా మీరు తప్పుకుంటే మేము వేరే కంపెనీలతో ముందుకెళ్తాం. దీనిపై ఒకసారి పునరాలోచన చేయాలని డిమాండ్ చేస్తున్నాం!!

ఐతే 2.ఓ ట్రైలర్‌ను విడుదల చేసిన మినిస్టర్ తలసాని



ఇంద్రనీల్ సేన్‌గుప్తా, జారా షా, అభిషేక్, కర్తవ్య శర్మ, నీరజ్, మ ణాల్, మ దాంజలి కీలక పాత్రధారులుగా రాజ్ మాదిరాజు దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఐతే 2.ఓ'. ఫర్మ్ 9 పతాకంపై కె.విజయరామారాజు, హేమంత్ వల్లపురెడ్డి నిర్మిస్తున్నారు. మార్చి 16న సినిమా విడుదలవుతుంది. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను తెలంగాణ సినిమాటోగ్రఫీ మినిస్టర్ తలసాని శ్రీనివాస యాదవ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా.. తలసాని శ్రీనివాస యాదవ్ మాట్లాడుతూ "పెరిగిన టెక్నాలజీలో సైబర్ క్రైమ్‌ను ఎలా చేస్తున్నారనే విషయాలను గమనిస్తూనే ఉన్నాం. దీన్ని ఓ మెసేజ్ క్రింద చూపిస్తూ 'ఐతే 2.0'ను రూపొందించారు. కొత్త టీంతో ఏర్పడ్డ ఈ సినిమా యూనిట్‌కు నా అభినందనలు. మెసేజ్‌తో పాటు ఇప్పటి ట్రెండ్‌కు తగ్గ సినిమాలను ప్రేక్షకులు చక్కగా ఆదరిస్తున్నారు. ఈ సినిమా పెద్ద సక్సెస్ కావాలని కోరుకుంటు న్నాను" అని తెలిపారు. దర్శకుడు రాజ్ మాదిరాజు మాట్లాడుతూ "ఈ సినిమాకు సంబంధించిన యు.ఎస్ హక్కులను ఫ్యాన్సీరేటుకు దక్కించుకున్నారు. ఆ ఆనందంలో ఉన్న సమయంలో తెలంగాణ సినిమాటోగ్రఫీ మినిస్టర్ తలసాని శ్రీనివాస యాదవ్‌గారి చేతులు మీదుగా ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్ విడుదల కావడం ఆనందంగా ఉంది. ఈ నెల 16న సినిమా విడుదలవుతుంది. తప్పకుండా సినిమా పెద్ద హిట్ అవుతుంది" అన్నారు. నిర్మాతల లో ఒకరైన కె.విజయరామరాజు మాట్లాడుతూ - "ట్రైలర్‌ను తలసానిగారు విడుదల చేయడం హ్యాపీ. ఆయనకు మా టీం తరఫున థాంక్స్. టెక్నికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది" అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: కౌశిక్ అభిమన్యు, ఎడిటింగ్: కార్తీక్ పల్లె, ఆర్ట్ డైరెక్టర్: రాజీవ్ నాయర్, మాటలు, పాటలు:కిట్టు విస్సా ప్రగడ, సంగీతం: అరుణ్ చిలువేరు. లైన్ ప్రొడ్యూసర్ : మహేష్ చదలవాడ , నిర్మాతలు : కె.విజయ రామరాజు, డా.హేమంత్ వల్లపు రెడ్డి దర్శకత్వం: రాజ్ మాదిరాజ్!!



ఆఫీసర్‌లో నాగార్జున-మైరా సరీన్

సమంత నామ సంవత్సరం!!



తెలుగు పంచాగం ప్రకారం ప్రస్తుతం 'హేవళంబి నామ సంవత్సరం' నడుస్తోంది. త్వరలో ముగియనున్న ఈ సంవత్సరం తర్వాత 'విళంబి నామ సంవత్సరం స్టార్ట్ కానుంది. కానీ.. తెలుగు సినిమా హీరోయిన్స్ లెక్కల ప్రకారం చూస్తే.. ఈ ఏడాదిని 'సమంత నామ సంవత్సరం' అని అభివర్ణించక తప్పేలా లేదు!సాధారణంగా ఏ హీరోయిన్ కెరీర్ అయినా పెళ్లయ్యాక ఎంతో కొంత మందగిస్తుంది. ఐశ్వర్యరాయ్, కరీనా కపూర్ వంటి క్రేజీ హీరోయిన్ల కెరీర్ ఇందుకు మంచి ఉదాహరణ. కానీ.. ఆలా ఆశ్చర్యంగా సమంత కెరీర్ మాత్రం పెళ్లయ్యాక మరింత ఊపందుకుంటోంది. అంటే ఆమె ప్లానింగ్ ఎంత పక్కాగా ఉందో అర్థం చేసుకోవచ్చు!

ఈ సమ్మర్‌లో సమంత నటిస్తున్న రెండు స్ట్రయిట్ సినిమాలు 'రంగస్థలం, మహానటి'తోపాటు విశాల్ సరసన సమంత నటించిన 'అభిమన్యుడు' విడుదల కానున్నాయి. ఇవి విడుదలకు సిద్ధంగా ఉన్న సినిమాలు కాగా.. అండర్ ప్రొడక్షన్‌లో మరో మూడు నాలుగు సినిమాలుండడం విశేషం!

సమంత అక్కినేని తమిళంలో నటిస్తున్న 'సీమ రాజా, సూపర్ డీలక్స్' చిత్రాలు వివిధ దశల్లో ఉండగా.. తెలుగులో సమంత నటిస్తూ నిర్మిస్తున్న (పరోక్షంగా) 'యు టర్న్' షూటింగ్ జరుపుకుంటోంది!

ఇక్కడ విషయం ఏమిటంటే.. సమంత నటించే అన్ని తమిళ చిత్రాలు ఆటోమేటిక్‌గా తెలుగులోనూ విడుదలవుతాయి. తమిళంతోపాటు, తెలుగులోనూ మార్కెట్ కలిగి ఉండడం వల్లే సమంతాను హీరోయిన్‌గా తీసుకునేందుకు పోటీపడుతుంటారనే విషయం తెలిసిందే. కాకపోతే.. ఇప్పుడిప్పుడు సమంత తెలుగులో నటిస్తున్న చిత్రాలు కూడా తమిళంలో రిలీజ్ అవుతున్నాయి!

ఉదాహరణకు కీర్తి సురేష్ టైటిల్ రోల్ ప్లే చేస్తున్న 'మహానటి'లో సమంత కీలక పాత్ర పోషిస్తుండడం తెలిసిందే. ఈ చిత్రం తెలుగుతోపాటు, తమిళంలోనూ ఏకకాలంలో విడుదల కానుంది. అలాగే కన్నడలో ఘన విజయం సాధించిన 'యు టర్న్' చిత్రాన్ని ప్రత్యేక శ్రద్ధతో తెలుగులో తీయిస్తూ, నటిస్తున్న సమంతా.. ఈ చిత్రాన్ని తమిళంలోనూ డబ్ చేసి విడుదల చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది!

ఈ చిత్రాలన్నీ ఒకెత్తయితే.. ప్రస్తుతానికి ఇంకా అధికారికంగా ప్రకటించని సినిమా మరొకెత్తు అని చెప్పాలి. ఎన్టీఆర్-రామ్‌చరణ్‌లతో రాజమౌళి రూపొందిస్తున్న మల్టీస్టారర్‌లో సమంత నటించనుందనే వార్తలు గత కొన్ని రోజులుగా చక్కర్లు కొడుతుండడం తెలిసిందేగా!

రాజమౌళి దర్శకత్వంలో 'ఈగ' చిత్రంలో నటించిన సమంత.. ఎన్టీఆర్‌తో 'బృందావనం, రామయ్య వస్తావయ్యా' చిత్రాలు చేసింది. అంతేకాదు.. రామ్‌చరణ్‌తో తాజాగా 'రంగస్థలం' చేసి ఉండడం కూడా.. ఈ చిత్రంలో హీరోయిన్ ఛాన్స్ కోసం తనదైన శైలిలో 'చిలిపి రౌడీయిజం' చేయడానికి ఆస్కారం ఉంది. ఈ సినిమా కూడా సమంత సొంతమైతే.. అప్పుడిక ఈ ఏడాది తెలుగు సినిమా హీరోయిన్ల కోణంలో 'సమంత నామ సంవత్సరం' అని పిలవక తప్పదు!!

అప్పుడు బొమ్మాళి ..ఇప్పుడు చల్‌చల్ గుర్రం



రాజరథం నుండి ముచ్చటగా మూడో పాట 'చల్ చల్ గుర్రం' నేడు విడుదలైంది. చిత్రానికి పనిచేసే వారి ఆకట్టుకునే నైపుణ్యం తో, ఉన్నత ప్రమాణాలతో ఆకర్షిస్తున్న 'రాజరథం' ఈ పాటతో మరోసారి ఆశ్చర్యపరచనుంది. ఎన్నో సినిమాలకి, ఎంతో మందికి డబ్బింగ్ చెప్పిన ప్రముఖ నటుడు రవి శంకర్ మొట్ట మొదటి సారి 'రాజరథం' లో తాను పోషిస్తున్న 'అంకుల్' పాత్ర కోసం 'చల్ చల్ గుర్రం' పాట పాడారు. ఈ పాటని మహాబలేశ్వర్, పూణే లో ని మాల్సెజ్ ఘాట్ వంటి అందమైన ప్రదేశాలలో కనువిందుగా చిత్రీక రించారు. దర్శకుడు అనూప్ భండారి సహజమైన మంచు కోసం మాల్సెజ్ ఘాట్ ని ఎంచుకున్నారు. ఒకోసారి మంచు తీవ్రత తగ్గే వరకూ ఆగి షూటింగ్ చేసుకోవాల్సి వచ్చేది. 'రాజరథం' కోసం దిలీప్ రాజ్ ప్రత్యేకంగా డిజైన్ చేసి తయారు చేసిన పాతకాలపు సైడ్ కార్ ఉండే స్కూటర్ ఈ పాటకి అదనపు ఆకర్షణ. ఈ స్కూటర్ మనల్ని పాత జ్ఞాపకాల్లోకి తీసు కెళ్లడం ఖాయం. ఈ 'చల్ చల్ గుర్రం' సాహిత్యంలో చాల అరుదైన తెలుగు పదాలని సినిమా కథకి సరిపోయేలా ఉపయోగిం చారు. రామజోగయ్య శాస్త్రి గారి పదాల అల్లిక, అనూప్ భండారి స్వరపరిచిన బాణీ వలన అనూప్ భండారి దర్శకత్వంలో, 'జాలీ హిట్స్' నిర్మాణంలో తెరకెక్కిన 'రాజరథం' ప్రపంచవ్యాప్తంగా మార్చ్ 23 న విడుదల కానుంది.

23న ఆనందం



సుఖీభవ మూవీస్ అధినేత ఎత్తరి గురురాజ్. మలయాళంలో సూపర్‌డూపర్ హిట్ అయిన ఆనందం చిత్రాన్ని అదే పేరుతో ఆయన తెలుగు ప్రేక్షకులకు ఈ నెల 23న అందించనున్నారు. మలయాళ ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టిన ఈ చిత్రానికి గణేశ్ రాజ్ దర్శకత్వం వహించారు. కేరళ టాప్ హీరో ప్రేమమ్ ఫేమ్ నివిన్ పాల్ ఇందులో గెస్ట్ రోల్ చేశారు. మిగిలిన నటీనటులందరూ దాదాపుగా కొత్త వారే. తెలుగులో అనువాద మవుతోన్న ఆనందం చిత్రానికి వీరా వెంకటేశ్వర రావు (పెదబాబు), రాజు ,రవి వర్మ చిలువూరి సహ నిర్మాతలు. సీనియర్ నిర్మాత ఆర్. సీతారామ రాజు సమర్పిస్తున్నారు. ఆనందం గురించి చిత్ర నిర్మాత ఎత్తరి గురురాజ్ మా ట్లాడుతూ కాలేజీ అనుభవాలు అనేవి ప్రపంచంలో ఎక్కడైనా ఒకే రకంగా ఉంటాయి. మనసు పొరల్లో పది లంగా జ్ఞాపకాలుగా మిగిలి ఉంటా యి. ఈ సినిమా చూసిన ప్రతి ఒక్క రికీ చదువుకున్న రోజులు గుర్తుకొ స్తాయి. తెలుగులోనూ అందుకు ధీటుగా ఆడుతుందనే నమ్మకం ఉంది.ఒక ఇండస్ట్రియల్ టూర్ నాలుగు రోజులు జరిగితే అక్కడ మూడు ప్రేమ జంటల కథే ఈ సినిమా అని అన్నారు!!



యూపీలో నరేంద్ర మోడీ విగ్రహం ధ్వంసం

- ఉద్రిక్తతతో రంగంలోకి దిగిన పోలీసులు
- దేశవ్యాప్తంగా వరుసగా విగ్రహాల ధ్వంసం
- తాజాగా యూపీలోని ఓ ఆలయంలో ఉన్న మోడీ విగ్రహం ధ్వంసం
- ఫిర్యాదు అందుకున్న పోలీసులు

లక్నో : దేశవ్యాప్తంగా జరుగుతున్న విగ్రహాల విధ్వంసం నరేంద్ర మోడీ వరకూ విస్తరించింది. గడచిన నాలుగు రోజుల వ్యవధిలో లెనిన్, పెరియార్ రామస్వామి, శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, బిఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీల విగ్రహాలు ధ్వంసం కాగా, తాజాగా, గురువారం రాత్రి ఉత్తర ప్రదేశ్‌లోని కౌశాంబీ జిల్లా భగవాన్‌పూర్‌లో ప్రధాని నరేంద్ర మోడీ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ గ్రామంలో 2014లో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీజేపీ నేత బ్రజేంద్ర నారాయణ్ మిశ్రా ఈ విగ్రహాన్ని ఓ శివాలయంలో ఏర్పాటు చేయగా, గ్రామస్థులు పూజలు కూడా చేస్తుండేవారు. ఈ విగ్రహం ముక్కును ధ్వంసం చేశారని తెలియడంతో స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి వచ్చి తమ నిరసన తెలిపారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేశామని, దర్యాప్తు జరుపుతున్నామని తెలియజేశారు. మోడీ విగ్రహం ధ్వంసం నేపథ్యంలో కొంత ఉద్రిక్త పరిస్థితి తలెత్తగా, అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాకిస్తాన్‌కు ఎస్‌టిజెడ్ అని నిక్ నేమ్

- ఐక్యరాజ్య సమితిలో కొత్త పిలుపు
- ఇప్పటికే పాక్‌ను 'టెర్రరిస్థాన్' అంటున్న భారత్
- ఇప్పుడు స్పెషల్ టెర్రరిస్ట్ జోన్ అని అభివర్ణన
- సెజ్‌ను గుర్తు చేస్తున్న ఎస్‌టిజడ్
- ఆకర్షించిన మినీ దేవీ కుమమ్ ప్రసంగం



జెనీవా : అంతర్జాతీయ వేదికలపై ఇప్పటికే పాకిస్తాన్‌ను 'టెర్రరిస్థాన్' అని సంబోధిస్తూ, పాక్ ఉగ్రవాద కార్యకలాపాలను ఎండగడుతున్న ఇండియా ఇప్పుడు మరో ప్రత్యేక పదాన్ని వాడుతూ పాక్‌ను మరింత ఇబ్బంది పెట్టే ప్రయత్నాలు మొదలుపెట్టింది. జెనీవాలో జరిగిన ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల సంస్థ సమావేశంలో భారత రెండవ కార్యదర్శి మినీ దేవి కుమమ్ మాట్లాడుతూ పాకిస్తాన్‌ను ఎస్‌టిజడ్ (స్పెషల్ టెర్రరిస్ట్ జోన్)గా అభివర్ణించారు. ఇండియాలో తరచు వినిపించే ఎస్‌ఇజడ్ (స్పెషల్ ఎకనామిక్ జోన్)ను తలపించేలా ఆమె ప్రసంగించడం ఆకర్షించింది. పాకిస్తాన్‌లో ప్రత్యేక టెర్రరిస్టు జోన్‌లు ఎన్నో ఉన్నాయని, సీమాంతర ఉగ్రవాదాన్ని ఆపాలని, ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయాలని తాము ఎంతగా డిమాండ్ చేస్తున్నా ఆ దేశం స్పందించడం లేదని ఆరోపించారు. పాక్‌లో మానవ హక్కులకు భంగం కలుగుతోందని ఆరోపించారు. జమ్మూ కాశ్మీర్ ప్రాంతంలో నిజమైన సమస్య పాకిస్తాన్ ఉగ్రవాదమేనని ఆమె పేర్కొంటూ, ఎస్‌టిజడ్‌లను నడువుతున్న పాకిస్తాన్ తమను విమర్శించడం ఏమిటని నిలదీశారు.

మలాలాను కాల్చిన ఉగ్రవాదిపై భారీ రివార్డు

తెహ్రిక్ ఈ తాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ), దాని అనుబంధ ఉగ్ర సంస్థలకు చెందిన పలువురు ఉగ్రవాదులను పట్టిస్తే భారీ మొత్తంలో డబ్బు రివార్డుగా ఇస్తామని అమెరికా ప్రకటించింది. టీటీపీ నేత మౌలానా ఫజుల్లా, మరి ఇద్దరు ఉగ్రవాదుల గురించి సమాచారం గానీ వారు ఎక్కడ ఉన్నారో తెలియజేసిన వారికి భారీ నజరానా ఇవ్వనున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించింది. పాకిస్తాన్‌కు చెందిన ప్రముఖ ఉద్యమకారిణి, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మలాలా యూసఫ్ జాయ్‌ను చంపేందుకు 2012 అక్టోబరు 9న ఆమెపై కాల్పులకు, 2012 జూన్‌లో 17 మంది పాకిస్తాన్ సైనికుల హత్యకు ఫజుల్లానే బాధ్యుడు. మౌలానా ఫజుల్లా తలపై అమెరికా 5 మిలియన్ డాలర్లు (సుమారు రూ.3 2 కోట్లు) రివార్డు ప్రకటించింది. మరి ఇద్దరు ఉగ్రవాదులు అబ్దుల్ వలి, మంగల్ బాగ్‌లపై ఒక్కొక్కరిపై 3 మిలియన్ డాలర్ల రివార్డు ప్రకటించింది. అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, మలాలాపై హత్యా యత్నంతో పాటు పాక్, అమెరికా ఆస్తులకు వ్యతిరేకంగా జరిగిన పలు ఉగ్రవాద కార్యకలాపాలకు తానే బాధ్యుడినని ఫజుల్లా చెప్పినట్లు తెలుస్తోంది. 2010 మే 1న న్యూయార్క్‌లోని టైమ్ స్క్వేర్‌లో పాకిస్తాన్‌కు చెందిన ఫైజల్ షహ్‌జాద్‌తో పేలుళ్లకు ప్రయత్నించింది కూడా ఫజుల్లానేనని అమెరికా చెప్తోంది. పాకిస్తాన్‌లోని పెషావర్ పాఠశాలపై దాడి చేసింది కూడా ఫజుల్లా ఆధ్వర్యంలోని టీటీపీ ఉగ్రవాదులే. ఈ ఘటనకు టీటీపీ బాధ్యత వహిస్తూ ప్రకటన కూడా చేసింది. పెషావర్ ఘటనలో 132 మంది చిన్నారులు సహా 148 మంది మరణించారు. 2015లో అమెరికా ప్రభుత్వం ఫజుల్లాను ప్రత్యేకమైన అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. రివార్డు ప్రకటించిన మరో ఉగ్రవాది అబ్దుల్ వలి టీటీపీకి అనుబంధమైన జమాత్ ఉల్ అహ్‌రార్ అనే ఉగ్ర సంస్థకు చెందిన వ్యక్తి. అతడు కూడా పౌరులు, మైనారిటీలు, సైన్యం లక్ష్యంగా పలు దాడుల చేశాడు. పెషావర్‌లోని అమెరికా దౌత్య కార్యాలయంలో ఇద్దరు పాకిస్తానీ ఉద్యోగులను హత్య చేశాడు. మరో ఉగ్రవాది మంగల్ బాగ్ కూడా టీటీపీకి అనుబంధమైన లష్కర్ ఎ ఇస్లాం సంస్థకు చెందిన వాడు. ఇతడి ఆధ్వర్యంలో నాటో కాన్వాయ్‌పై దాడులు జరిగాయి. డ్రగ్ ట్రాఫికింగ్, స్మగ్లింగ్, అపహరణలు, తదితర చర్యల ద్వారా డబ్బు సమకూర్చుతాడు. అతడిపై 2007లో పాక్ ప్రభుత్వం కూడా 60 వేల డాలర్ల రివార్డు ప్రకటించింది.



చంద్రబాబుకు మా సెల్యూట్: ఆర్జేడీ



పాట్నా : ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన పనికి, ఆయన చూపిన ధైర్యానికి తాము సెల్యూట్ చేస్తున్నామని ఆర్జేడీ వ్యాఖ్యానించింది. ఇప్పటికైనా బీహార్ సీఎం నితీశ్ కుమార్, చంద్రబాబును చూసి నేర్చుకోవాలని ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి మనోజ్ ఝా మీడియా ముందు వ్యాఖ్యానించారు. ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనంటూ బీజేపీపై తిరుగుబాటు ప్రకటించిన చంద్రబాబును చూసి సెల్యూట్ చేస్తున్నామని, తెలంగాణ ఏర్పాటు వల్ల ఆంధ్ర ప్రదేశ్ ఎలా నష్టపోయిందో, ఝార్ఖండ్ ఏర్పాటు తరువాత బీహార్‌కూ అదే విధమైన నష్టం జరిగిందని, కానీ చంద్రబాబులా ధైర్యంగా నితీశ్ వ్యవహరించడం లేదని ఆయన ఆరోపించారు. గతంలో నితీశ్ కుమార్ కూడా ప్రత్యేక హోదా కావాలని డిమాండ్ చేశారని, ఆపై ఆ డిమాండ్‌ను మరచిపోయారని విమర్శించారు. మోడీతో, అమిత్ షాతో మాట్లాడాలంటేనే ఆయన వణికిపోతున్నారని ఆరోపించారు. ఇక రాష్ట్ర ప్రజలు నితీశ్ మౌనాన్ని భరించే స్థితిలో లేరని, తమ పార్టీ ఆందోళన కార్యక్రమాలను చేపడుతుందని చెప్పారు.

ఆమెతో నాకు సంబంధాలు లేవు



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో తనకు శారీరక సంబంధాలు ఉండేవని, ఆ విషయాన్ని బయట పెట్టకుండా ఉంచేందుకు ఆయన న్యాయవాది మైఖేల్ కోహెన్ తనకు రూ. 1.30 లక్షల డాలర్లు ఇచ్చి, కొన్ని పత్రాలపై బలవంతంగా సంతకాలు చేయించుకున్నారని పోర్న్ స్టార్ స్టెఫానీ క్లిఫర్డ్ ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, స్టెఫానీ ఆరోపణలను ట్రంప్ ఖండించారు. ఆమెతో తనకు ఎలాంటి సంబంధాలూ లేవని ఆయన స్పష్టం చేశారు. వైట్ హౌస్ మీడియా కార్యదర్శి శారా సాండర్స్ మాట్లాడుతూ, తనపై వచ్చిన ఆరోపణలను ట్రంప్ తోసిపుచ్చారని తెలిపారు.

రన్‌వేపై పేలిపోయిన విమానం



టెక్సాస్ : ఓ మినీ విమానం ప్రమాదవశాత్తు కూలిపోయిన ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. టెక్సాస్‌లోని లారెడో అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. పైపర్ పీఏ-31 పీ మినీ విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే అందులో మంటలు వ్యాపించడంతో పైలట్ తిరిగి ఎయిర్‌పోర్ట్‌లో విమానాన్ని దించాలనుకున్నారు. అయితే, విమానం ల్యాండ్ అవుతుండగా ఇంజన్‌లో పేలుడు చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మిని విమానంలో ఉన్న ముగ్గురు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందారు. ఇంజన్‌లో సాంకేతిక లోపం తలెత్తడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. ఎయిర్‌పోర్ట్ నుంచి వెళ్లే అన్ని విమాన సర్వీసులను రద్దు చేశారు. విమానం ఇంజన్ పేలిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. అధికారికంగా వీడియో ఫుటేజీని విడుదల చేయకపోయినా, ఈ ఘటనకు సంబంధించి వీడియో స్థానిక మీడియాలో రావడంతో విమానం ప్రమాద దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

అమెరికా డ్రోన్ దాడుల్లో పాక్ తాలిబన్ చీఫ్ కుమారుడు హతం



కాబూల్ ఆఫ్ఘనిస్తాన్‌లోని కునార్ ప్రావిన్స్‌లో అమెరికా జరిపిన డ్రోన్ దాడుల్లో తెహ్రీక్- ఎ- తాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ) చీఫ్ ముల్లా ఫజ్‌లుల్లా కుమారుడు సహా 20 మంది పాకిస్తానీ తాలిబన్లు హతమయ్యారు. ఈ విషయాన్ని తాలిబన్ గ్రూప్ నిర్ధారించింది. టీటీపీ క్యాంపుపై జరిగిన దాడిలో ఫజ్‌లుల్లా కుమారుడు అబ్దుల్లా సహా 20 మంది ఫైటర్లు మృతి చెందినట్టు పేర్కొంది. మృతులలో టీటీపీ కమాండర్ అయిన గుల్ ముహమ్మద్, ఫిదాయీలకు శిక్షణ ఇచ్చే యాసీన్ కూడా మరణించినట్టు 'డాన్' పత్రిక పేర్కొంది. పాక్-ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దులో ఆఫ్ఘాన్ వైపుఉన్న టీటీపీ ఫిదాయీలు ఉన్న క్యాంపులపై దాడులు చేయడం లేదంటూ అమెరికా, ఆఫ్ఘనిస్తాన్‌లను పాకిస్తాన్ తరచు నిందిస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో తాజా డ్రోన్ దాడి ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక్కడి టీటీపీ ఫిదాయీలు పాకిస్తాన్ భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకుని తరచు దాడులు చేస్తున్నాయి.

కేసీఆర్ ప్రధాని కావాలంటూ అజ్మీర్ దర్గాలో ప్రార్థనలు



అజ్మీర్ : దేశ రాజకీయాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు సమూల మార్పులకు నాంది పలకాలని, దేశ ప్రధానిగా బాధ్యతలను చేపట్టాలని కోరుతూ రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గాలో శుక్రవారం ప్రార్థనలు నిర్వహించారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ నేతృత్వంలో రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ మసీ ఉల్లా, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సయ్యద్ అక్బర్ హుస్సేన్, టీఆర్ఎస్ మైనారిటీ నేత షరీఫ్ తదితరులతో కూడిన బృందం గురువారం రాజస్థాన్‌కు వెళ్లింది. అజ్మీర్ కలెక్టర్‌తో వారు సమావేశం కానున్నారు. తెలంగాణ నుంచి అజ్మీర్‌కు వెళ్లే భక్తుల కోసం అక్కడ గెస్ట్ హౌస్‌ను నిర్మించడానికి అవసరమైన స్థలంపై కలెక్టర్‌తో చర్చిస్తారు.

ఎమ్మెల్యే కుమార్తె, సినిమా దర్శకుడి ప్రేమ పెళ్లి



మైసూరు : కర్నాటకలో ఓ ఎమ్మెల్యే కుమార్తె, సినిమా దర్శకుడి ప్రేమ వివాహం సస్పెన్స్ థ్రిల్లర్‌ను తలపించింది. తమ స్నేహాన్ని ప్రేమగా మార్చుకున్న మాయకొండ ఎమ్మెల్యే శివమూర్తి నాయక్ కుమార్తె లక్ష్మి, 'కన్నడ మాస్తిగుడి' దర్శకుడు పీ సుందర్ గౌడ గురువారం మైసూరు చాముండి కొండపై వివాహం చేసుకున్నారు. ఈ పెళ్లికి సుందర్ బంధువులు పలువురు హాజరయ్యారు. మరో పక్క, ఎమ్మెల్యే శివమూర్తి తన కుమార్తె కనిపించడం లేదంటూ ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు. మైసూరులో వరుడి బంధువులు బస చేసిన హోటల్ వద్దకు వచ్చి అక్కడ ఉన్న వారందరినీ అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. ఈ విషయాన్ని ముందుగానే పసిగట్టిన వధూవరులు రహస్యంగా బెంగళూరుకు పారిపోయారు. ఆపై వారిద్దరూ కలసి ఓ సెల్ఫీ వీడియో తీసుకుని, సోషల్ మీడియాలో పోస్టు చేశారు. లక్ష్మి మాట్లాడుతూ, సుందర్ అంటే తనకు ఇష్టమని, కోరి అతనిని పెళ్లి చేసుకున్నానని తెలియజేసింది. ఎవరికీ ఇబ్బందులు కలిగించవద్దని ఆమె వేడుకుంది. కాగా, గత ఆరు నెలలుగా వారిద్దరి మధ్య ప్రేమాయణం సాగినట్టు తెలుస్తోంది.

తుపాకీతో సెల్ఫీ : ప్రాణాలు కోల్పోయిన టీచర్

న్యూఢిల్లీ : ప్రమాదకర ప్రదేశాల్లో, ప్రమాదకర వస్తువులతో సెల్ఫీలు తీసుకుంటూ ప్రాణాలు కోల్పోతున్నారు కొందరు సెల్ఫీ ప్రియులు. సెల్ఫీల కారణంగా ప్రాణాలు కోల్పోతున్న వారి గురించి ప్రతి రోజు వార్తల్లో వస్తున్నప్పటికీ సెల్ఫీ ప్రియులు ఆ మోజులో నుంచి బయటకు రాలేకపోతున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విలువైన జీవితాన్ని బలి చేసుకుంటున్నారు. తాజాగా, ఇటువంటిదే మరో ఘటన వెలుగులోకి వచ్చింది. ఢిల్లీలో ఓ ఉపాధ్యాయుడు ఓ యువకుడితో కలసి గన్‌తో సెల్ఫీ తీసుకోబోయాడు. అది ఒక్కసారిగా పేలడంతో ఆ టీచర్ ప్రాణాలు కోల్పోయాడు. సదరు టీనేజీ యువకుడు అనుకోకుండా తుపాకీ ట్రిగ్గర్ నొక్కినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ తుపాకీ ఆ కుర్రాడి తండ్రిదని, దానికి లైసెన్స్ ఉందని గుర్తించారు. ఆ యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు సాగిస్తున్నారు.

పాక్ మాజీ అధ్యక్షుడు ముషారఫ్‌కు షాక్

- అరెస్ట్ చేసి ఆస్తులు సీజ్ చేయాలని కోర్టు ఆదేశం
- దేశద్రోహం కేసును ఎదుర్కొంటున్న ముషారఫ్
- కీలక తీర్పు వెల్లడించిన ప్రత్యేక న్యాయస్థానం
- ఆస్తుల సీజ్ వద్దన్న ముషారఫ్ న్యాయవాది
- తీర్పు వెనక్కి తీసుకోలేమన్న కోర్టు



పెషావర్ : పాకిస్తాన్ మాజీ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్‌కు ప్రత్యేక న్యాయస్థానం గురువారం షాక్ ఇచ్చింది. ముషారఫ్‌ను అరెస్ట్ చేసి ఆయన ఆస్తులను జప్తు చేయాలని ఆదేశించింది. మాజీ అధ్యక్షుడిపై నమోదైన దేశద్రోహం కేసును విచారించిన కోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. పెషావర్ హైకోర్టు చీఫ్ జస్టిస్ యెహ్యా అఫ్రిది, లాహోర్ హైకోర్టు చీఫ్ జస్టిస్ యెవర్ అలీ, బలూచిస్తాన్ హైకోర్టు జస్టిస్ తాహిర సఫ్దర్‌లతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. ముషారఫ్‌పై నమోదైన దేశ ద్రోహం కేసును విచారించేందుకు 2013లో ఈ బెంచ్‌ను ఏర్పాటు చేశారు. విచారణలో భాగంగా దేశీయాంగ మంత్రిత్వశాఖ ముషారఫ్ ఆస్తులకు సంబం.దించిన వివరాలను కోర్టుకు సమర్పిం చింది. వాదోపవాదాలు విన్న కోర్టు ముషారఫ్‌ను అరెస్ట్ చేసి, ఆయన ఆస్తులను జప్తు చేయాల్సిందిగా ఆదేశించింది. కోర్టు ఆదేశాలపై ముషారఫ్ తరఫు న్యాయవాది మాట్లాడుతూ ఈ నెల 21 వరకు ఆస్తులను జప్తు చేయవద్దని కోరారు. స్పందించిన జస్టిస్ అఫ్రిది మాట్లాడుతూ కోర్టు ఆదేశాలను వెనక్కి తీసుకునేది లేదని స్పష్టం చేసి తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేశారు.

దావూద్ అనుచరుడికి వీవీఐపీ ట్రీట్‌మెంట్



న్యూఢిల్లీ : అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం అనుచరుడు ఫరూఖ్‌కు వీఐపీ ట్రీట్‌మెంట్ అందిన విషయం కలకలం రేపుతోంది. యూపీఏ ప్రభుత్వ హయాంలో అతనికి పలువురు ప్రతినిధులు, అధికారులు సహకరించారన్న విషయం వెలుగులోకి వచ్చింది. ఫరూక్ పాస్‌పోర్ట్ రెన్యువల్ విషయాన్ని ప్రస్తావిస్తూ ఓ జాతీయ మీడియా కథనం ప్రచురించింది. 2011 ఫిబ్రవరి 7న ఫరూఖ్ తక్లా తన పాస్‌పోర్ట్ రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. అయితే, కేవలం 24 గంటల్లోనే దానిని అధికారులు పూర్తి చేశారట. పైగా ఇందు కోసం ఓ కాంగ్రెస్ పార్టీ కీలక నేత ముంబయి పాస్‌పోర్ట్ అధికారులపై ఒత్తిడి తెచ్చాడని ఆ కథనం సారాంశం. ఆ సమయంలో విదేశాంగ శాఖ మంత్రిగా ఉన్న ఎస్ఎం కృష్ణను, పి చిదంబరాన్ని ఈ వ్యవహారంపై బీజేపీ వివరణ కోరిందట. అయితే, యూపీఏ మాత్రం అందుకు విముఖత వ్యక్తం చేసినట్లు ఆ కథనం పేర్కొంది. కాగా, ముంబయి పేలుళ్ల నిందితుడు అయిన యాసిన్ మన్సూర్ మహ్మద్ ఫరూఖ్ అలియాస్ ఫరూఖ్ తక్లాను సీబీఐ అధికారులు దుబాయిలో అరెస్ట్ చేసి ఢిల్లీకి తీసుకు వచ్చారు. 1993లో పేలుళ్ల తరువాత దుబాయి పారిపోయిన ఫరూఖ్ డీగ్యాంగ్‌లో క్రియాశీలక ఏజెంట్‌గా ఎదిగాడు. తీవ్రవాదం, అక్రమ మారణా యుధాల సరఫరా, నేరపూరిత కుట్రలు.. పలు అంశాలపై భారత్‌లో అతనిపై కేసులు నమోదయ్యాయి. 1995లోనే ఇంటర్‌పోల్ అధికారులు ఫరూఖ్ తక్లాపై రెడ్ కార్నర్ నోటీస్ జారీ చేశారు.

ఆలయంలో బీజేపీ నేత చెప్పుతో దాడి



తూత్తుకుడి : బీజేపీకి చెందిన మహిళా నేత ఒకరు ఆలయంలో అనుచితంగా ప్రవర్తించారు. కరపత్రాలను పంచుతున్న కొంత మంది రైతులపైనా, వారి నాయకుడిపైనా చెప్పుతో దాడికి పాల్పడ్డారు. ఈ దృశ్యాలు కెమెరా కంటికి చిక్కారు. పైగా ఆమె దాడి చేయడమే కాకుండా తనకు ఇబ్బంది కలిగించిన వారిపై కేసులు నమోదు చేయాలంటూ చిర్రుబుర్రులాడారు. వివరాల్లోకి వెళితే, తమిళనాడు తూత్తుకుడి జిల్లాలో గల ఆలయానికి నెల్లయమ్మాల్ అనే ఆ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వచ్చారు. అదే సమయంలో కొంత మంది రైతుల అసోసియేషన్ అదే ఆలయంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కరపత్రాలు పంచుతున్నారు. జన్యుపరమైన మార్పులు చేసే వ్యవసాయాన్ని కేంద్రం ఆదరించడంపై వారు నిరసన వ్యక్తం చేస్తూ కరపత్రాలు ఇస్తున్నారు. ఆ సమయంలో అక్కడే ఉన్న నెల్లయమ్మాల్ వారితో వాగ్వాదానికి దిగారు. వారిపై దుర్భాషలాడారు. ఆ రైతులంతా కూడా పెద్ద వయసులో ఉన్నారని కూడా చూడకుండా తన చెప్పును తీసుకొని వారిపై దాడికి పాల్పడ్డారు. అంతే కాదు. మున్ముందు భయంకరమైన పరిస్థితులు ఎదుర్కొంటావని కూడా ఆమె ఆ రైతు నాయకుడిని బెదరించారు. అయితే, ఆ రైతులపై కేసులు నమోదు చేసినట్లు బీజేపీ రాష్ట్ర విభాగం చెప్పింది. రైతుల అసోసియేషన్ అధ్యక్షుడు అయ్యకన్ను ఆమెను వ్యభిచారి అంటూ దుర్భాషలాడారని, అందుకే అక్కడ పరిణామాలు చోటు కేసుకున్నాయని, దర్యాప్తు చేయాలని పోలీసులను కోరినట్లు వెల్లడించింది.

మనం దెబ్బలాడుకోవద్దు... డ్యాన్స్ చేద్దాం...

- భారత్‌కు స్పష్టం చేసిన చైనా
- డ్రాగన్- ఏనుగు డ్యాన్స్ చేయాలి
- పతాక శీర్షికలకు ఎక్కాలన్న ఆలోచన లేదు
- 1కి 1 కలిస్తే రెండు కాదు.. 11 కూడా అవుతుంది
- భారత్‌తో సంబంధాలపై చైనా విదేశాంగ మంత్రి



బీజింగ్ : భారత్, చైనా కలహించుకోవడాన్ని మాని ఆనందంతో కలసి నృత్యం చేయాలని చైనా విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ యి పిలుపు ఇచ్చారు. తాము పతాక శీర్షికల కోసం ఆరాటపడడం లేదని, అటువంటి ప్రయత్నాలు సముద్రంలో నురగలా కాసేపటికే చెల్లాచెదురవుతాయని అన్నారు. డ్రాగన్ (చైనా), ఏనుగు (భారత్) రెండూ ఘర్షణ పడకూదని, నృత్యం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇండియా, ఆస్ట్రేలియా, అమెరికా, జపాన్ చతుర్ముఖ చర్చల పునరుద్ధరణ ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు. దీని కంటే తాము చేపట్టిన వన్ బెల్ట్, వన్ రోడ్ ప్రాజెక్టుకే ఎక్కువ మద్దతు ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు వంద దేశాలు మద్దతు ఇస్తున్నాయని తెలిపారు. ఇండో- చైనా సంబంధాల్లో గత ఏడాది పరీక్షా కాలం ఎదురైందని, అయితే, సంబంధాలను మెరుగుపరచుకునేందుకు ఇరు దేశాలు ప్రయత్నించి విజయం సాధించాయని చెప్పారు. ఇందులో వ్యూహాత్మక దార్శనికత దాగి ఉందన్నారు. పరస్పర నమ్మకమే ఇరు దేశాల సంబంధాల్లో అత్యంత విలువైన అంశమని పేర్కొన్న వాంగ్ యి ఒకటికి ఒకటి కలిస్తే రెండు మాత్రమే కాదని, 11 కూడా అవుతుందని అభివర్ణించారు.

లెనిన్ విగ్రహాన్ని పెట్టిన వారే కూల్చేశారన్న రామ్ మాధవ్



అగర్తలా : త్రిపురలో విగ్రహాల విధ్వంసం అన్నది ఎక్కడా జరగలేదని బీజేపీ అధికార ప్రతినిధి రామ్ మాధవ్ వ్యాఖ్యానించారు. బెలోనియాలో లెనిన్ విగ్రహాన్ని కూల్చిన ఘటనపై ఆయన స్పందిస్తూ, దీన్ని ఎవరూ కూల్చివేయలేదని, ప్రైవేట్ భూమిలో ఇది ఏర్పాటై ఉండడంతో ఈ విగ్రహాన్ని భూయజమానులే తొలగించారని, ఆ విగ్రహాన్ని గతంలో వారే ప్రతిష్ఠించుకున్నారని వెల్లడించారు. మీడియాలో జరిగిన ప్రచారం తప్పుడుదని అన్నారు. అంతర్జాతీయ నేతలను గౌరవించాలని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ హితవు పలకడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, నేతలను ఎలా గౌరవించాలో తమకు తెలుసునని, ఇతర రాష్ట్రాల వ్యవహారాల్లో తలదూర్చే ముందు సొంత రాష్ట్రంలో పరిస్థితులు చక్కదిద్దుకోవాలని అన్నారు. కాగా, త్రిపురలో 25 ఏళ్ల తరువాత వామపక్షాల ప్రభుత్వాన్ని బీజేపీ గద్దె దింపిన తరువాత విగ్రహాల విధ్వంసం తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే.

ఇదే చివరి ఫొటో అవుతుందనుకోలేదన్న టీనా అంబానీ



ముంబయి : భార్యా వియోగంతో విషాదంలో ఉన్న నిర్మాత బోనీ కపూర్‌ను పలువురు బాలీవుడ్, పారిశ్రామిక ప్రముఖులు పరామర్శించి ఓదార్చే ప్రయత్నం చేస్తున్నారు. తాజాగా బోనీ కపూర్‌ను ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ సతీమణి, సినీ నటి టీనా అంబానీ పరామర్శించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 11న తన 61వ పుట్టిన రోజు వేడుక సందర్భంగా సినీ నటి దివంగత శ్రీదేవితో దిగిన ఫోటోకు వెండి ఫ్రేమ్ కట్టించి ఆయనకు జ్ఞాపికగా ఇచ్చారు. ఆ ఫోటోను చూసిన బోనీ కపూర్ ఆనాటి సందర్భాన్ని గుర్తు చేసుకుని భావోద్వేగానికి లోను కాగా, ఇదే శ్రీదేవితో కలసి దిగిన ఆఖరు ఫోటో అవుతుందనుకోలేదని టీనా బాధపడ్డారు.

నామినేషన్ వేసిన జయా బచ్చన్

రాజ్యసభ ఎన్నికలకు జయ నామినేషన్



న్యూఢిల్లీ : రాజ్యసభ స్థానానికి బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ భార్య జయా బచ్చన్ నామినేషన్ దాఖలు చేశారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం నుంచి సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థిగా ఆమె నామినేషన్ వేశారు. నామినేషన్ కార్యక్రమానికి ఎస్పీ అధినేత అఖిలేష్ సింగ్ యాదవ్ భార్య డింపుల్, ఇతర నేతలు రాజేంద్ర చౌదరి, కిరణ్మయ్ నందాలతో పాటు సహారా ఇండియా అధినేత సుబ్రతా రాయ్ కూడా హాజరయ్యారు. పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో ఆమె నామినేషన్ దాఖలు చేశారు. వచ్చే నెలలో ఆమె 70 ఏళ్ల వయసులోకి అడుగుపెట్టబోతున్నారు. నామినేషన్ అనంతరం జయా బచ్చన్ మీడియాతో మాట్లాడుతూ, ములాయం సింగ్ యాదవ్‌కు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ధన్యవాదాలు చెబుతున్నానని తెలిపారు. కిరణ్మయ్ నందా, నరేష్ అగర్వాల్ వంటి సీనియర్లను కాదని మీకు పార్టీ టిక్కెట్ ఎలా దక్కిందన్న ప్రశ్నకు సమాధానమిస్తూ, తాను కూడా సీనియర్‌నే అని చెప్పారు. ఏప్రిల్ 2తో ఆమె రాజ్యసభ ఎంపీ కాలపరిమితి ముగుస్తోంది. ఉత్తర ప్రదేశ్ నుంచి 10 రాజ్యసభ సీట్లకు ఎన్నికలు జరగబోతున్నాయి.

శ్రీదేవి మృతిపై నెలకొన్న సందేహాలపై క్లారిటీ ఇచ్చిన విదేశాంగ శాఖ

అనుమానించదగ్గ విషయాలు లేవు



న్యూఢిల్లీ : సినీ నటి శ్రీదేవి మరణం వెనుక మరేదైనా కోణం ఉందా అనే సందేహాలకు భారత విదేశాంగ శాఖ ఫుల్ స్టాప్ పెట్టింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రవీష్ కుమార్ మాట్లాడుతూ, తనకు తెలిసినంత వరకు యూఏఈ ప్రభుత్వం నుంచి మనకు పూర్తి స్థాయి నివేదిక అందిందని చెప్పారు. ఒకవేళ శ్రీదేవి మృతి వెనుక అనుమానించదగ్గ అంశాలు ఏమైనా ఉంటే ఇప్పటికల్లా బయటకు వచ్చేవని చెప్పారు. ఇక ఈ విషయంపై ఎలాంటి చర్చ అవసరం లేదని తెలిపారు. ఫిబ్రవరి 24న దుబాయిలోని ఓ హోటల్‌లో బాత్ టబ్‌లో పడి శ్రీదేవి మరణించిన సంగతి తెలిసిందే. పొరపాటున బాత్ టబ్‌లో పడి, చనిపోయిందని దుబాయి ఫోరెన్సిక్ రిపోర్టు పేర్కొంది. ఫిబ్రవరి 28న అధికారిక లాంఛనాలతో శ్రీదేవి అంత్యక్రియలు జరిగాయి.

ప్రపంచకప్‌లో భారత్‌కు మరో పతకం



మెక్సికో : ఐఎస్ఎస్ఎఫ్ సీనియర్ ప్రపంచకప్‌లో భారత్ ఖాతాలో మరో పతకం వచ్చి చేరింది. టోర్నీలో భాగంగా ఆరో రోజు నిర్వహించిన మహిళల 50మీటర్ల రైఫిల్ త్రి పొజిషన్ ఈవెంట్‌లో భారత క్రీడాకారిణి అంజుమ్ మోద్గిల్ 454.2 పాయింట్లు సాధించి రజత పతకాన్ని దక్కించుకుంది. చైనాకు చెందిన రుజియో(455.4) స్వర్ణం గెలవగా ఇదే దేశానికి చెందిన టింగ్ సున్ (442.2) కాంస్యంతో సరిపెట్టుకుంది. పురుషుల 25 మీటర్ల రాపిడ్ ఫైర్ పిస్టోల్ ఈవెంట్‌లో భారత్‌కు నిరాశ ఎదురైంది. ఈ విభాగంలో పతకం తెస్తాడని భావించిన అనిశ్ భన్‌వాలా ఏడో స్థానంలో నిలిచాడు. మరో భారత ఆటగాడు నీరజ్ కుమార్ 13వ స్థానానికి పరిమితమయ్యాడు. తాజాగా అంజుమ్ సాధించిన పతకంతో భారత్ పతకాల సంఖ్య 8కి చేరింది. 3 బంగారు, ఒక రజతం, నాలుగు కాంస్య పతకాలతో భారత్ పతకాల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆ తర్వాతి స్థానంలో చైనా (2 బంగారు, 2 రజతం, ఒక కాంస్యం) ఉంది. చండీగఢ్‌కు చెందిన 20 ఏళ్ల అంజుమ్‌కు ఇదే తొలి అంతర్జాతీయ పతకం.


పాండ్యాతో పోలికలు వద్దు

ఆల్‌రౌండర్ విజయ్‌శంకర్



కొలంబో : దేశానికి ప్రాతినిథ్యం వహిస్తున్న ఏ క్రికెటర్ అయినా తన తొలి పరుగు, తొలి వికెట్‌ను వీలైనంత త్వరగా దక్కించుకుని ఆ క్షణాలను చిరస్మరణీయం చేసుకోవాలని అనుకుంటారు. తాజాగా లంకలో ముక్కోణపు టోర్నీ కోసం ఎంపిక చేసిన భారత జట్టులో చోటు దక్కించుకున్నాడు ఆల్‌రౌండర్ విజయ్ శంకర్. మంగళవారం లంకతో జరిగిన మ్యాచ్‌లో విజయ్‌కు వికెట్ దక్కలేదు. దీంతో ఎలాగైనా గురువారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో వికెట్ పడగొట్టాలనుకున్నాడు. అంతే కసిగా ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌కు బంతులేశాడు. విజయ్ వేసిన తొలి ఓవర్‌లో ఓ బంతిని క్యాచ్ పట్టబోయి వాషింగ్టన్ సుందర్ వదిలేశాడు. ఆ తర్వాత మరో క్యాచ్‌ను సురేశ్ రైనా వదిలేశాడు. దీంతో విజయ్‌కు తొలి వికెట్ కాస్త ఆలస్యంగానే దక్కింది. 9వ ఓవర్లో ముష్ఫికర్ రహీంను ఔట్ చేసి తొలి అంతర్జాతీయ వికెట్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. తాజాగా దీనిపై మీడియాతో మాట్లాడుతూ.. ఆటగాళ్లు అనుకో కుండా క్యాచ్‌లు చేజార్చడం మ్యాచ్‌లో సర్వసాధారణం. సహచర ఆటగాళ్లు క్యాచ్‌లు వదిలేసినా అది నాపై ఎలాంటి ఒత్తిడి తీసుకురాలేదు. వైట్ బాల్ క్రికెట్‌లో లైట్ల వెలుగులో వికెట్ దక్కడం ఎంత కష్టమో క్రికెటర్లకు తెలుసు. అందుకే వికెట్లు తీయడంపై ఎక్కువ దృష్టి పెట్టలేదు. తదుపరి బంతి ఎలా వేయాలన్న దానిపైనే ఎక్కువ దృష్టి ఉంచా అని తెలిపాడు విజయ్. అనంతరం ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యతో పోల్చడం గురించి మాట్లాడుతూ..నా వరకు ప్రతి రోజు ఆటలో అభివృద్ధి సాధించాలి. ఇదే నాకు ముఖ్యం. పాండ్యలా నేను కూడా ఆల్‌రౌండర్ కావడంతో నన్ను అతడితో పోలుస్తున్నారు. నిజానికి చాలా మంది క్రికెటర్లకు పోలికలు ఇష్టం ఉండవు. నా నుంచి ఎప్పుడూ మంచి ప్రదర్శన ఇవ్వాలని అనుకుంటాను అని విజయ్ చెప్పాడు.

డేవిడ్ వార్నర్‌పై నిషేధం?



దర్బన్ : ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్‌పై ఒక్క మ్యాచ్ నిషేధం పడనుందా! అంటే అవుననే అంటున్నాయి క్రీడావర్గాలు. సఫారీ గడ్డపై ఆస్ట్రేలియా-దక్షిణాఫ్రికా మధ్య జరిగిన తొలి టెస్టులో డేవిడ్ వార్నర్- డికాక్ మధ్య వాగ్వాదం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఐతే, వీడియో ఫుటేజీలో వార్నర్‌దే ఎక్కువ పాత్ర కనిపిస్తోంది. సహచర ఆటగాళ్లు వద్దని వారిస్తున్నా డికాక్‌పైకి దూసుకెళ్లడంతో ఐసీసీ క్రమశిక్షణ చర్యలను ఉల్లంఘించినట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఇప్పటికే దీనిపై ఐసీసీ విచారణ చేపట్టింది. ఐతే గేమ్ ఆఫ్ డిస్ప్యూట్ కింద వార్నర్ ఐసీసీ లెవల్-2 నిబంధనలు ఉల్లంఘించినట్లు తెలుస్తోంది. ఐసీసీ ఇదే చెబితే అతని ఖాతాలో నాలుగు డీమెరిట్ పాయింట్లు చేరతాయి. ఐసీసీ నిబంధనల ప్రకారం ఏ ఆటగాడి ఖాతాలో నాలుగు డీమెరిట్ పాయింట్లు ఉంటే అతడిపై ఒక టెస్టు మ్యాచ్ నిషేధం విధిస్తారు. అంతేకాదు మ్యాచ్ ఫీజులో 100శాతం కోత విధిస్తారు. ఈ లెక్కన వార్నర్ ఆతిథ్య దక్షిణాఫ్రికాతో జరగబోయే రెండో టెస్టులో ఆడటంపై అనుమానాలు నెలకొన్నాయి. ఈ నెల 9 నుంచి పోర్ట్ ఎలిజబెత్‌లో ఇరు జట్ల మధ్య రెండో టెస్టు జరగాల్సి ఉంది. ఐతే, ఆస్ట్రేలియా బోర్డు మాత్రం వార్నర్ తదుపరి టెస్టులో ఆడాలని, జట్టులో అతడెంతో కీలక ఆటగాడని అంటోంది. ఇదిలా ఉంటే వార్నర్‌తో వాగ్వాదంలో ఉన్న డికాక్ ఐసీసీ లెవల్-1 నిబంధనలు ఉల్లంఘించినట్లు మాత్రమే తెలుస్తోంది. ఇదే జరిగితే అతని ఖాతాలో రెండు డీమెరిట్ పాయింట్లతో పాటు మ్యాచ్ ఫీజులో కొంత మేర కోత పడుతోంది. మరి ఐసీసీ ఎవరిపై వేటు వేస్తుందో, ఏం చేస్తుందో తెలియాలంటే వేచి చూడాల్సిందే.

నా భార్య కంటే.. ధోనీనే ఎక్కువ ఇష్టం



న్యూఢిల్లీ : భారత్‌కు రెండు ప్రపంచకప్‌లు అందించిన మహేంద్ర సింగ్ ధోనీ అంటే పడి చచ్చేవాళ్లు చాలా మందే ఉన్నారు. సగటు భారతీయ క్రికెట్ అభిమాని ఎవరైనా ధోనీ శకాన్ని ఎప్పటికీ మరిచిపోలేరు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ, పాక్‌కు చెందిన మహమ్మద్ బషీర్ నా భార్య కంటే నాకు టీమిండియా క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీ అంటేనే ఎక్కువ ఇష్టం అని అంటున్నాడు. ఇంతకీ ఈ బషీర్ ఎవరు.. ధోనీ అంటే ఎందుకు అంత ఇష్టం, అతని కోసం ఏం చేశాడు అనే కదా మీ సందేహం. ఇంకెందుకు ఆలస్యం ఆ కథేంటో తెలుసుకోండి. భారత్-బంగ్లాదేశ్-శ్రీలంక మధ్య జరుగుతోన్న ముక్కోణపు టోర్నీ చూసేందుకు బషీర్ ఇప్పుడు ఆతిథ్య లంకలో పర్యటిస్తున్నాడు. ఈ క్రమంలో విలేకర్ల కంటపడ్డాడు. తనకు ధోనీ అంటే ఎందుకు అంతిష్టమో వారికి వివరించేశాడు. 2011లో ప్రపంచకప్‌లో భాగంగా భారత్-పాకిస్థాన్ మధ్య మొహాలీలో ఓ సెమీఫైనల్ జరిగింది. ఈ మ్యాచ్ చూసేందుకు నేను పాకిస్థాన్ నుంచి రెండు మూడు రోజులు ముందుగానే వచ్చాను. టిక్కెట్ కోసమని మైదానం వద్దకు వెళ్లగా అప్పటికే టిక్కెట్లు అయిపోయినట్లు బోర్డులు కనిపించాయి. దీంతో నేను తీవ్ర నిరాశ చెందాను. తిరిగి వెళ్లిపోదామని అనుకున్న నాలో మ్యాచ్ ఎలాగైనా చూడాలన్న బలమైన కోరిక అలాగే ఉండటంతో మరొక్కసారి ప్రయత్నించడంలో తప్పు లేదనుకున్నాను. అందుకే తర్వాతి రోజు మరోసారి స్టేడియానికి వచ్చాను. అయినా నిరాశ తప్పలేదు. దీంతో అక్కడే దిగాలుగా కూర్చున్నాను. ఇంతలో ఒక వ్యక్తి ఏదో కవరు చేతపట్టుకుని నా దగ్గరికి వచ్చాడు. ఆ కవర్‌ను నాకు ఇచ్చాడు. అందులో ఏముందా అని తెరిచి చూశాను. నా కళ్లను నేనే నమ్మకలేకపోయాను. ఇంతకీ అందులో ఏమున్నాయో తెలుసా.. మ్యాచ్ టిక్కెట్లు. నిజంగా. నమ్మండి. ఎవరు పంపించారో తెలుసా మహేంద్ర సింగ్ ధోనీ. ఇక్కడ ఒక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. అప్పటి వరకు నాకు ధోనీ ఎవరో తెలియదు. కానీ, అప్పటి నుంచి మాత్రం నాకు ధోనీ అంటే చాలా ఇష్టం. ఎంతంటే.. నా భార్య కంటే కూడా నాకు ఎక్కువగా ధోనీనే ఇష్టం అని నవ్వుతూ చెప్పేశాడు బషీర్. ఇప్పటికీ చాలా మంది నన్ను ప్రశ్నిస్తారు. ఎందుకు ఇండియాకు సపోర్టు చేస్తావని? వారందరికీ నేను ఒకటే సమాధానమిస్తా. అదేంటంటే.. ఇండియాలో మనకు కావాల్సినంత ప్రేమ దొరుకుతుంది. మా దేశంలో చాలా మంది వృాఎద్ధులు యువత మనసుల్లో భారత్ ఓ శత్రుదేశమనే విష బీజాలు నాటారు. కానీ అందులో ఎంతమాత్రం నిజంలేదు అని తెలిపాడు బషీర్. రెండు ప్రపంచకప్‌ల హీరో ధోనీ కేవలం భారత్‌లోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నాడు. స్వదేశీ, విదేశీ గడ్డలపై మ్యాచ్‌లు జరుగుతున్న సమయంలో అభిమానులు భద్రతా సిబ్బందిని దాటి ధోనీకి పాదాభివందనం చేయడం అది అతనిపై వారికున్న అభిమానాన్ని చాటుతోంది.

షమిపై కేసు

ఏడు సెక్షన్లు ఉపయోగించిన పోలీసులు



కోల్‌కతా : టీమిండియా క్రికెటర్ మహమ్మద్ షమిపై కేసు నమోదైంది. అతడు మోసగాడని, పలువురు మహిళలతో సంబంధాలున్నాయని, తనపై గృహ హింసకు పాల్పడుతున్నాడని బుధవారం సాయంత్రం షమి భార్య హసీన్ జహాన్ న్యాయవాదితో కలిసి కోల్‌కతా పోలీస్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసులు శుక్రవారం షమితో పాలు మరో నలుగురిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఐపీసీ 498ఏ, 323, 307, 376, 506, 328, 34 సెక్షన్ల కింద వీరిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఐపీఎల్ ఫ్రాంచైజీ ఢిల్లీ డేర్‌డెవిల్స్ బహుమతిగా ఇచ్చిన ఫోన్‌లో వాట్సాప్ ద్వారా ఇతర మహిళలతో అతడు జరిపిన అసభ్యకర సంభాషణల తాలూకు స్క్రీన్ షాట్‌లను హసీన్ పోస్టు చేసింది. 2014లో జూన్ 6న షమి- హసీన్ పెళ్లి చేసుకున్నారు. 2015 జులైలో వారికి ఆడపిల్ల జన్మించింది. పెళ్లయిన నెలకే షమి వ్యవహారాల గురించి తెలిసినా.. ఏమీ చేయలేకపోయాను. షమితో పాటు అతడి కుటుంబ సభ్యులు అసభ్య పదజాలంతో దూషించేవారు. మానసికంగా, శారీరకంగా హింసించారు. తెల్లవారుజామున 2-3 గంటల వరకు వేధింపులు కొనసాగేవి. తనను చంపేందుకు ప్రణాళికలు రచించారు. షమి అప్పుడప్పుడు కొట్టేవాడు అని హసీన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం.

హసీన్ వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకున్న బీసీసీఐ కొత్తగా ప్రకటించిన కాంట్రాక్ట్ జాబితాలో షమి పేరు తొలగించిన సంగతి తెలిసిందే. షమి టీమిండియా తరఫున 30 టెస్టుల్లో, 50 వన్డేల్లో, 7 టీ20ల్లో ఆడాడు.

మహమ్మద్ షమి అలాంటి వాడు కాదు : కపిల్‌దేవ్

టీమిండియా పేసర్ మహమ్మద్ షమికి అండగా నిలిచాడు మాజీ క్రికెటర్ కపిల్‌దేవ్. షమి మోసగాడని, ఇతర మహిళలతో సంబంధాలున్నాయని, ఓ పాకిస్థానీ మహిళ నుంచి డబ్బు తీసుకున్నాడని ఆయన భార్య హసీన్ జహాన్ చేసిన వ్యాఖ్యలను కపిల్‌దేవ్ ఖండించాడు. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..హసీన్ రెండు సంవత్సరాల నుంచి తన జీవితంలో కఠినమైన పరిస్థితులను ఎదుర్కొంటుంటే ఇంత ఆలస్యంగా ఎందుకు బయటకు తీసుకువచ్చింది. మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడని, తనను చంపేందుకు ప్రయత్నించాడని ఏవేవో ఆరోపణలు చేస్తోంది. ఎప్పుడో మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడితే ఇప్పటి వరకు ఎందుకు నోరు విప్పలేదు. భర్తతో సంబంధాలు బాగానే ఉన్నంత వరకు ఏమీ చెప్పరా? అదే సంబంధం సరిగా లేకపోతే ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తారా? అంటూ కపిల్‌దేవ్ ప్రశ్నించాడు. హసీన్ చేసిన వ్యాఖ్యల్లో ఎంతమాత్రం నిజం లేదు. షమి ఎంతో ప్రతిభ గల ఆటగాడు. కష్టపడే మనస్తత్వం అతనిది. అతని వ్యక్తిగత జీవితంలో ఏవో సమస్యలు ఉన్నాయని నాకూ తెలుసు. కానీ, అతని భార్య ఇలా ఆరోపించడం ఏమాత్రం బాగోలేదు. రంగంలోకి దిగిన దర్యాప్తు బృాఎందం తన పని తాను చేసుకుపోతుంది. ఒకవేళ ఈ దర్యాప్తులో షమి తప్పు చేసినట్లు రుజువైతే దాన్ని ఎవరూ ఆమోదించలేరు. అని కపిల్‌దేవ్ అన్నాడు.




అమ్మగా సెరెనా తొలి విజయం




ఇండియన్‌వెల్స్ : ప్రపంచ మాజీ నెంబర్‌వన్, అమెరికా అగ్రశ్రేణి టెన్నిస్ క్రీడాకారిణి సెరెనా విలియమ్స్ తల్లి అయిన తర్వాత తొలి విజయాన్ని నమోదు చేసుకుంది. ఇండియన్ వెల్స్‌లో జరుగుతోన్న డబ్ల్యూటీఏ ఈవెంట్‌లో పాల్గొన్న సెరెనా తొలి రౌండ్లో విజయం సాధించి రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది. గత ఏడాది ప్రతిష్టాత్మక ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేతగా నిలిచిన సెరెనా.. గర్భం దాల్చడంతో టెన్నిస్ కోర్టుకు దూరంగా గడిపింది. సెప్టెంబరులో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిన సెరెనా ఆ తర్వాత కొద్ది రోజులపాటు చావు బతుకుల మధ్య పోరాటం చేసింది. ఎట్టకేలకు కోలుకుని ప్రియుడు అలెక్సిస్ ఓహియాన్‌ను పెళ్లి చేసుకుంది. తనకు ఎంతో ఇష్టమైన టెన్నిస్‌ను తిరిగి కొనసాగించాలని నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలోనే 2017 డిసెంబరులో తిరిగి కోర్టులోకి అడుగుపెట్టింది. ఓ ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడిన సెరెనా ఓటమి పాలైంది. అయినా ఏ మాత్రం ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. మరింత కసిగా ప్రాక్టీస్ చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో డేవిస్ కప్ కోసం అక్క వీనస్‌తో కలిసి డబుల్స్‌లో ఆడింది. ఇందులోనూ పరాజయం తప్పలేదు. అయినా తన పోరాటాన్ని ఆపలేదు. తిరిగి పుంజుకుని సాధన చేసిన ఆమె ఇండియన్ వెల్స్‌లో డబ్ల్యూటీఏ ఈవెంట్‌లో పాల్గొంది. టోర్నీలో భాగంగా గురువారం రాత్రి కోర్టులో అడుగుపెట్టింది. గ్యాలరీలో కూర్చుని ఉన్న ప్రేక్షకులు లేచి నిలబడి చప్పట్లతో సెరెనాకు స్వాగతం పలికారు. దీంతో ఆమె ఆనందానికి అవధుల్లేవు. హోరాహోరీగా జరిగిన పోరులో సెరెనా 7-5, 6-3 తేడాతో కజకిస్థాన్ క్రీడాకారిణి జరీనా దియాస్‌పై విజయం సాధించింది. జీవితంలో మాతృాఎత్వపు ఆనందాన్ని తనివితీరా ఆస్వాదిస్తున్న సెరెనా విలియమ్స్‌కు ఇదే తొలి గెలుపు. రెండో రౌండ్లో సెరెనా.. కికి బెర్టన్స్‌తో తలపడనుంది. ఒకవేళ రెండో రౌండ్లో సెరెనా విజయం సాధిస్తే మూడో రౌండ్లో ఆమె సోదరి వీనస్‌తో తలపడే అవకాశం ఉంది.

ఉబెర్‌కు అంబాసడర్‌గా కోహ్లీ

న్యూఢిల్లీ : భారత క్రికెట్ జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లీ మరో ప్రముఖ సంస్థకు ప్రచారకర్తగా నియ మితుడయ్యారు. క్యాబ్ ఆపరేటర్ ఉబెర్ ఇండియాకు బ్రాండ్ అంబాసిడర్‌గా బాధ్యతలు స్వీక రించారు . ఈ మేరకు టీమిండియా కెప్టెన్ శుక్ర వారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉబెర్ ఇండియాతో కొత్త సక్సెస్‌ఫుల్ ఇన్నింగ్స్ కోసం సిద్ధంగా ఉన్నానంటూ ట్వీట్ చేశారు. ఉబెర్‌తో భాగస్వామ్యం పట్ల సంతోషం వ్యక్తం చేసిన కోహ్లీ మాట్లాడుతూ ఓ క్రికెటర్‌గా నేను చాలా ప్రదేశాల్లో పర్యటించాననీ ఉబెర్‌లో తన మొదటి అనుభవం ఇంకా గుర్తుందని తెలిపారు. ఉబెర్ క్యాబ్ ద్వారా తన కు మంచి అనుభూతి ఉందని తెలిపారు. అధునాతన టెక్నాలజీని ఉపయోగించి ప్రజలు వివిధ ప్రాంతాలకు వెళ్లేలా ఒక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి, ఆర్థిక అవకాశాలను సృాఎష్టించడం ద్వారా లక్షలాది మందికి సాధికారికత కల్పించడం గొప్పవిషయమని పేర్కొన్నారు. తమకు భారత్ కీలకమైన మార్కెట్‌గా ఉన్ననేపథ్యంలో ఇండియాలో ఉబెర్ పెట్టుబడుల ప్రవాహం ఇకపై కూడా కొనసాగుతుందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. కాగా ప్రస్తుతం క్రికెట్‌కు దూరంగా ఉండి విశ్రాంతి తీసుకుంటున్న విరాట్ కోహ్లీ ఇప్పటికే పలు దేశీయ, అంతర్జాతీయ కంపెనీల బ్రాండ్లు, ఉత్పత్తులకు బ్రాండ్ అండాసిడర్‌గా ఉన్నసంగతి తెలిసిందే.



3.4 ఓవర్లు.. 4 పరుగులు.. ఖాతాలో ఐదు వికెట్లు



దుబాయ్ : పదిహేడేళ్ల పాకిస్థాన్ కుర్రాడు షహీన్ అఫ్రిదీ పేరు ఇప్పుడు ప్ర పంచ వ్యాప్తంగా మారుమోగిపోతోంది. బంతితో మైదానంలో షహీన్ దుమ్ము రేగొట్టాడు. పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో భాగంగా కేవలం నాలుగు పరుగులు ఇచ్చి.. ఐదు వికెట్లు పడగొట్టాడు. తద్వారా టీ-20 ఫార్మట్‌లో అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన కనబరిచిన నాలుగో బౌలర్‌గా నిలిచాడు. శుక్రవారం లాహోర్ క్వాలాండర్స్, ముల్తాన్ సుల్తాన్స్ మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ముల్తాన్ జట్టు ఒక దశలో 8 ఓవ ర్లలో వికెట్ నష్టానికి 60 పరుగులు చేసింది. ఇక అక్కడ నుంచి షహీన్ బంతితో చెలరేగిపోయాడు. 3.4 ఓవర్లు వేసిన షహీన్ కేవలం నాలుగు పరుగులు మాత్రమే ఇచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. 16వ ఓవర్లలో మూడు వికెట్లు దక్కించుకోవటం విశేషం. వెరసి సుల్తాన్ ముల్తాన్ జట్టును 114 పరుగులకే షహీన్ కట్టడి చేశాడు. ఇక ఓవరాల్‌గా టీ20 ఫెర్మామెన్స్ గనుక గమనిస్తే... శ్రీలంక బౌలర్ హెరాత్ న్యూజిలాండ్‌పై, రషీద్ ఖాన్ ఐర్లాండ్‌పై, సోహైల్ తన్వీర్ ట్రిడెంట్స్ జట్టులపై 3 పరుగులిచ్చి ఐదేసి వికెట్లు పడగొ ట్టారు. ఈ లిస్ట్‌లో కుంబ్లేను (5 పరుగులు 5 వికెట్లు రాజస్థాన్ రాయల్స్‌పై) కిందకి నెట్టి షహీన్ ఇప్పుడు నాలుగో స్థానంలో నిలిచాడు.

మ్యాచ్ మరింత గొప్పగా చూడొచ్చు
జియో సృష్టించిన మరో అద్భుతం

ముంబై : క్రికెట్ ప్రేమికులకు శుభవార్త అందిస్తూ.. సాంకేతికతలో విప్లవంలా జియో మరో కొత్త శకం ఆరంభించింది. జియో లైవ్ టీవీ యాప్‌లో మార్పులు చేస్తూ.. ప్రస్తుత మ్యాచ్ చూసే విధానాన్ని పూర్తిగా మార్చేయనుంది. జియో ప్రవేశపెట్టిన ఈ పరిజ్ఞానం ద్వారా క్రికెట్ మ్యాచ్‌ను ఐదు కెమెరా యాంగిల్స్‌లో వీక్షించవచ్చు. అంతే కాకుండా ఆడియోను గ్రౌండ్ మధ్య వికెట్ల వద్ద ఉన్న మైక్ నుంచి వినోచ్చు. మనకు కావాల్సిన భాషలో (ఇంగ్లీష్, హిందీ, తెలుగు, కన్నడ, తమిళ) కామెంట్రీని వినోచ్చు. ఇంకా, మ్యాచ్ స్కోర్, బంతులు, రన్‌రేట్, వంటి గణంకాలను మనకు నచ్చినప్పుడు, కావాల్సినప్పుడు ఒక్క క్లిక్‌తో చూసుకోవచ్చు. మ్యాచ్‌లో ఎద్దైన బంతిగాని, వికెట్ గాని, సిక్స్‌గాని మిస్ అయితే క్యాచ్ అప్ ద్వారా మళ్లీ వెనక్కి వెళ్లి వీక్షించవచ్చు. ఇలాంటి అద్భుతమైన ఫీచర్లతో కొత్త జియో లైవ్ టీవీ యాప్ అందుబాటులోకి రానుంది. క్రీడల్లో ఏఆర్, వీఆర్, ఇమ్మెర్సివ్ వ్యూయింగ్లో రాబోయే రోజుల్లో జియో విశేషమైన అనుభవాన్ని అందించడానికి కొనసాగుతుంది అని జియో డైరెక్టర్ ఆకాష్ అంబానీ అన్నారు. ఇటీవల జియో ఉత్తమ మొబైల్ వీడియో కంటెంట్ ప్రపంచ ప్రఖ్యాత గ్లోబల్ మొబైల్ (గ్లిమో) అవార్డును గెల్చుకుంది. మార్చి నుంచి కొలంబోలో జరిగే టీ20 క్రికెట్ సిరీస్ నిదహస్ ట్రోఫీకి ప్రత్యేకమైన డిజిటల్ హక్కులను సొంతం చేసుకుంది. మ్యాచ్ వీక్షణలో కొత్త అనుభూతిని పొందటానికి జియో టీవీ యాప్‌ను అప్‌డేట్ చేసుకుంటే సరిపోతుంది. లేని వారు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044·